ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
7-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 187 పేజీలు: 12 వెల: 6.50

**పిల్లల్ని కనండి.. 44వేలు పట్టుకోండి**

**పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిలు**

5లో

## భారత్‌పై అమెరికా సుంకం ఇక 50 శాతం



### 25% పెంచిన ట్రంప్ ప్రభుత్వం

### రష్యా చమురు కొనుగోళ్లపై ప్రతీకారం

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకున్నంతపనీ చేసారు. రష్యా కొనుగోళ్లు నిలిపి వేయకపోతే 25 శాతం అదనపు సుంకాలు వేస్తామని హెచ్చరించిన ట్రంప్ 24 గంటల్లోనే తన నిర్ణయాన్ని అమలుచేసారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం ప్రతీకార సుంకం విధించిన అమెరికా అధ్యక్షుడు ఇకపై భారత్‌నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికాలో అదనంగా 25శాతం సుంకాలు వసూలు చేస్తారు. అంటే మొత్తం భారత్‌నుంచి వచ్చే ఉత్పత్తులపై 50శాతం సుంకం పడుతుంది. బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకంచేసారు. రష్యానుంచి ప్రత్యక్షంగా పరోక్షంగా చమురు కొనుగోళ్లు జరుపుతున్నందువల్లనే ఈసుంకాలువేసామని ట్రంప్ తనకార్యనిర్వాహక ఉత్తర్వుల్లో స్పష్టంగా వెల్లడించారు. ప్రతీకార సుంకాల్లోభాగంగా ఇప్పటికేవిధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమలులోకి వస్తుండగా కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపచేస్తున్నట్లు ట్రంప్ తన ఉత్తర్వుల్లో వివరించారు. ఒకవేళ ఈసుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదేని సుంకాలు వేయాలని ప్రయత్నిస్తే ఈ ట్యారిఫ్‌లను అధ్యక్షుడు సవరించవచ్చని శ్వేతసౌధం ఒకప్రకటన విడుదలచేసింది. దీనిపై కేంద్రం స్పందనకోసం వాణిజ్యవేత్తలు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజా పరిణామాలపై కాంగ్రెస్ స్పందించింది. ట్రంప్ నిరంతరం మనదేశంపైచర్యలు తీసుకుంటున్నా ప్రధానిమోడీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడంలేదని విమర్శలు ఎక్కుపెట్టింది. ఇప్పటికైనా ప్రధానిమోడీ ధైర్యంచూపించి ట్రంప్ చర్యలక తగిన సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ తన సోషల్‌మీడియా ఖాతాలో పోస్టుచేసింది.

# 15 నుంచి మహిళలకు 'ఉచిత బస్సు'

### ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ గ్రీన్ సిగ్నల్

### పల్లెవెలుగు, అల్ట్రా ఎక్స్‌ప్రెస్‌లలో కూడా పథకం అమలు

### చేనేత రంగ బలోపేతానికి పలు కీలక నిర్ణయాలు

### సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ: సిఎం చంద్రబాబు



బుధవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలో స్త్రీశక్తి పేరిట ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మార్గదర్శకాలు ఖరారయ్యాయినట్లు వివరించారు. రాష్ట్ర పరిధిలో ఎపి మహిళలకు ఈ పథకం అమలులోకి వస్తుందని తెలిపారు. ఎపి మంత్రి మండలి సమావేశంలో బుధవారం ఎపి సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ బేటీలో దగ్గరదగ్గర 12 అజెండా అంశాలపై చర్చ జరిగింది. అంశాలన్నింటిపైన దాదాపుగా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని వస్తున్న మహిళ ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమానికి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి అయినా ఆర్టీసీ బస్సుల్లో ఈ పథకం అమలుకు నిర్ణయించారు. విద్యార్థినులు ప్రత్యేకంగా పాస్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే విధంగా ఎపి పరిధిలో ఉంటున్నట్లుగా ఏదైనా గుర్తింపు పొందిన కార్డు ద్వారా ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. జీరో టికెటింగ్ విధానం ద్వారా ఈ పథకం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, అల్ట్రా ఎక్స్ ప్రెస్‌లలో కూడా ఈ పథకం అమలులో ఉండనుంది.

ఈ నెల 9న రాఖీ పూర్ణిమ నాడు పథకం అమలు పైన ప్రభుత్వం ప్రకటన చేయనుంది.. 15వ తేదీ నుంచి అమల్లోకి రానుంది ఇక పలు అంశాలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది రాష్ట్రంలో 5.25కోట్ల జనాభా ఉండగా అందులో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఈ పథకం క్రింద రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు ట్రాన్స్ జెండర్లు ఎక్కడినుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం జరిగింది. ఈ సౌకర్యం వినియోగించుకునేందుకు వీరు >>2



## రైళ్లలో భద్రతకు సిసి కెమెరాలు

### 74 వేల కోచ్‌లలో ఏర్పాటుకు చర్యలు: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారతీయ రైల్వేలో ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 74,000 రైల్వే కోచ్‌లతో పాటు 15,000 లోకోమోటివ్‌లలో (ఇంజిన్లు) సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నేడు పార్లమెంటుకు తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇప్పటికే వివిధ రైల్వే జోన్ల పరిధిలో 11,535 కోచ్‌లలో సిసి టివి కెమెరాల ఏర్పాటు పూర్తయిందని మంత్రి వివరించారు. భవిష్య >>2

# 20 లక్షల ఉద్యోగాల కల్పన



బుధవారం విజయవాడలో జరిగిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తు మంత్రి నారా లోకేష్..

### • గ్రీన్ ఎనర్జీ ద్వారా గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు

### • సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ఆరంభం • గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ.ఆగస్టు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్‌లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌కు మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్‌గా ఎపిని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మనయువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశంలో ఏపార్టీ సాధించనివిధంగా కూటమి ప్రభుత్వం 94శాతం స్ట్రైక్ రేట్‌తో 164 సీట్లను కైవసం చేసుకోవడంజరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం.

ఒకే రాష్ట్రం ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌హబ్‌గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశంజిల్లాను సిబిజిహబ్‌గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్‌గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్‌గా, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారు చేస్తాం. ప్రతి వంద కి.మీలకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతోపాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్‌తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన >>2

## 'పి-4' ద్వారా 5 లక్షల కుటుంబాలకు ఉపాధి

### - మంత్రి వాసంశెట్టి సుభాష్

**సచివాలయం,ఆగస్టు 6,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు వైసిపికి కునుకు లేకుండా చేస్తుందని కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవ చేశారు. బుధవారం సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనైనా ప్రతిపక్ష హోదాను దక్కించుకునే విషయంపై వైసిపి దృష్టిపెడితే మంచిదన్నారు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కారుకూతలు కూస్తుంటే రెండు స్థానాలు దక్కవని మంత్రి సుభాష్ విమరి ్శంచారు. సూపర్ సిక్స్ పథకాలను అపహాస్యం చేసిన వైసిపి నాయకులకు పథకాల అమలు తీరును చూసి దిమ్మతిరిగి పోయిందన్నారు.

ఆగస్టు 15నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచితబస్ అందు బాటులో ఉంటుందని సుభాష్ తెలిపారు. అన్నదాత సుఖీభవకూడా అమలు అవుతోందని రైతులందరూ చాలా ఆనందంగా ఉనా ్నరన్నారు. తల్లికి వందనం పై వైసిపి అపహాస్యం చేసి నేడు ప్రజల్లో తలెత్తుకోలేక పోతుందని మంత్రి చురకలంటించారు. సుపరిపాల నలో తొలిఅడుగులో >>2

## సిట్ విచారణకు చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ స్కాం కేసులో సిట్ ఎదుట విచారణకు పిఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఎండి చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివారెడ్డి హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో మిథున్ రెడ్డి అరెస్టు తరువాత పిఎల్ఆర్ సంస్థ ప్రతినిధులను విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు వారు బుధవారం విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో పిఎల్ఆర్ సంస్థ ఖాతాల్లోకి డబ్బు బదిలీ అయినట్లు వైఎస్సార్సీ ఎంపి మిథున్ రెడ్డి రిమాండ్ >>2

## లిక్కర్ స్కాం ప్రధాన నిందితుడు కసిరెడ్డి ఆస్పత్రికి తరలింపు

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** లిక్కరు స్కాం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి (ఎ1) విజయవాడ జైల్లో ఉన్నారు. ఆయన ఈరోజు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం జైలు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన కిడ్నీలో స్టోన్స్ సమస్యతో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. రాజ్ కసిరెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆయనను చికిత్స అనంతరం తిరిగి కస్టడీకి పంపించే అవకాశం ఉంది. ఈ కేసులో ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన పలు మార్లు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లును న్యాయస్థానం కొట్టివేసాయి. ఇటీవల హైదారాబ్‌లో సిట్ సోదాల్లో పట్టుబడిన రూ.11కోట్లు రాజ్ కసిరెడ్డికి చెందినట్లుగా కథనాలు వచ్చాయి. ఈ డబ్బుతో తనకు సంబంధం లేదని రాజ్ కసిరెడ్డి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసారు.

## రాజధాని గ్రామాల్లో రూ. 900 కోట్లతో మౌలిక వసతులు



### ఈ నెలాఖరులోగా డిపిఆర్ సిద్ధం: మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని గ్రామాల్లో రూ.900 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని, ఆగస్టు ఆఖరుకు డిపిఆర్ సిద్ధం అవుతుందని,పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. త్వరలో టెండర్లు పిలిచి రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర పనులు ప్రారంభిస్తామని విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో రాజధాని రైతు ఐకాస ప్రతినిధులతో మంత్రి, కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. ఆ క్రమంలో రైతులు పలు సమస్యలను మంత్రికి వివరించారు. అమరావతికి చట్టబద్ధత తెచ్చేలా పార్లమెంటులో చట్టం చేసేలా చొరవ చూపాలని రైతులు మంత్రిని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ, వీలైతే ఈ సమావేశాల్లో జరిగేలా చూస్తామనీ, లేదంటే తర్వాత సమావేశాల్లోనైనా అయ్యేలా బాధ్యత తీసుకుంటామన్నారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చర్యలకు మంత్రి సిఫార్సు చేసారు. రైతులు గ్రామకంఠం, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో వచ్చిన ప్లాట్ల సమస్యలు పరిష్కరించాలని కోరగా వాటిని వెంటనే చక్కదిద్దుతామని మంత్రి చెప్పారు.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల పిటిషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రైతులు సూచించారు. ఆ విషయంలో న్యాయ సలహా మేరకు సాగుతామని మంత్రి బదులిచ్చారు. అర్హులకు ఇంకా కౌలు సరిగా జమ కావడం లేదని రైతులు తెలపగా, నెలలోగా ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి వారికి చెప్పారు. ఆర్5 జోన్ సమస్యనూ త్వరగా కొలిక్కి తెస్తామన్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వ నిర్వాకంతో టిడ్కో ఇళ్లు పూర్తి కాకుండా ఈఎంఐలు కట్టాల్సి వస్తోందని రైతులు వాపోయారు. జరీబు, మెట్ట భూముల ప్లాట్ల కేటాయింపులో తేడాలు సవరిస్తామనీ, హెచ్‌టీ లైన్లను భూగర్భంలోకి మార్చేందుకు రూ.1,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

## నేతన్నల బతుకుల్లో కొత్త వెలుగులు

### నేడు చేనేత దినోత్సవం సందర్భంగా 3 పథకాలకు శ్రీకారం

### రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్ పథకం అమలు

### చేనేతలకిచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చిన సిఎం చంద్రబాబు

### మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం



చేనేత మగ్గంపై సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఏడాది కాలం నుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాలకు నాంది పలికింది. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2.50 లక్షల మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారు. ఎపిలో 986 చేనేత సహకార సంఘాలు నేతన్నలకు ఉపాధి కల్పిస్తున్నాయి. రాష్ట్రంలో చేనేత రంగం రూ.1,374 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేనేతలకు ప్రోత్సాహం కరువవ్వడంతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా లభించలేదు. దీంతో 2019-24 కాలంలో రాష్ట్ర చేనేత రంగంలో చీకటి కాలంగా మిగిలిపోయింది. సిఎం చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి నారా లోకేశ్ చేనేత కష్టాలను చూసి చలించిపోయారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఇచ్చిన హామీలనను నిలబెట్టుకుంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి చేనేతలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయిస్తున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి రూ.10 వేల కోట్ల పెట్టుబడితో నూతన టెక్స్ టైల్స్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా 1.51 >>2

# పులివెందులలో హోరాహోరీ

### పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన జడ్పీటిసి ఎన్నికలు

### పులివెందుల, ఒంటిమిట్ట కైవసానికి టిడిపి, వైఎస్సార్సీ తీవ్ర యత్నాలు

**కడప, ఆగస్టు 6, ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి కడప జిల్లాలో జరగనున్న జడ్పీటిసి ఎన్నికలు తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. గత శాసనసభ ఎన్నికల తరువాత మొదటిసారి జరిగే ఈ ఉప ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు సీరియస్‌గా తీసుకున్నాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒంటిమిట్ట జడ్పీటిసిగా ఉన్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన జడ్పీటిసి స్థానానాకి రాజీమానా చేయగా, పులివెందుల జడ్‌పిటిసిగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి ఒక ఉత్సవంలో జరిగిన ప్రమాదంలో మరనించడంతో ఈ ఉపఎన్నికలు జరుగుతున్నాయి. ఎలాగైనా ఈ రెండింటిని దక్కించుకోవాలని రెండు పార్టీలు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నాయి. నామినేషన్ల పర్వం ముగియడంతో పార్టీలు ప్రచారంపై దృష్టి సారించాయి. పులివెందుల మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత మండలం కావడంతో ఎలాగైనా తమ అభ్యర్థిని గెలుపించుకోవాలని వైకాపా నేతలు పావులు కదుపుతున్నారు. పులివెందుల రూరల్ పరిధిలో ఆర్ తుమ్మలపల్లి, రాయలాపురం, రచ్చుమర్రి పల్లి, అచ్చవెల్లి ,ఎర్రిపల్లి, కృనపల్లి, యర్రబల్లి, నల్లపురెడ్డిపల్లి, ఈ.కొత్తపల్లి తదితర 9 గ్రామపంచాయ తీలకు సంబంధించి 10601 ఓట్లు కలిగి ఉన్నాయి. గత ఎన్నికల్లో ఈ జెడ్పీటిసి స్థానం వైకాపా ఏకగ్రీవంగా తుమ్మల మహేశ్వర్ రెడ్డి నియామకం అయ్యారు. 2022 మార్చి 19వ తేదీన ఆరు తుమ్మలపల్లి గ్రామ సమీపంలోని గంగమ్మ జాతర నందు సిరిబండి నడుపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి జడ్పీటిసి మహేశ్వర్‌రెడ్డిమృతి చెందాడు. దీనితో జడ్పీటిస్థానం ఖాళీ అయింది. ఇక ఒక ఏడాది మాత్రమే సమయం ముగుస్తుంది అనగా అనూహ్యంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ జెడ్పీటిసి స్థానానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనితో వైఎస్సార్సీ తరపున తుమ్మల మహేశ్వర్ రెడ్డి కుమారుడు తుమ్మల హేమంత్ రెడ్డిని బరిలో దింపింది. కూటమి తరఫున నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి లతారెడ్డిని బరిలో >>2

## మరో 4 రోజులు వర్ష సూచన

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు తీరంతో పాటుగా రాయలసీమ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావం కారణంగా రాబోయే నాలుగు రోజుల్లో ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విజయవాడ(అమరావతి) వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి >>2

7-8pg2exHMNWJQE.qxd:7-8pg2exHMNWJQE.qxd 1/1/02 8:52 AM Page 1





బుధవారం అమరావతిలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్

# సిఎంను కలిసిన థాయ్ ప్రతినిధి బృందం

## రాష్ట్రంలో పెట్టుబడులపై ఉన్న అవకాశాలపై చర్చ

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సిఎం చంద్రబాబుతో అమరావతిలో సమావేశమైంది. వీరితో పాటు సిసిఎఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధులూ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు,పలు అంశాల్లో సహకారంపై సమావేశంలో చర్చించామని సిఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలో హైడ్రోజన్,గ్రీన్, డిఎపి ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన హెచ్2ఏ ప్రైవేటు లిమిటెడ్,హెల్క్ సంస్థల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని సచివాలయంలో కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు.

# చదవలేక పోతున్నా..

# అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా

## ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య



రెడ్డి శ్రావణి (ఫైల్)

**మదనపల్లె క్రైమ్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** నాన్నా, అక్క క్షమించండి.. మీరనుకున్నంత స్థాయిలో చదవలేక పోతున్నా, అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా అంటూ బిటెక్ విద్యార్థిని సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సుధాకర్ రెడ్డి, లేట్ సుగుణ దంపతులకు కుమార్తెలు అశ్విని, ప్రసన్న, రెడ్డి శ్రావణిలు ఉన్నారు. తల్లి సుగుణ 5 సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా, తండ్రి సుధాకర్ రెడ్డి అన్నీ తానై చేనేత మగ్గాల పని చేసుకుంటూ ముగ్గురు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె అశ్వినికి వివాహం చేశాడు. రెండవ కుమార్తె ప్రసన్న డిగ్రీ వరకు చదివి ఇంటిపట్టునే ఉంటోంది. మూడో కుమార్తె రెడ్డి శ్రావణి(19) పులివెందుల జెఎన్టీయూ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. శ్రావణిని, సుధాకర్ రెడ్డి మూడు రోజుల క్రితం కళాశాల వెళ్లి ఇంటికి తీసుకొచ్చాడు. చదువు ఒత్తిడిని భరించలేని రెడ్డి శ్రావణి తనపై నాన్న, అక్క పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టలేక పోతున్నానట్టు తనలో తానే కుంగిపోయి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. 5వ తేదీ మంగళవారం అర్ధరాత్రి నాన్న, అక్క గాఢనిద్రలో ఉన్న సమయంలో తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయాన్నే నిద్ర లేచిన తండ్రి సుధాకర్ రెడ్డి కుమార్తె ఉరికి వేలాడుతుండటాన్ని చూసి మరో కుమార్తె ప్రసన్నతో కలిసి ఆర్తనాదాలు చేశారు.సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతురాలురాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనంచేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీహార్‌లోని ఓటరు జాబితాల సమీక్షలో అక్రమాలకు నిరసనగా ఆందోళనలో పాల్గొన్న ప్రియాంక, ఇతర ఎంపీలు

# 20 లక్షల ఉద్యోగాల కల్పన

>> నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్‌ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్‌లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నావద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్‌లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలోకూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సిబిజి ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సిఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్‌తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

# సిట్ విచారణకు చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి

>> రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. ఈ విషయంపై పిఎల్ఆర్ ప్రాజెక్ట్స్ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు సిట్ అధికారులు. లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిన్న వాదనలు ముగిశాయి. ఇరువైపు వాదనలు విన్న ఎసిబి కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్నారు. ఇదే కేసులో అరెస్టయిన ఆయనప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# త్వరలో పలు జిల్లాల పేర్లు మార్పు

## కొన్ని నియోజకవర్గాల విలీన ప్రక్రియ

## పాలనా సౌలభ్యం కోసం కొన్ని మండలాలు పక్క జిల్లాల్లో విలీనం

## మళ్లీ సాయం చేయనున్న సింగపూర్

## కేబినెట్ భేటీ అనంతరం సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంపై సింగపూర్ ప్రభుత్వానికి సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని సిఎం చంద్రబాబు అన్నారు.విశాఖలో నిర్వహించే సమ్మిట్‌కు వారిని ఆహ్వానించి, ఒప్పిం చడానికి ఎంతో శ్రమపడ్డామన్నారు. అమరావతి లోని సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం సిఎం చంద్రబాబు తాజా రాజకీయ అంశాలపై మంత్రులతో చర్చించారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల సింగపూర్ ప్రభుత్వం భయపడిన తీరు సిఎం వివరించారు. నవంబర్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం అంత తేలిగ్గా ఒప్పుకోలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో అక్కడకు వెళ్లి సింగపూర్ మంత్రులను సైతం వైఎస్సార్సీ బెదిరిం చిందని మండిపడ్డారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి అప్పుడు తెచ్చారని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్‌ను ప్రారంభించే కార్యక్రమంలో మంత్రులు అందరు పాల్గొనాలని సిఎం స్పష్టం చేశారు. నూతన బార్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాప్‌లలో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించక ముందే ఆటో డ్రైవర్లను పిలిపించి మాట్లాడాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మంచిసూచన అని కితా బిచ్చిన సిఎం వెంటనే ఆటో డ్రైవర్లను పిలిపించి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలానే రాష్ట్రంలో కొన్ని జిల్లాల పేర్లు మార్పు, పలు నియోజకవర్గాలు పక్కజిల్లాల్లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలు నెల రోజుల్లో పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళ పరిస్థితికి త్వరితగతిన తెరదించాలని స్పష్టం చేశారు. దీనిపై ఇటీవలే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైనందున పని వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా వైఎస్సార్సీ నేతలు మన మీద పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీటిపై మంత్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అందరు తమ సబ్జెక్ట్‌ల మీద బాగా స్టడీ చేస్తూ వెంటనే తిప్పికొట్టాలని సిఎం చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు. నేతన్న కుటుంబాలకు మరింత లబ్ధి చేకూర్చాల్సిన అవసరంఉందని సిఎం అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవమైన రేపు వారికి అద నపు లబ్ధి చేకూరేలా ఓ ప్రకటన ఉంటుందని అన్నారు.

# సిసి కెమెరాలు

>> త్తులో ప్రతి కోచ్‌లోని రెండు ప్రవేశ మార్గాలవద్ద రెండేసి చొప్పున మొత్తం నాలుగు కెమెరాలను బిగించనున్నట్లు తెలిపారు. అదే విధంగా, ప్రతి రైలు ఇంజిన్‌లో ఆరు కెమెరాలను అమర్చనున్నారు. ఇంజిన్‌కు ముందు, వెనుక, ఇరువైపులా ఒక్కో కెమెరాతో పాటు రెండు క్యాబిన్‌లలో ఒక్కో కెమెరా ఉంటుందని పేర్కొన్నారు. వీటితో పాటు రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లు కూడా ఉంటాయని ఆయన స్పష్టంచేశారు. ఈ కెమెరాలన్నీ ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలతో ఉంటా యని మంత్రి హామీ ఇచ్చారు. ఎస్‌టీక్యూసీ సర్టిఫికేషన్‌తో పాటు ఆర్‌డీఎస్ఓ నిర్దేశాలకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న రైళ్లలో కూడా ఈ కెమెరాలు స్పష్టమైన ఫుటేజ్‌ను అందిస్తాయని ఆయన చెప్పారు. కోచ్‌లలోని డోర్ల వద్ద ఉండే ఉమ్మడి ప్రదేశాల్లో మాత్రమే కెమెరాలను అమర్చడం వల్ల ప్రయాణికుల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని మంత్రి భరోసా ఇచ్చారు.

# కుటుంబాలకు ఉపాధి

>> బ్రహ్మారథం పట్టారన్నారు.పి-4 పథకం కింద 5లక్షల మందికి జీవనోపాధి కలిగించబోతున్నారని మంత్రి సుభాష్ తెలియజేశారు.రెడ్ బుక్ పేరు చెప్పితే వైసీపీ నాయకులకు ఎక్కడ లేని రోగాలు వచ్చేస్తున్నాయని మంత్రి వ్యంగా య్రస్త్రాలు సంధించారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలకు చట్టరీత్యా చర్యలు ఉంటాయేగాని కక్షపూరిత చర్యలనేవి ఉండవని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వంపై అపోహాలు వద్దు

## ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ వాసులతో కలెక్టర్ ఆనంద్

**ఉలవపాడు (నెల్లూరు), ఆగస్టు 6, ప్రభాతవార్త :** కరేడు ప్రాంతంలో నెలకొల్పనున్న ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు కావాల్సిన భూ సేకరణ విషయంలోను, రెండు మూడు గ్రామాల తరలింపు విషయంలోను ప్రభుత్వంపై ప్రజలలో నెలకొన్న అపోహలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం వారికి అందించే నష్టపరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద లభించే వెసులుబాటులు వసతులు గురించి తెలియజేయడానికి మీ గ్రామ వచ్చానని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కరేడు శివారు గ్రామం ఉప్పరపాలెం ఎస్సీలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో తిరిగి ఇళ్ల నిర్మాణం, వాతావరణ పరిస్థితులను గమనించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ వారికున్న అనుమానాలను ఒక్కొక్కటిగా సమాధాన పరుస్తూ సుమారు గంటపైనే వారితో గడిపారు.

పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ తరలించే పరిస్థితి ఏర్పడిందని అందుకుగాను మీరు కోరిన చోట గ్రామ నిర్మాణం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గ్రామస్తులకు తెలిపారు. ఒక కార్డులో 18 సంవత్స రాలు దాటిన వారు ఎంత మంది ఉన్నా వారిని ఒక్కొక్క కుటుంబంగా పరిగనించి ఒక్కొక్కరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చట్టం ప్రకారం లభించాల్సిన వసతులన్నీ కల్పించబడతాయని కాలనీ వాసులకు వెల్లడించారు. ఒక కుటుంబానికి 5 సెంట్లు ఇళ్ల స్థలం, నూతన గృహ నిర్మాణం, అందులో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించబడతాయని వాటి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉంటున్న గ్రామంలోని ఇళ్ల భవనాలు, స్థలాలకు ప్రభుత్వం నిర్ధేశించిన చదరపు అడుగు లెక్క ప్రకారం నిర్ణయించిన ఖరీదుకు రెండు రెట్లు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

# మహిళలకు 'ఉచిత బస్సు'

>> ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐ.డి. ప్రూఫులుగా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం నాన్ స్టాప్ అంతర్ రాష్ట్రీయ బస్ సర్వీసులు లేదా ఎ ఇతర కేటగిరీలకు వర్తించదు. అలాగే కాంట్రాక్టు క్యారేజ్ సర్వీస్లు, చార్టెడ్ సర్వీస్లకు మరియు ప్యాకేజ్ టూర్లకు వర్తించదు.

ఈ పథకం అమలు ద్వారా ఇప్పటికే రవాణా సర్వీసులను వినియోగించుకుంటున్న 16.11లక్షలకు అదనంగా 10.84 లక్షల మంది వినియోగించుకునే అవకాశం ఉన్నట్టు అంచనా. తద్వారా సంవత్సరానికి 142 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోనున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అమరావతి రెండో విడత భూ సమీకరణ పైన నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా సంస్థలకు భూముల కేటాయింపు నిర్ణయాలకు ఆమోద ముద్రతో పాటుగా మంత్రులతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.వీటితో పాటుగా హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచే అంశంపై మంత్రిమండలిలో ఓ నిర్ణయం తీసుకున్నారు. ఏపీఎస్సీడీసీఎల్, ఏపీసీపీ డీసీఎల్‌లకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వరసగా రూ.3,545 కోట్లు, రూ.1029 కోట్లు మంజూరు చేసిన రుణానికి గానూ ప్రభుత్వ గ్యారెంటీపై కేబినెట్ చర్చించింది.

పాఠశాల విద్యలో పలు జీవోలకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. కాంప్రిహెన్సివ్ ఎపి మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025కు కేబినెట్ చర్చ జరిగింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్టు) దాని అనుబంధ సంస్థలు, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్‌లపై మరో ఏడాదిపాటు నిషేధం పొడిగిస్తూ మంత్రిమండలి ఓ నిర్ణయం తీసుకుంది. 22 ఎపి టూరిజం డెవలప్‌మెంట్ హోటళ్లు, ఆరు క్లస్టర్ల పరిధిలోని రిసార్టుల ఆపరేషన్లకు సంబంధించి ఏజెన్సీల ఎంపికకు వీసీ అండ్ ఎండీకి అనుమతులు మంజూరు చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. తిరుపతి రూరల్ మండలం పేరూరులో 25 ఎకరాల భూమికి బదులుగా గతంలో ఒబెరాయ్ హోటళ్ల గ్రూపు నిర్మాణానికి ఇచ్చిన టిటిడి ల్యాండ్ బదిలీని రద్దు చేస్తూ కేబినెట్ చర్చించింది. ఎస్‌బిఐ, యూబీఐ బ్యాంకులకు రూ.900 కోట్లు గ్యారెంటీని పవర్ సెక్టార్‌కు ఇస్తూ తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు ప్రభుత్వం పలు రాయితీలను ప్రకటించడం జరిగింది. చేనేత మరియు జౌళి రంగాన్ని పటిష్ట పర్చి తద్వారా చేతి మగ్గాలకు నెలకు రెండు వందలు మరియు పవర్ లూంకు ఐదు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు,జీఎస్టీపై ఐదు శాతం రాయితీ మరియు చేనేత సహకార పరపతి సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకై చేనేత మరియు జౌళి శాఖ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

తదుపరి, నేతన్నలందరిలో పొదుపు అలవాటు పెంచేందుకు "త్రిఫ్ట్ ఫండ్" పథకం ద్వారా వారి వేతనాలలో 8, మరో 8 ప్రభుత్వంకలిపి మొత్తం 16 ఫండ్ వేయబడుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్ లో వెసులుబాటు లేక తగిన నిధులు విడుదల కాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 202526 సంవత్సరం బడ్జెట్‌లో రూ.5కోట్లు కేటాయించింది. ఇంకా 2017 నుండి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రూ.17.17కోట్ల బకాయిలను విడుదల చేస్తే, నేతన్నల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. ఈ మొత్తం పథకాల అమలుకు ప్రభుత్వం రూ.648.59 కోట్లు కేటాయించింది. ఇందులో విద్యుత్తు మాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, త్రిఫ్ట్ ఫండ్, నేటన్న నేస్తం, వంటి పథకాలు ఉన్నాయి.

గత విధానం ప్రకారం 3 సంవత్సరాల లైసెన్స్ వ్యవధి (2022- 25) ఉన్న ప్రస్తుత బార్ విధానం వేలం పద్ధతిపై ఆధారపడి ఉంది మరియు 840 బార్లు వేలం వేయబడ్డాయి. ఆ పాలసీ గడువు ఈ నెలాఖరకు ముగుస్తుంది. ఈ పాలసీ ప్రకారం బార్లు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన పరిస్థితుల్లో నూతన బార్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రక్కరాష్ట్రాల్లోని బార్ పాలసీని పరిశీలించి ఈ నూతన పాలసీని రూపొందించడం జరిగింది. లాటరీ ద్వారా బార్‌లను కేటాయించడం, కనీసం నాలుగు ధరఖాస్తులు వస్తేనే ఈ విదానాన్ని అనుసరించడం జరుగుంది. బిజినెస్ అవర్స్ ను కూడా ఉదయం 10.00 గంటల నుండి రాత్రి 11.00 గంటల వరకు అనుమతించడం జరిగింది. మొత్తం 840 బార్లలో 10 శాతం బార్ లను కల్లుగీత కార్మికుల సంక్షేమార్థం 50 శాతం ఫీజుతో రిజర్వు చేయడం జరిగింది. ఈ లైసెన్సు 1సెప్టెంబరు.2025 నుండి ఆగస్టు 2028 వరకు అమల్లో ఉంటుంది. బార్ల బిజినెస్ అవర్సు ఉదయం 10.00 నుండి రాత్రి 11.00 వరకూ అనుమతించింది.

# పులివెందులలో హోరాహోరీ

>> దించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున అనిల్ కుమార్ రెడ్డిని బరిలో దించగా ఇండిపెండెంట్ లో కలిసి మొత్తం 11 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఈ చిన్న ఎన్నికైన పులివెందుల జడ్పీటీసీ స్థానం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత ఇలాఖకావడంతో మళ్లీ తిరిగి వైఎస్సార్సీ దక్కించుకోవాలని వారు ప్రయత్నిస్తుండగా ఎలాగైనా ఈ సారి టిడిపి పాగా వేసి సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. ఇరు పార్టీలు పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలను ఎత్తుకు పైఎత్తులను ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే వైఎస్సార్సీ నుంచి ప్రతి గ్రామంలో కూడా టిడిపి వైపు చేర్చుకోవడంలో తెదేపా నాయకులు ప్రయత్నిస్తుంటే పట్టు విడవకుండా తమ సత్తాను నిలుపుకోవాలని వైకాపా ప్రయత్నిస్తోంది.

ఒంటిమిట్ట మండలంలో జడ్పీటీసీ స్థానంలో గత 30 ఏళ్లుగా కాంగ్రెస్, వైఎస్సార్సీ అభ్యర్థుల గెలుపుతున్నారు. 1995లో చివరగా జెడ్పిటిసిగా నరసింహులు గెలుపొందారు. ఆ తర్వాత ఇప్పటివరకు టిడిపి అభ్యర్థులు గెలవలేదు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్ బ్యాంకు బలంగా ఉండడంతో పాటు ఎస్సీ సామాజిక వర్గం కూడా ఆ పార్టీకి వెన్ను దన్నుగా ఉంటూ వచ్చింది. అయితే ఓట్ బ్యాంక్ పరంగా గెలుపొందినా భారీ ఆధిక్యతలు పెద్దగా నమోదు కాలేదు. మొదటిసారిగా రెడ్డి సామాజిక వర్గ అభ్యర్థులే అటు వైసిపి టిడిపి తరఫున పోటీ చేస్తున్నడంతో రసవత్తరంగా మారింది. మరోవైపు టిడిపికి బలిజ, చేనేత కార్మికులు, బీసీలు అండగానిలుస్తున్నారు. 13 గ్రామ పంచాయతీలు,24,606 ఓట్లు ఉన్న ఈ మండలంలో ఈ దఫా వైఎస్సార్సీ అభ్యర్థిగా మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ఇరగం రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మంటపంపల్లె గ్రామపంచాయతీ నుండి పోటీలో నిలిచిన టిడిపి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు కావడం ఈ దఫా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సామాజికములు చీలికను బట్టి అభ్యర్థుల విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. వైసీపీ పార్టీ అభ్యర్థి మొదట ఖరారు కావడంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ రెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆయనతోపాటు రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ,మాజీ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కొండూరు అజయ్ కుమార్ రెడ్డిలు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాష్ట్రమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం రెండు పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు.మంత్రి రాకతో పార్టీలో జోష్ పెరిగింది. ఈయనతోపాటు ఆ ప్రాంతానికి చెందిన టిటిపి నాయకులు గెలుపు కోసం శ్రమిస్తున్నారు. నేటి నుంచి రాష్ట్ర మంత్రులు జనార్దన్ రెడ్డి, సవిత కూడా ప్రచారంలోకి దిగనున్నారు. ప్రస్తుతం జగన్మోహన్ రాజు,డీసీఎంఎస్ ఛైర్మన్ జయ ప్రకాష్, పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి తరఫున బిజెపి జనసేన, టిడిపి ,నేతలకు పంచాయతీల వారీగా బాధ్యతలు అప్పగించి మండలంలో మోహరించనున్నారు. అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆ పార్టీకి ఒంటిమిట్టలో గెలుపు ప్రతిష్టగా మారింది. మరోవైపు పట్టు కోసం వైసిపి సర్వసక్తులు ఒడ్డి పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో జడ్పిటిసి ఎన్నికలు హోరాహోరీగా మారాయి.

# వారం - వర్జ్యం

07-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
త్రయోదశి మ.2.24
పూర్వాషాఢ మ.1.57
వర్జ్యం : రా.10.06-11.44
దు.ఉ.10.06-10.57, 2) మ.3.13-4.04
శుభసమయం:ఉ.6.30-7.15
రాహుకాలం - మ.1.30-3.00

# వార్తాఫలం

**మేషం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తారు.

**వృషభం:** పేరు ప్రఖ్యాతులకోసం విశేషంగా శ్రమిస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది.

**మిథునం:** కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. భూవివాదాలు పరిష్కారమవుతాయి.

**కర్కాటకం :** మానసిక వత్తిడులనుండి బయటపడతారు. గృహనిర్మాణాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నూతన కార్యక్రమాలకు ప్రారంభిస్తారు.

**కన్య :** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**తుల :** షేర్లు, భుముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. కష్టానికి ఫలితం దక్కుతుంది.

**ధనుస్సు:** వటుట్టలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. అప్రయత్నంగా అవకాశఆలు పొందుతారు.

**మకరం:** ఉద్యోగ, విద్యావకాశాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి కొద్దిపాటి ఒడిదుడుకులుగా ఉంటుంది.

**కుంభం:** కుటుంబసభ్యుల సహాయం అందుకుంటారు. నూతన పెట్టుబడులకు అనుకూల కాలం.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేతన్నల బతుకుల్లో కొత్త వెలుగులు

>> లక్షల మందికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంగా పెట్టుకుంది. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై అయిదు శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సిఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా నేతన్నలను వ్యాపారులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు.

**నేతన్నకు 50 యేళ్లకే రూ.4 వేల పెన్షన్**

2024లో సిఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం కూడా చేనేతలకు మరోసారి అండగా నిలిచింది. 50 యేళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నారు. 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది.

**ముద్ర రుణాలు, నూలు సబ్సిడీ అందజేత**

క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాల బలోపేతానికి బ్యాంకు రుణాలు అందజేస్తోంది. గతేడాది 116 చేనేత సహకార సంఘాలకు రూ.40.87 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా అందజేసింది. ఈ ఏడాది 110 సంఘాలకు రూ.37.75 కోట్లు రుణమివ్వడానికి నిర్ణయించింది. ప్రధాన మంత్రి చేనేత ముద్ర యోజన పథకం(ముద్ర) కింద నేతన్నలకు గతేడాది వర్కింగ్ కాపిటల్ నిమిత్తం రూ.33.25 కోట్లు అందించింది. 3,367 నేతన్నలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో జూన్ వరకు 294 మందికి రూ.2.57 కోట్లు మంజూరు చేసింది. ముడి పదార్థాల సరఫరా పథకం నూలు కొనుగోలుపై కూటమి ప్రభుత్వం 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. సహకార సంఘాలకు, వ్యక్తిగతంగా పలువురు నేతన్నలకు రూ.164.24 కోట్ల విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై ఇవ్వగా, దీనివల్ల లబ్ధిదారులకు రూ.24.63 కోట్ల మేర లబ్ధి కలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 135 మంది స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.13.50 లక్షల విలువైన నూలును ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున కూటమి ప్రభుత్వం అందజేసింది.

**నేడు 3 పథకాలకు సిఎం చంద్రబాబు శ్రీకారం..**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, సిఎం చంద్రబాబునాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి గురువారం శ్రీకారం చుడుతున్నారు. చేనేత దుస్తులపైనా 5 శాతం జీఎస్టీ మినహాయింపు పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నారు. చేనేతలకు రూ.5 మేర త్రిఫ్ట్ నిధులు మంజూరు చేస్తున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. జీఎస్టీ మినహాయింపునకు ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే నేతన్నలకు నెలకు1,233ల చొప్పున్న ఏడాదికి రూ.14,956లు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ. 2,717ల చొప్పున్న 32,604ల మేర లబ్ధి కలగనుంది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింపజేయడానికి ప్రణాళికలు రూపొందించింది. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టింది.

# మరో 4 రోజులు వర్ష సూచన

>> భారీ వర్షాలు కురిసాయి.మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వివరిచారు. వైఎస్సార్ కడప, చిత్తూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనకాపల్లి, తిరుపతి, ప్రకాశం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అందుబాటులోకి వచ్చి సమాచారాన్ని అనుసరించి నేటి ఉదయం వర్షపాతాల రికార్డును అనుసరించి గోరంట్లలో అత్యధికంగా 51.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిలమత్తూరులో 38, అనంతపురం అర్బన్‌లో 37, బుక్కరాయ సముద్రంలో 36, పరిగిలో 35, కంబదూరులో 32, తలుపులలో 31, నంబులపూలకుంటలో 30, వజ్రకరూరులో 24, ఆత్మకూరులో 21, విడపనకల్లు 18, నల్లచెరువు 18 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తనకల్లు, విడపనకల్లులో 18 మిల్లీమీటర్ల చొప్పున, బ్రహ్మసముద్రం 16, పెనుకొండ 14, కళ్యాణదుర్గం 13, మడకశిర 12, ముదిగుబ్బ 25, అనంతపురం గ్రామీణం 13, యల్లనూరు 12, సోమందేపల్లి 10, ఉరవకొండ 9 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాఖ ప్రధాన డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఆగస్టు 11 తర్వాత నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రపంచ వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.ఉత్తర తమిళనాడుకు నైరుతి దిశగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత రెండు రోజులుగా వానలు దంచికొడుతున్నాయి.



## దెబ్బకొట్టినోడికి నొప్పి తెలిసేలా చేసేందుకే 'యాప్' : మాజీ సిఎం వైఎస్ జగన్

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక మనిషిని జైల్లో పెట్టడమంటే ఆ వ్యక్తి పరువు,ప్రతిష్టలతో ఆడుకోవడమేనని వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తీవ్ర అరాచకాలను చేస్తోందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక స్వరం వినిపించే వారిపైనా దొంగ సాక్ష్యాలు సృష్టించి కేసులు పెడుతున్నారు. జైలుకు పంపి వారి పరువు తీస్తున్నార. ఒక కేసులో బెయిలు వచ్చి బయటకొచ్చేలోపే మరో కేసు పెట్టి,వారిని జైల్లోనే ఉంచేస్తున్నారు 14 నెలల చంద్రబాబు పాలన చూస్తే కలియుగమంటే ఇదే కదా అనిపిస్తోంది. ఎక్కడా న్యాయం,ధర్మం లేదు'అని విమర్శించారు..'పార్టీ కోసం ఎవరెవరు పనిచేస్తున్నారో పక్కాగా డేటాబేస్ తయారు చేస్తున్నాం. అధికారంలోకి రాగానే దాని ఆధారంగానే వారికి గుర్తింపునిస్తాం. యూనిఫాం, అధికారం ఉందని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారి డేటాబేస్‌నూ సిద్ధం చేస్తున్నాం. ఇందు కోసం లాయర్ల పర్యవేక్షణలో సిద్ధం చేసిన 'యాప్'ను త్వరలో ఆవిష్కరించబోతున్నాం. ఏ కార్యకర్తయినా వారిని ఇబ్బంది పెట్టిన అధికారి పేరు, హోదాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అది మా దగ్గర డిజిటల్ లైబ్రరీకి చేరుతుంది. దెబ్బతగిలనోడి భాధ,ఆ దెబ్బ కొట్టినోడికి తెలిసేలా చేసేందుకే ఈ యాప్. అధికారంలోకొచ్చాక ఈ డిజిటల్ లైబ్రరీని తెరిచి, అందులో ఉన్న డేటా ప్రకారం కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరినీ జైలుకు పంపిస్తాం'అని అన్నారు. అమరావతి నిర్మాణం పేరుతో దోచేస్తున్నారని ఆరోపించారు.

## రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకున్న సిక్కిం సిఎం

### ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇఒ



సిక్కిం ముఖ్యమంత్రికి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఇఒ బాపిరెడ్డి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ కుటుంబ సభ్యులతో జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఇఒ డి.బాపిరెడ్డి స్వాగతం చెప్పారు. ఏర్పాట్లును ఎఇఒ మోహన్,టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకు దేశ,విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ కుటుంబసభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఇఒ టి.బాపిరెడ్డి వేదపండితుల వేదమంత్రాలతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. సిఎం ఆలయానికి రాగా ఇక్కడ నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఇఒ బాపిరెడ్డి వెంటనే ఆలయంలోని సహస్రలింగేశ్వరాలయం వద్ద ప్రత్యేక పూజా టిక్కెట్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేసారు. వేద పండితులు వేద మంత్రాలతో పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## సిపిఐ, అనుబంధ విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలపై నిషేధం మరో ఏడాది పొడిగింపు : మంత్రి కొలుసు పార్థసారధి

### - జర్నలిస్టుల అక్రెడిటేషన్ మంజూరుకు కొత్త నిబంధనలు



**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:**కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ఫ్రంట్ సంస్థలు, రాడికల్ యూత్ లీగ్ .రైతు కూలీ సంఘం గ్రామీణ పేదల సంఘం రాడికల్ స్టూడెంట్స్ యూనియన్. సింగరేణి కార్మిక సమాఖ్య.విప్లవ కార్మిక సమాఖ్య ,ఆల్ ఇండియా రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ నిషేదాన్ని పొడిగించినట్లు ఏపీ సమాచార శాఖా మంత్రి కొలసు పార్దసారధి తెలిపారు. సచివాలయంలోని సమాచార కేంద్రంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్, 1992, (చట్టం నం. 21 ఆఫ్ 1992) సెక్షన్ 3 మరియు దాని ఉపక్లాజుల ప్రకారం చట్టవిరుద్ధ సంఘాలుగా ప్రకటించడంపై నిషేధాన్ని మరో సంవత్సరం పాటు పొడిగించేందుకు సాధారణ పరిపాలన శాఖ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిషేధం అమలులో ఉన్నప్పటికీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ఆంధ్రప్రదేశ్‌లో తమకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) పోలీస్ ఇన్ఫార్మర్లు అని పేరుతో పౌరులను లక్ష్యంగా చేసుకోవడం, ముఖ్యంగా అల్లూరి సీతారా మరాజు జిల్లా లలో ప్రభుత్వ ఆస్తు లను దెబ్బతీయ డంతో పాటు తెలంగాణ, ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్ పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారి కేడర్‌లతో కలిసి వినాశకార కార్యకలాపాలను కొనసాగిస్తోంది. 2024 ఆగస్టు నుండి ఇప్పటి వరకు నిషేధ కాలంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) 9 నేరాలు చేసిందని తెలిపారు. పుట్టపర్తి, మొవ్వ, గన్నవరం, గాజువాక మరియు తిరుపతి తదితర ఐదు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన మంజూరు చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు.ప్రస్తుత ఏపీ మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు, 2023లో జారీ చేసిన జీవోను రద్దు పరిచి రద్దుపరచి, దాని స్థానంలో కొత్తగా రూపొందింఛిన "కాంప్రహెన్సివ్ ఏపీ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025" ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొత్త సమగ్ర,సమీకృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025కు కేబినెట్ ఆమోదం కోరుతూ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తద్వారా, రాష్ట్ర హెడ్ క్వార్టర్స్, పబ్లిషింగ్ సెంటర్లు, ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ మంజూరు చేయడం కోసం ఉన్న ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2023, జీవో 38ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల స్థానంలో క్రొత్తగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025 అమలులోకి రానుంది.

## ప్రతి ఎకరాకు సాగు నీరందేలా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలి :మంత్రి నిమ్మల

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా ఈస్టర్న్ డెల్టా చివరన ఉన్న ప్రతి ఏకరాకు సాగు నీరందేలా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు ప్రకాశం బ్యారేజ్ నుండి 10,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా దిగువన ఉన్న రైతులకు సాగు నీరు అందడం లేదని, దీనిపై గత 20 రోజులుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కృష్ణాజిల్లాలోని పెడన, గుడివాడ నియోజకవర్గాల్లో పర్యటించిన మంత్రి వడ్లమన్నాడు డ్రైన్, గుడ్లవల్లేరు లాకులను స్వయంగా పరిశీలించి రైతుల సాగునీటి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖలోని సిఈ స్థాయి నుండి కింది స్థాయి ఉద్యోగులు అందరరూ కెనాల్స్ పై తిరుగుతూ రైతులకు సాగు నీరు అందేలా పర్యవేక్షించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఒక ఏడాది వరదలు వస్తే, రెండు మూడు సంవత్సరాలకు సరిపడేలా వాటర్ మేనేజ్ మెంట్ ద్వారా నీటి నిల్వలు చేయాలని చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. నాడు రూ.1350 కోట్లతో చంద్రబాబు పట్టిసీమ నిర్మిస్తే, పట్టిసీమ కాదు అది ఒట్టిసీమ అని జగన్ అసెంబ్లీలో ఎద్దేవా చేశాడని, అదే పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి జలాలు తీసుకొచ్చి 50వేల కోట్ల ఆదాయం సృష్టించామని స్పష్టం చేశారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో నిర్వీర్యమైన సాగు నీటి సంఘాలకు చంద్రబాబు పునరుజ్జీవం పోయడంతో ఇరిగేషన్ వ్యవస్థ బాగుపడింది అని తెలిపారు. వైసిపి పాలనలో కాలువల్లో పూడిక తీత, డీసిల్టింగ్ పనులు చేయలేదని, ఈపనులకు 5ఏళ్ళలో 100 కోట్లు కూడా కేటాయించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యవసర పనుల కింద రూ.700 కోట్లు కేటాయించి కాలువల్లో పూడిక తీత వంటి పనులను సాగు నీటి సంఘాల సహకారంతో పూర్తి చేయగలిగామని అన్నారు.గత ప్రభుత్వం శ్రీశైలం ప్లంజ్ పూల్ ప్రమాదం లో ఉంటే గత 5ఏళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, శ్రీశైలం ప్లంజ్ పూల్, ధవళేశ్వరం గేట్ల మారమ్మతులకు రూ.350 కోట్లు కేటాయించామని తెలిపారు మంత్రి నిమ్మల.జగన్ వ్యవహార శైలి చూస్తుంటే రానున్న రోజుల్లో ఇప్పుడొచ్చిన సీట్లు కూడా రావని, అందుకే విద్రోహ చర్యలకు పాల్పడుతూ తన కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని పేర్కొన్నారు.

## కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల చేయాలంది

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సిపిఐ(ఎం) కార్యదర్శి శ్రీనివాసరావు బహిరంగ లేఖ



**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:**కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచుల వేతనాలు పెంచాలని, గ్రామ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి బుధవారం ఏపీ సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు లేఖ రాశారు. రాజ్యాంగం ప్రసాదించిన మూడు దొంతరల అధికార వ్యవస్థలో దిగువనున్న స్థానిక సంస్థలకు నిధులు, విధులు బదలాయించడంలో ఇప్పటికీ లోపాలు కొనసాగుతున్నాయి. రోజురోజుకి కేంద్రీకరణ బలపడుతోంది. అభివృద్ధిలో స్థానిక సంస్థలైన పంచాయితీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కాని కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వలన పంచాయతీల్లో అభివృద్ధి పడకేసింది. రాష్ట్రంలో సర్పంచులు పార్టీయేతర ప్రాతిపదికపై ఎన్నికై 4సంవత్సరాలు దాటుతోంది. ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచులు నిధుల్లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఎస్.సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన సర్పంచులు 50 శాతం పైగా ఉన్నారు. వారందరూ అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తే, వాటికి చెందిన బిల్లులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదు. పంచాయితీలకు ఇవ్వవలసిన ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్ళించారు అని వి.శ్రీనివాసరావు లేఖలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదట విడత నిధులు విడుదల చేసినా, గత 6 నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 ఆర్థిక సంఘం రెండవ విడత నిధులు రూ.1121 కోట్లు విడుదల చేయకపోవడంతో వారు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటి కోసం చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. అయినా ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి పంచాయతీ శాఖ బాధ్యతలు చూస్తున్న పవన్ కళ్యాణ్ శ్రద్ధ చూపాలని వి. శ్రీనివాసరావు లేఖలో కోరారు. ఈ క్రింది చర్యలు తీసుకొని స్థానిక సంస్థలను, గ్రామ స్వపరిపాలనను ప్రోత్సాహించాలని వి. శ్రీనివాసరావు పవన్ కళ్యాణ్ ని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి 6 నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయితీల ఖాతాలకు వెంటనే విడుదల చేయాలన్నారు.

## తిరుమల సమాచారం

### నారాయణగిరి శ్రీవారి పాదాలకు ఛత్రస్థాపనం



**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠం నుండి కలియుగవైకుంఠం శేషాచలంలోని నారాయణగిరిశిఖరంపై తొలిసారి పాదం మోపిన శ్రీవేంకటేశ్వర స్వామి పాదాలకు బుధవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంనుండి మంగల వాయిద్యాల నడుమ పూజాసామాగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో ఆలయ మాఢవీధుల మీదుగా అర్చకులు మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడ నుండి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు శాస్త్రోక్తంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలంతో అభిషేకం చేశారు. అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబందశాత్తుమొర వినిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేయడంతో పాదాలకు ఛత్రస్థాపనోత్సవం ముగిసింది. ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి కావున పాదాలకు రక్షణ కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి,ఆలయ అర్చకులు,భక్తులు పాల్గోన్నారు.

### శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు పవిత్రమాలలు



**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ఏడు కొండల శ్రీవేంకటేశ్వర స్వామి మూలవిరాట్టుకు పవిత్రోత్సవాల్లో రెండోరోజు బుధవారం ఉదయం పవిత్ర మాలలు సమర్పించారు. ఆలయంలోపల ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరునికి. ధ్వజస్తంభానికి, ఉపఆలయాల్లో స్వామివార్లకు, ఉత్సవమూర్తులకు, బేడి ఆంజనేయస్వామికి పవిత్రమాలలు సమర్పించారు. ప్రతి ఏడాది మూడురోజులుపాటు జరిగే పవిత్రోత్సవాల్లో రెండవరోజు బుధవారం ఉదయం ఆలయంలోపల సంపంగిప్రాకారంలోని కల్యాణోత్సవమండపం యాగశాలలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు,పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలంతదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం వేదఘోష,మంగళవాయిద్యాల నడుమ వెంకన్న మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామికి, విశ్వక్సేనులకు, యోగనరసింహస్వామికి, వకుళమాత అమ్మవారికి, భాష్యకార్లకు ,పోటుతాయారుకు ,ధ్వజస్తంభం, బలిపీఠంకు పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం ఉభయదేవేరులతో మలయప్పస్వామి పవిత్రమాలలుతోనే ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయ్యంగారు,చిన్నజీయ్యంగారు,టిటిడి ఇఒ జె.శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం , ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ నెట్టం తులసీ వెంకటరామ్‌కుమార్, విఎస్ఒ అల్లం సురేంద్ర,ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, ఆలయఅర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఎస్వీఅన్నప్రసాదంకు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ దాత విరాళాలందించారు. ఈ ట్రస్ట్‌కు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి భక్తులకు ఇతోధికంగా సేవలందించేందుకు సహకరిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ వాసి లీలాకుమార్ వెంకటనారాయణ కాజా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10క్షలు రూపాయలు చెక్కు ను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

### నిబంధనల ఉల్లంఘన ! ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్, ఇద్దరికి షోకాజ్ నోటీసులు

**తిరుపతి,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం నిబంధనలు ఉల్లంఘించి విధుల నిర్వహణలో అతిక్రమించిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడం, మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీచేయడం పెద్ద హాట్‌టాఫిక్‌గా మారింది. టిటిడిలో ఇటీవల వరుసగా అన్యమత ఆచారాలను పాటిస్తున్న పలువురిపై వేటు వేసిన విషయం విదితమే. ఇప్పుడు ఏకంగా సంస్థ నిబంధనలు అతిక్రమించడం ఉద్యోగుల విచ్చలవిడి తనాన్ని తెలియజేసింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన పాలకమండలి, టిటిడి ఉన్నతాధికారులు ఆ నలుగురి తప్పిదాలను బహిరంగంగా పేర్కొంటూ చర్యలు తీసుకుంది. టిటిడిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాము కొందరు ప్రైవేట్ వ్యక్తులతో కలసి వ్యాపారాలు నిర్వహించారనే ఆరోపణలు. దీనిపై విచారణ చేసిన టిటిడి ఆధారాలు రావడంతో అతనిపై సస్పెన్షన్ వేటువేసింది. ఇంకా ఏకంగా తన వసతి గృహాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడమేగాక ఆర్థిక లావాదేవీలు చేశాడనే కోణంలో ఆఫీస్ సబార్డినేట్ ఎన్. శంకర్‌ను కూడా సస్పెన్షన్ చేసింది. ఇదిలా ఉండగా గతంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటనలో తన కార్యాలయం విధులు విస్మరించి ఆయన సేవలో ఉన్నాడనే ఆరోపణలపై మరో జూనియర్ అసిస్టెంట్, టిటిడి ఉద్యోగుల బ్యాంకు డైరెక్టర్ చీర్లకిరణ్‌కు షోకాజ్ నోటీసు జారీచేసింది. మరో అర్చకుడికి ఇదే ఆరోపణలపై షోకాజ్ నోటీస్ జారీకావడం టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది. ఇప్పుడు ఉద్యోగులు తమ బాధ్యతలు ఏంటనేది ఆలోచనలో పడ్డారు.

### స్వామి దర్శనం ఆనందాన్నిచ్చింది - తిరుమలలో ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడంతో ఆనందంగా ఉందని, స్వామిఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్, కర్నాటక హోం మంత్రి పరమేశ్వర కుటుంబసభ్యులతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ట్రాలీ ఆటో బోల్తా - 22 మందికి గాయాలు

### మాజీ మంత్రి బుగ్గన కుమారుని పెళ్లి వేడుకలకు వెళ్లి వస్తుండగా దుర్ఘటన

### వెల్దుర్తి వద్ద ఆటో టైరు పేలడంతో ప్రమాదం



క్షతగాత్రుల్ని వైద్యశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి

**వెల్దుర్తి,ఆగస్టు6,ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుని వివాహ వేడుకలకై నంద్యాల జిల్లా బెతేంచర్ల మండలం యంబాయి రుద్రవరం గ్రామానికి చెందిన ప్రజలు డోన్ పట్టణ శివారులో జాతీయరహదారి ప్రక్కన దత్తాత్రేయ ఆలయ సమీపంలో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు.వివాహ వేడుకల అనంతరం వారు ట్రాలీ ఆటోలో వెల్దుర్తి, రామళ్లకోట మీదుగా వారి స్వగ్రామమైన రుద్రవరానికి వెళ్లేందుకు బయలుదేరారు.అయితే వారు ప్రయాణిస్తున్న ఆటో కర్నూలు జిల్లా వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెల్దుర్తి పట్టణ సమీపంలోని రైల్వే గేట్ వద్దకు రాగానే జాతీయరహదారిపై ఆ ఆటో టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆ ఆటోలో ప్రయాణిస్తున్న వారు ఒకరిపై ఒకరు ఆటో కింద కొందరు రోడ్డుపై కొందరు కిందపడ్డారు.దాదాపు 26 మందికి గాయాలు అయినట్లు తెలిసింది.ఇదే దారిలో వెళ్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తమ వాహనాన్ని ఆపి క్షతగాత్రుల వద్దకు చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు.ఆమె 108 అంబు లెన్స్‌కు ఫోన్ ద్వార రోడ్డు ప్రమాద సమాచారం ఇచ్చి తీవ్రగాయాలపాలైన వారిని వెల్దుర్తి వైద్యశాలకు తరలించేలా చర్యలు తీసుకున్నారు.మిగతా వారందరు వెల్దుర్తి సిహెచ్‌సి వైద్యశాలకు చేరుకున్నారు.వీరికి వైద్యుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది చికిత్స చేశారు.అనంతరం వీరిలో తీవ్రగాయాపాలైన బాలరాజు (నడుమునొప్పి),చంద్రశేఖర్(తలకు) గాయం కాగా వీరితో పాటు మరో నలుగురు నాగేశ్వరరావు,గోవిందు,పుల్లయ్య,దిలీప్‌లను చికిత్సకై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జిఎస్టీ వసూళ్లపై టిడిపి తప్పుడు ప్రచారాలు

### - మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



**విజయవాడ.,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** వైయస్సార్ సీపీ పాలనలో జీఎస్టీ ఆదాయం పై టీడీపీ కుట్రపూరితంగా లేనిపోని అనుమానాలు, అపోహాలు సృష్టిస్తోందని వైయస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆరోపించారు.2025 జూలై జీఎస్టీ ఆదాయం వృద్ధిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.వైయస్సార్ సీపీ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు.తమ ప్రభుత్వ పాలనలో ఆర్థిక రంగంలో అద్భుత విజయాలు సాధించాం. కూటమి ప్రభుత్వం నాటి గణాంకాలను తప్పుగా అన్వయిస్తూ..విధ్వంసం జరిగిందంటూ దుష్ప్రచారాలు చేస్తోంది. కూటమి సర్కారు అసమర్ధత, లోపభూయిష్ట విధానాల వల్లే 2024 జూలైలోను, ఆ తర్వాత మాసాల్లో సైతం జీఎస్టీ ఆదాయం వృద్ధి పడిపోతూ వచ్చింది. 2025 జూలైలో జీఎస్టీ ఆదాయంలో 14 శాతం వృద్ధి అన్నది కూటమి సర్కారు పాలనలో ఆర్థిక ప్రగతి మెరుగుపడటం వల్లనో.. వారు ఉత్తమ, మెరుగైన విధానాలు అమలు చేయడం వల్లనో వచ్చింది కాదు.జూలై 2024లో జీఎస్టీ వసూళ్లు దారుణంగా పడిపోయాయి..ఆ నెలతో పోల్చడం వల్ల 2025 జీఎస్టీ ఆదాయం వృద్ధి చెందినట్లు కనిపిస్తోంది. కూటమి సర్కారు సరైన దిశ లేకుండా..లోపభూయిష్టమైన ఆర్థిక విధానాలు అవలంభించడం వల్ల గత ఏడాది జీఎస్టీ వసూళ్లు దారుణంగా పడిపోయాయి. 2023 జూలై నికర జీఎస్టీ ఆదాయంతో జూలై 2025 జీఎస్టీ ఆదాయాన్ని పోల్చి చూస్తే.. (రెండేళ్ల కాలంలో) కేవలం 6.3 శాతమే వృద్ధి మాత్రమే నమోదైంది. 2023 జూలై నికర జీఎస్టీ వసూళ్లు రూ. 2,755 కోట్లు కాగా, జూలై 2025 జీఎస్టీ వసూళ్లు రూ.2,930 కోట్లు. అంటే ఏడాదికి సగటున 3.13 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. అదేవిధంగా, స్థూల జీఎస్టీ ఆదాయం వృద్ధి కేవలం 2.88 శాతం మాత్రమే. చాలా తక్కువ వృద్ధి నమోదైంది.

## రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీలు, నియామకాలు

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీలు, నియామకాలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గా ఎస్.రవీంద్ర బాబును నియమించింది.వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్. వాసు బాబును నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ టీపీఆర్వోగా నియమించింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ గా జి. రవి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గా పి. భవానీ ప్రసాద్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీ గా ఎల్ . సురేష్ లను నియమించింది.

## ఎంబీబీఎస్ మొదటి విడత కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎంబీబీఎస్ ఆల్‌ఇండియా కోటా మొదటి విడత కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) పొడిగించింది. మొదటి రౌండ్‌కు సంబంధించి ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు రిజిష్టరు చేసుకోవచ్చు. రుసుం లేకుండా 6 గంటల్లోగా చెల్లింఆలి. ఐచ్చికాలు 7వ తేదీ ఉదయం 8 గంటల్లోగా పెట్టుకోవాలి. సీట్ల కేటాయింపు వివరాలు 9న విడుదల చేస్తారు. సీట్లు వచ్చిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో 9 నుంచి 18వ తేదీ లోగా చేరవచ్చు.విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎంబీబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా ప్రవేశాలకు వచ్చిన దరఖాస్తులను మొదటి విడత పరిశీలన పూర్తయ్యింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం
నిట్ నెం. 01-02/25-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 01.08.2025
అల్లూరి సీతారామరాజు జిల్లాలో MPLADS గ్రాంట్ క్రింద అంచనా ధర రూ.20.00 లక్షలతో పాడేరు మండలం (2 నం.లు)లో తలర్సింగి గ్రామం వద్ద ఇండోర్ స్టేడియం అభివృద్ధికి మరియు GYM పరికరాలు, పెయింటింగ్స్ ఏర్పాటు మరియు ఇండోర్ స్టేడియం యొక్క పునర్నిర్మాణానికి టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డౌన్‌లోడ్: 07.08.2025 తర్వాత. పూర్తి వివరాల కొరకు https://www.apeprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నం.8791914161.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ PRI-డివిజన్, పాడేరు
DIPR.No.17213/CL/Advt/1/1/2022-23, తేది: 06.08.2025

వార్త

కొట్టినప్పుడు వినిపించే ధ్వని బట్టి ఆ పాత్ర గట్టిదా, ఒట్టిదా అనే సంగతి తెలిసిపోయినట్లే మనుషులు బుద్ధిమంతులా, మూర్ఖులా అనే విషయం వారి ఉపన్యాసం ద్వారా తెలిసిపోతుంది.

-డెమోస్తనీస్

# ప్రకృతితో చెలగాటమా?

భరత భూమికైనా, విశ్వక్షేత్రానికైనా ప్రకృతి బీభత్సాలు ఉత్పాతాలు కొత్తేమీకాదు. కానీ శరపరంపరగా ఒకదాని వెంట ఒకటి తరుముకొస్తున్నట్లు ఉరుములు మెరుపులతో ఉత్పాతాలు మీదకొచ్చి పడ్తుంటే బాధపడని వారుండరు. యేటా ప్రకృతి బీభత్సాలు జన సందోహాన్ని అతలాకుతలం చేయడం, ప్రభుత్వాలు ఆదుకోవడం సర్వసాధారణంగా జరిగేదే. చడీ చప్పుడు లేకుండా, ఎలాంటి సంకేతాలు అందకుండా అమాంతం ముందుకొచ్చే ఆకస్మిక వరదలు మరీ ప్రమాదం. కార్చిచ్చులూ అంతే ప్రమాదం. ఉత్తరాఖండ్‌పై మంగళవారం విరుచుకుపడిన భారీ వరదలతో ఉత్తరకాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న 'ధరాలీ' గ్రామం తుడిచిపెట్టుకుపోయింది. కుంభవృష్టికి తోడు మంచు పర్వతాల గ్రేషియర్లు వేడెక్కి కరిగిపోగా పెద్దఎత్తున బయటపడే నీటి ప్రతాపంతో దాదాపు పరిసర ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. అక్కడి నైసర్గిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు ఇందుకు కారణం. మృతుల సంఖ్య ఐదుగురే అయినా వందలాది మంది వరదల్లో చిక్కుకున్నారు. ఉత్తరాఖండ్ అనగానే వరదలకు ప్రసిద్ధి. వర్షాకాలం, గ్రేషియర్‌ల కరుగుదల, పర్వత ప్రాంతాల్లో అనియంత్రిత అభివృద్ధే భారీ వరదలకు కారణం. ప్రస్తుతం ఎదుర్కొంటున్న భారీ వరదల విషయంలో ముందస్తు హెచ్చరికలు లేవు. పర్యావరణ పరిరక్షణకు తీసుకునే చర్యలేమీ కనపడవు. ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా ముంచెత్తిన కారణంగా అధికార్లు చేతులెత్తేసారు. ఉత్తరాఖండ్ యేటా ఇలాంటి ప్రకృతి విలయాలను ఎన్నో చూసినా ఈసారి అతిపెద్ద ఉత్పాతాన్నే ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా ఇటీవల వచ్చిన సునామీ సంకేతాలు భూకంపాలు, తాజాగా భారీ వర్షాలు, వరదలతో ఆయా ప్రాంతాలు ఇప్పట్లో తేరుకునే పరిస్థితి లేదు. ఉత్తరాఖండ్ విలయంతో 'ధరాలీ' నగరం దాదాపు కనుమరుగైనట్లుగానే ఉంది. శిథిలాల కింద మరికొన్ని ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఖీర్ గంగానది పరివాహక ప్రాంతంలో మంగళవారం ఉదయం మేఘ విస్ఫోటంతో అమాంతం వరదొచ్చి పడింది. బోలెడంత బురదనూ మోసుకొచ్చింది. వరద ఉధృతికి 3,4 అంతస్థుల భవనాలు కుప్పకూలాయి. దాదాపు పాతిక హోటళ్లు కుప్పకూలి, వాటి సామాగ్రి వరదల్లో కొట్టుకుపోయింది. వరదల్లో గల్లంతైన వారి సమాచారం తెలియడం లేదు. వారి ఆవేదన తెలుసుకుని సహకరించే పరిస్థితులు కరువయ్యాయి. హెలికాప్టర్‌ల మీద వెళ్లి ఆహార పదార్థాలు, ప్యాకెట్లు అందించే ఏర్పాటు చేసేందుకు వాతావరణం సహకరించలేనందున సహాయ కార్యక్రమాలు ముందుకు సాగలేదు. కుండపోత వర్షాలతో కొండచరియలు విరిగి పడడంతో 163 రోడ్లు దారులు మూసుకుపోయాయి. దాంతో ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు ఇబ్బందికి గురయ్యాయి. విపత్తులు సంభవించినప్పుడు ఆందోళన పడేవారిని రక్షించడానికి విపత్తుల సంస్థలున్నా, నష్టపరిహారమో, ఆర్థిక సహాయమో అందించగానే ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ప్రకృతి బీభత్సాలను తట్టుకునే స్థాయిలో ఆలోచించాలి. అలాంటి నిర్మాణాలను చేపట్టాలి. అంత తప్ప ఉపద్రవాల నేపథ్యంలో ఊరించే మాటలు చెప్పి ఆనక ఆర్థికభారం సాకుతో మడమ తిప్పటం ఏ మాత్రం మంచిది కాదు. గత యేడాది జూలై 2024లో కేరళ రాష్ట్రం వయనాడ్‌లోనూ ఇలాంటి విలయమే సంభవించింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఎన్నో ప్రాణాలను కబళించింది. 600మందికిపైగా ప్రాణాలు హరించుకుపోయాయి. 2013లో ఉత్తరాఖండ్ వరదలకు భయంకర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వచ్చింది. కేదారనాథ్‌ఆలయ సమీపంలోని గ్లేషియర్ సరస్సు ఒక్కసారిగా కూలిపోవడం వల్ల పెద్ద ఎత్తున వరద తాకిడి ఆ ప్రాంతాన్ని ముంచేసింది. 5,700 మందిని పొట్టన పెట్టుకుంది. ఇంకా ఎంతో మంది ఆచూకీ తెలియలేదు. ప్రకృతి బీభత్సాలను ఆపలేం. ప్రాంతమేదైనా భూమ్యాకాశాల మధ్య ఏర్పడే వాతావరణ అలజడులను పరిగణనలోకి తీసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలిగితేనే అధిక ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. సరిగ్గా 20రోజుల నాడు రష్యా కకుమ్ చాట్కాలో పెద్దఎత్తున రెక్టర్ స్కేలుపై 8.8 శక్తివంతమైన భూకంపం జరిగింది. జపాన్, హవాయి, రష్యా దేశాలకు సునామీ హెచ్చరికలు వచ్చాయి. వీటి అలలకు ఆయా ప్రాంతాల ఇల్లు నేలమట్టమయ్యాయి. వీటి పునర్నిర్మాణం విషయంలో ప్రభుత్వాలు వంతులుపోతున్నాయని ఆ ప్రాంత సామాజిక వాతావరణ పర్యావరణ విశ్లేషకులు చెప్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని విషయాల్లో జాగ్రత్తలు పడితేనే రాబోయే రోజుల్లో ధన, ప్రాణ నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చును. వయానాడ్ ప్రళయం నేర్పిన అనుభవాలు కానీ ఉత్తరాఖండ్ విలయాల నుండి విపత్తు దళాలు, అధికార్లు నేర్చుకున్న అనుభవాలు కానీ ముమ్మందు ప్రమాదాలు తప్పించుకోవడానికి ఉపకరిస్తా యి. వాటిని ఆసరాగా ఆధునిక రక్షణ వ్యవస్థను ఏర్పా టు చేసుకోవాలి. వచ్చినప్పుడు చూద్దాంలే అన్న ధోరణి ఎవరికీ మంచిది కాదు. కాలయాపన జరిగిన ప్రతిచోట మానవ తప్పిదాన్నే తప్పుపట్టాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే ఆధునిక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అంతే కాదు 2075నాటికి దక్షిణాది రాష్ట్రాలు, మరికొన్ని ఉత్పా తాలను విలయాలను చూస్తాయని వాటిని తట్టుకోలేకపో వచ్చునని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఏమైనా కానీ ప్రత్యేక విపత్తు దళాలను ఏర్పాటు చేసుకోవడం మంచిది. ఆధునిక విధానాల్లో 'రిస్క్యూ' ఆపరేషన్లు నిర్వహించి ప్రజల్ని కాపాడే బాధ్యత తీసుకోవాలి.



ఒక పని అంటే గానీ, లేదా దాని వల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.

మహాత్మా గాంధీ



భగవద్భక్తి పుస్తకాలు చదవడం వల్ల రాదు. అందులో చెప్పబడినట్టి ధర్మాలు ఆచరిస్తేనే సార్థకత.

రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



### కార్టూన్‌లతోనే సినిమాలు బావున్నాయి

ఆస్తులు అమ్మి, వస్తువులు తాకట్టు పెట్టి ఒక భక్తికి సంకేతంగా నిష్ఠతో, మన ధర్మం గొప్పతనాన్ని అద్భుతంగా మలచిన ఇతివృత్త సంచలనమే ఈ మహావతార్ నరసింహ చిత్రం. ఆమధ్య ఇలాంటి చిత్రమే హనుమాన్. నిజంగా పెద్ద పెద్ద డైరెక్టర్లు తియ్యలేని విధంగా ఈ యువ డైరెక్టర్ అశ్విని కుమార్ అద్వితీయంగా మలిచాడు. కొన్ని కొన్ని చిత్రికరణలు చాలా బావున్నాయి. భూదేవి ఆవిర్భావం, నృసింహ స్వామి యుద్ధం, ముద్దులోలుకు ప్రహల్లాదుని భక్తి, పాటలు, ఒక విభాగం ఏమిటి అన్ని విభాగాలలో ఫస్టు ప్రైజ్ కొట్టేసింది. ఇది సకుటుంబంగా మన వళ్లతో కూడా చూసే చిత్రం అనడంలో సందేహం లేదు. హీరోలతో కాకుండా ఈలా కార్టూన్‌లతోనే బావున్నాయి అనిపించిందనుటలో సందేహము లేదు.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### దొంగకంపెనీల పేరుతో మోసం

దొంగ కంపెనీ పేర్లతో హెచ్‌వన్‌బి వీసాలు, అనేక లక్షలు తీసుకుని అక్కడ ఎమ్ఎస్‌లు చేయించి చివరికి జాబ్ దగ్గర వచ్చేసరికి చేతులుఎత్తి జారిపోయే జనాలు. మొన్న టార్గెట్ అనే అమెరికన్ మాల్‌లో పద్నాలుగు వందల సరుకు దొంగిలించి పట్టుబడి బేడీలు రుచి చూసిన మహాతల్లులూ, డాక్టర్ అయినా డ్రగ్ మాదిరి మందులిస్తూ దొరికి కటకటాలు లెక్కపెట్ట పోయే మహానుభావుల్లు అమెరికాలో తయారౌతుంటే "మీరు మాకొద్దు.. మీ దేశానికి పోండి" అని పంపించారు. ఇవే ఇలాగే కొనసాగితే అందర్నీ షిప్పుల్లో పంపడం తథ్యం.

- ఎం.రంగరాజు, నల్గొండ

### ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 2021లో అప్పటి ప్రభుత్వం సుమారు మూడు కోట్ల రూపాయల నిధులతో మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, మధ్యలోనే ఆగిపోవడంతో మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయినిరుపయోగంగా మారింది. ఈప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, జమ్మికుంట

### పిఎం కిసాన్ కార్యక్రమాలను పటిష్టం చేయాలి

పీఎం కిసాన్ లాంటి కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేయడం అవసరం. మరింత సహాయత రైతన్నలకు అవసరం. ఇంకా చెప్పాలి అంటే పీఎం కిసాన్ లాంటి కార్యక్రమంను మరింత విస్తృతం చేయాలి. అందులోని సాంకేతిక సమస్యలను తొలగించి మరింత మందికి సహాయం చేయాలి. ఇక దానితో పాటు పీఎం గోకుల్‌మిషన్‌ను మరింత ప్రోత్సాహకాలు అందించి మరింత పాడిని పెంచాలి. ఇవి చేయడంతో ప్రాథమిక రంగం అందులో వ్యవసాయ రంగం ఎక్కువ వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ప్రాథమిక రంగ అభివృద్ధే దేశ ప్రగతికి సోపానంగా నిలువనుంది.

-భారత అవినాష్, జనగామ

### చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతం దాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగాఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్య వీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాలబాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలున్నా, అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదుగా మారింది. న్యాయ వ్యవస్థ వేగంగా స్పందించాలి. సమస్య పరిష్కారానికి కొన్ని కీలక చర్యలు అవసరం.

-సి. హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తెలంగాణకు నీళ్ల శాతం పెంచాలి

గోదావరి బనకచర్ల వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఈ బేసిన్‌ల గురించి రైతులు కూడా తెలుసుకుంటున్నారు. చైతన్యవంతులు అవుతున్నారు. అది తెలంగాణ ఉద్యమం ద్వారా వారికి వచ్చిన చైతన్యం ఎందుకంటే ఉద్యమ నినాదమే నీళ్ళు, నిధులు, నియామకాలు కావున ఈ నీళ్లు తెలంగాణకే ప్రాణావసరం. తెలంగాణలో గోదావరి 79 శాతం కృష్ణ 68 శాతం పారుతుంది. పారకం ఆధారంగా నీళ్లు ఇచ్చిన తెలంగాణలో గోదావరిలో నీటి వాటా ఎక్కువగా దక్కాలి.

-కె.రామకృష్ణ, హైదరాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'చితి'కిపోతున్న చేనేతలకు దిక్కెవరు?

***తెలంగాణలో చేనేత ఉత్పత్తి వెయ్యి కోట్లు ఉంటుంది. ఐదు శాతం జీఎస్టీ భరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం 50కోట్ల వరకు భారం పడుతుంది. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోదా? చేనేత పద్మశాలి వివిధ కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎందుకు చేయడంలేదు. రాష్ట్ర శాసనసభలో 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 187కోట్లు మాత్రమే ఇందులో ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే! ఇలా అయితే చేనేతరంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? లిక్కర్ పాలసీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం చేనేత రంగానికి ప్రత్యేకపాలసీ, చేనేత సంక్షేమ నిధి, చేనేతకు సం॥36 వేల పెట్టుబడి సహాయం అందించాలి.***



డా॥ చిక్కా దేవదాసు

పడుగు, పేకల బతుకులు విచ్ఛిన్నమై విలవిల్లాడుతున్నాయి. పట్టించుకునేవారి కోసం ఎదురుచూస్తున్నాయి. విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రధారణను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ప్రభుత్వాలు జాతీయచేనేత దినోత్సవాలను జరుపుతున్న వేళ చేనేతల ఆక్రందనలను గుర్తించి చేనేతల బతుకులను బాగు చేయాల్సిన అవశ్యకత ఉంది. వ్యవసాయ రంగం తర్వాత లక్షలాది ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా చేనేత రంగం దేశంలో 30 లక్షల చేనేత మగ్గాలపై దాదాపు కోటిమంది చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉంది. ఎలాంటి విద్యుత్ వినియోగం లేకుండా మానవ శ్రమ సృజనాత్మక ఆలోచనతో మనిషి తన చేతుల ద్వారానే పనిచేస్తూ వస్త్రాని తయారు చేస్తారు. పత్తి ద్వారా నూలు వడికి సహజ రంగుల అద్దకంతో పూర్తిస్థాయి ప్రకృతి సహజ సిద్ధమైన సృజనాత్మకత పెట్టుబడిగా చేనేత కార్మికులు తమ సున్నితమైన చేతులతో వేలాది దారాలను క్రమపద్ధతిలో పేర్చి వస్త్రాన్ని తయారు చేస్తారు. చేనేతరంగం కేవలం వస్త్రాల తయారీకి కాకుండా పర్యావరణాన్ని రక్షించ డానికి చేనేత కార్మికుడు ఎంతగానో దోహదపడతాడు. చేనేత కార్మికులను పర్యావరణవేత్తలుగా గౌరవించాల్సిన సమయం ఆసన్నమైంది. చేనేత వస్త్రాల తయారీలో సహజ నూలు ఉపయోగించటం వలన సింథటిక్ బట్టల తయారీలో ఉపయోగించే హానికరమైన రసాయనాలు చేనేత వస్త్రాలకు అవసరం ఉండదు. తద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. చేనేత వస్త్రాలు నేలలో సులభంగా కలిసిపోతాయి. దేశ వస్త్ర ఉత్పత్తులలో తెలంగాణ చేనేత వస్త్రోత్పత్తులకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. రంగుల అద్దకం, ప్రింటింగ్, డిజైన్లు మొదలైన నైపుణ్యతతో ఆధునిక మార్కెట్లో సైతం పోటీ పడుతున్నా రు. తెలంగాణ చేనేత కార్మికులు తరతరాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ప్రజల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా వస్త్రోత్పత్తులు చేస్తూ తమ నైపుణ్యాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాకతీయుల పరిపాలనతోపాటు అనేక సంస్థానాల మూలంగా చేనేత వస్త్రోత్పత్తులకు చేనేత కళకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆ తరువాత నిజాం పరిపాలన చేనేత వస్త్రాల ఉత్పత్తులలో అనేక మార్పులు తెచ్చి అరబ్ దేశాలకు ఎగుమతి చేయడానికి తేలియా రుమాళ్లను ప్రోత్సహించింది. నూలు సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. అగ్గిపెట్టెలో ఇమిడే ఆరు గజాల చీర అతి సున్నితంగా వస్త్రం తయారు చేయగల నైపుణ్యం, ఎటువంటి చిత్రాన్నైనా చూసి దానిని వస్త్రంపై నేయటం తెలంగాణ చేనేత నేతగాళ్ల సొం తం. తెలంగాణ రాష్ట్రంలో చేనేతన్నల జీవితాలు అత్యంత దుర్భరంగా, దయనీయంగా మారిపోయాయి. నేడు చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. చేనేత మగ్గాన్ని నమ్ముకొని బతుకులీడుస్తున్న నేతన్నలు పని లేక పస్తులుంటూ, ఆకలిచావులు ఆత్మహ త్యలకు గురిఅవుతూ తరతరాల నుంచినమ్ముకున్న చేనేతమగ్గం నేతన్నల పాలిట ఉరిగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక చేనేత రంగం చేనేతన్నల కుటుంబాల జీవితాలలో వెలుగులు నిండుతాయని, ప్రభుత్వం ద్వారా అభివృద్ధి చెందుతామని కోటి ఆశలతో చేనేత కార్మికులు ఎదురుచూశారు. కానీ ఆ విధంగా జరగకపోగా వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పాలకుల అలసత్వం, అవినీతి, వివక్షతో పూర్తిగా చేనేత రంగాన్ని సమస్యల సుడిగుండంలో నెట్టివేయబడినది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమ ఇమేజ్ గొప్పతనం పెంచుకోవడానికే ఉపయోగించుకున్నది తప్పితే చేనేతరంగా నికి చేసింది ఏమీలేదు. తెలంగాణ రాష్ట్రంలో చేనేతరంగం ప్రస్తుతం కొనఊపిరిలో ఉంది.



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే చేనేత రంగం చేనేత కార్మికుల బతుకులలో వెలుగులు నిండుతాయి అనుకుంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేనేత కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే చేనేతను జౌళిశాఖ నుండి విడదీసి చేనేతకువెంటనే ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి రెండువేల కోట్లు బడ్జెట్లో ప్రవేశపెట్టి విడుదలచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్నా నేతన్నల ఉపాధి కల్పన కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలోనే ఆర్థిక ఇబ్బందులతో పాటు ఉపాధి లేకపోవడం వలన దాదాపు 36 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందజేయలేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు తక్షణమే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 36 నెలలు ఉన్న 'చేనేతకు చేయూత పొదుపు' పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెల లుగా నిలిపివేసి నేడు 24 నెలలకు కుదించి కొత్తగా 'థ్రిఫ్ట్ పథకం' ప్రవేశపెట్టినట్లు ప్రకటించడం, గత ప్రభుత్వహయాంలో ఉన్న 'నేతన్న బీమా' పథకాన్ని 'నేతన్న భద్రత' పథకంలో వయో పరిమితి పొడిగించిందే తప్ప చేసింది ఏమీలేదు. పథకం పేరు మారిందంతే. గత బిఆర్ఎస్ ప్రభుత్వం యారన్ (నూలు) సబ్సిడీ పథకంలో ఉన్నలోపాల కారణంగా నగదు బదిలీ ద్వారా నేతకార్మికులకు 2000 రూపాయలు, అనుబంధ కార్మికుడికి 500రూపాయల చొప్పున గత ప్రభుత్వం 2024 అక్టోబర్, నవంబర్ నెలలు ఇచ్చింది. కానిఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2024 డిసెంబర్ నుండి 2025 డిసెంబర్ వరకు సంవత్సర కాలం నుండి నూలు నగదు పథకాన్ని నిలిపివేసింది. ఇప్పుడు కొత్తగా చేనేత కార్మికుడికి 18 వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. గతంలో సంవత్సరా నికి రూ.24 వేలు వచ్చే పథకాన్ని రూ.18 వేలకు తగ్గించి కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులను మరోమారు మోసం చేసింది. అయినా ఈపథకం ఇప్పటివరకు అమలు కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన 'చేనేత అభయ హస్తం' పథకాలు కొత్తవి కావు. గతంలో ఉన్న పథకాల పేరు మార్చి కోతలు విధించి పాత సీసాలో కొత్త సారా అన్న చందాన గొప్పలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను, అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న నేతన్నలకు ఉపాధి కల్పన కోసం మహిళా స్వయంసహాయక గ్రూపులో ఉన్న మహిళలకు సంవత్సరానికి రెండు చీరలు చొప్పున ఇస్తామని వాటిని తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్పత్తి చేయించి కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇంతకాలం గడిచినా ఎందుకు ఆ పథకాన్ని అమలుచేయలేదు. చేనేత కార్మికులపై ఉన్న రూ.33 కోట్లు రుణాలను మాఫీచేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి సంవత్సర కాలం గడిచినా రుణాలు మాఫీ చేయలేదు? చేనేత కార్మికులకు లక్షరూపాయల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలి. 12సంవత్సరాలు గడిచిపోతున్నా ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు టెస్కోకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు ఎన్నికలు నిర్వ హించి పాలకమండళ్లను ఏర్పాటు చేయడం లేదు? భారత్ జోడోయాత్రలో భాగంగా రాహుల్ గాంధీ జడ్చర్ల బహిరంగ సభలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే చేనేత కార్మికులపై, ఉత్పత్తులపై పడే జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందనిచెప్పిన ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి ఎందుకు విస్మరించారో. తెలంగాణలో చేనేతఉత్పత్తి వెయ్యి కోట్లు ఉంటుంది. ఐదుశాతం జీఎస్టీ భరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం 50కోట్ల వరకు భారం పడుతుంది. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోదా? చేనేత పద్మశాలి వివిధ కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎందుకు చేయడంలేదు. రాష్ట్ర శాసనసభలో 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 187 కోట్లు మాత్రమే ఇందులో ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే! ఇలా అయితే చేనేతరంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? లిక్కర్కు పాలసీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం చేనేత రంగానికి ప్రత్యేకపాలసీ ఏర్పాటుచేయాలి. ప్రభుత్వం మనదేశంలో మాత్రం చేనేతను ప్రోత్సహించడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. దేశవిదేశాల్లో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే అవకాశాన్ని చ్చేందుకు ప్రభుత్వామే ముందుకు రావాలి. చేనేతల అభివృద్ధికి నడుం కట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. •

# మానసిక వికలాంగులకు రాయితీలు కల్పించాలి


ఆళవందార్ వేణు మాధవ్

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి "వికలాంగుల హక్కుల చట్టం2016ను పార్లమెంట్ ఆమోదించింది. ఈచట్టం ప్రకారం అంధత్వం, దృష్టి లోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం, మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఈ లాంటి లోపాలున్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సర ఒక నివేదిక ప్రకారం తెలంగాణ మొత్తం రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగి పోకుండా వారి మనో వికాసం కొరకు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధారపడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులలో ప్రత్యేక క్యూలైన్ వసతి కల్పించింది. వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే. పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేని చాలామంది సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితిలో జీవిస్తున్నారు. ఇలాంటివారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైఫల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతోవచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నారు. చదువుల కొరకు తల్లితండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరుద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పనిభారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుట లేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకు కూడా రాయితీలు కల్పిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు వికలాంగులకు, విలేఖరులకు, బస్‌పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్స కొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధ పడే వారికి రాయితీలు ఇవ్వాలి. దేశంలో అత్యున్నత పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం గల వారితో పాటు మానసిక అనారోగ్యంతో బాధ పడే వారికి కూడా ప్రత్యేక పాసులు, రాయుతీల్చి ఆదుకోవాలి. •

# అట్టడుగు వర్గాలకూ రిజర్వేషన్ ఫలాలు

యం.అర్జున్

చారిత్రకంగా భారతీయ సమాజం కుల వ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది. ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతలను ప్రభావితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఒసి), వెనుకబడిన కులాలు (బిసి లేదా ఒబిసి), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటిష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కుల ఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదుచేయలేదు. కాబట్టి ఆయా సామాజిక వర్గాల వారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కుల గణనను నిలిపివేసి, పదేళ్ళకోసారి చేసే జనగణనలో ఎస్సీ, ఎస్టీ గణనపై దృష్టి సారించింది. దీని వల్ల ఒసి, ఒబిసి జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు. ఒసి, బిసిల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఒసి కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్ని కూడా సూచిస్తుంది. బిసి లేదా ఒబిసిలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద నిర్వచించబడ్డాయి. కానీ, కుల వర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది. కేంద్ర జాబితాలో ఒబిసిలుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఒసి, ఎస్సీ, లేదా ఎస్టీలుగా వర్గీకరించడ్డాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1970వ దశకంవరకు బిసి జాబితాలో లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీజాబితాలో చేర్చడం జరిగింది. ఒబిసిలను ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా విభజించారు. తెలంగాణలో మున్నూరు కాపులు బిసి జాబితాలోఉంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఒసి జాబితాలో ఉన్నారు. కర్ణాటకలో రెడ్లు బిసి జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒసిలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఒసిలుగా ఉన్నవారు, మరొక రాష్ట్రంలో బిసిలు జాబితాలో ఉన్నారు. ఇక్కడే అసలు దేశంలో ఒసిలెవరు? బిసిలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బిసి, ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకి భంగం కలగకుండా ఒసిల్లో ఉన్న పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించింది. రిజర్వేషన్ మినహాయించిన తర్వాత మిగిలిన ఓపెన్ కేటగిరీలో అన్ని సామాజిక వర్గాల వారు సమానంగా పోటీ పడే అవకాశం ఉంటుంది. ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినప్పుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం. 1953




లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్‌దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది. కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు. 1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఒబిసిలుగా వర్గీకరించి, 27శాతం రిజర్వేషన్‌ను కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. 1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27శాతం రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీ లేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలకు విస్తరించబడింది. రిజర్వేషన్ విధానం ఒబిసిలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ఒబిసిలకు చట్ట సభల్లో ప్రత్యేక కోటా లేదు. భారతీయ సమాజంలో ఎస్సీ, ఎస్టీలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బిసిలు పురోభివృద్ధి సాధించినందున ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికి, బిసి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండక పోవచ్చు. సమకాలీన సందర్భంలో, కుల గణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈ సారి జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈగణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది. ఆయా సామాజిక వర్గాలకి పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీ లేయర్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజిక వర్గాలు తరతరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడంద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగు వర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు. రాష్ట్రాలకు ఒబిసి జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది, కానీ రాజ్యాంగం ప్రకారం జనగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది. ఒసి, బిసిల గుర్తింపు భారతీయ సమాజంలో సామాజిక న్యాయం, అవకాశాల కల్పనలో కీలకమైన అంశం. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, క్రీమీ లేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి. వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి. ఈ రోజుల్లో కూడా దేశవ్యాప్తంగా ఒసి వర్గంలో కొన్ని కులాలు, బిసిహోదాను, బిసి వర్గంలో ఉన్నకులాలు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గంలో చేర్చమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీద ఒత్తిడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏండ్లు అయినా అట్టడుగు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందట్లేదు అంటే చట్టాలను పున సమీక్షించుకోవడం కన్నా ముందు క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరుపైన ప్రభుత్వాలు, పౌర సమాజం దృష్టి సారించాలి. •

7-8Pg5.qxd:7-8Pg5.qxd 1/1/02 8:10 AM Page 1



# పిల్లల్ని కనండి..రూ.44వేలు పట్టుకోండి!



## చైనాలో యువ దంపతులకు జిన్‌పింగ్ సర్కార్ ఆఫర్

**బీజింగ్, ఆగస్టు 6:** ఒకప్పుడు ఒక బిడ్డకంటే ఎక్కువ ఉంటే 12 లక్షల రూపాయలు జరిమానాలు చెల్లించే చైనా పౌరులు ఇపుడు పిల్లల్ని కనాలని సంతానం పెంచుకోవాలంటూ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. గతంలో చైనా ప్రభుత్వం ఇంటికి ఒకే బిడ్డ ఉండాలంటూ హుకం జారీచేయడంతో ఎవ్వరూ ముందుకు రాలేదు. దీనివల్ల చైనాలో వృద్ధ జనాభా పెరుగుతోంది. వారి సంక్షేమభారం కూడా ప్రభుత్వం పైనే ఉంది. ఇందుకోసం శ్రామికశక్తిని అనివార్యంగా పెంచేందుకు చైనా ఇపుడు యువ జనాభాను ఎక్కువ కోరుతోంది. ఇప్పుడు చైనా ప్రభుత్వం యువకులు ఎక్కువ మంది పిల్లలను కనాలని కోరుకుంటోంది. దీనిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు సంవత్సరాల లోపు వయసున్న ప్రతి బిడ్డకు 3,600యువాన్లు (రూ. 44,000) ఇవ్వనుంది. ఈ పథకం జనవరి 1 నుంచే వర్తిస్తుంది. ఈ ఏడాది 20 మిలియన్ల కుటుంబాలకు సహాయం చేయడానికి బీజింగ్ 90 బిలియన్ యువాన్లు (లక్ష కోట్ల కంటే ఎక్కువ) ఖర్చు చేయాలని యోచిస్తోంది. గతంలో ఇలాంటి సహాయాన్ని కేవలం స్థానిక ప్రభుత్వాలు మాత్రమే అందించేవి. అయితే, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సబ్సిడీ ఇవ్వడం ఇదే మొదటిసారి. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఇవి జనన రేటును పెద్దగా పెంచకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జపాన్, దక్షిణ కొరియాలో ఇలాంటి పథకాలు విఫలమయ్యాయి. చైనాలో చాలామంది యువత ఎక్కువ పనిగంటలు, ఖరీదైన ఇల్లు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారు. ఈ చిన్న ఆర్థిక సహాయం వారి పెద్ద సమస్యలను పరిష్కరించదు. కొంతమంది తల్లిదండ్రులు ఈ డబ్బును స్వాగతించినా, మరి కొందరు పిల్లలను కనడం గురించి ఇంకా సందేహంలోనే ఉన్నారు. ఒక బిడ్డను పెంచే ఖర్చు చాలాఎక్కువ, సంవత్సరానికి3,600 యువాన్లు కేవలం ఒక చిన్న సహాయం మాత్రమేనని జేన్ లీ చెప్పారు. జేన్‌కు 9 సంవత్సరాలు ఉన్నప్పుడు, అతడి తల్లిదండ్రులు రెండోబిడ్డను కన్నందుకు భారీ జరిమానా చెల్లించారు. ఇప్పుడు 25 సంవత్సరాల వయసున్న జేన్ పిల్లలను కనాలని ఆలోచించడం లేదని చెప్పారు. పిల్లలను కనడం నాకు మరిన్ని కష్టాలను తెస్తుంది. నేను ఒక పెట్టుబడిదారుడిని కాదు, నా బిడ్డకు మంచి జీవితం ఉండకపోవచ్చుఅని జేన్ అన్నారు. చైనా సోషల్ మీడియాలో యువకులు ఒక బిడ్డ పాలసీ సమయంలో వారి తల్లిదండ్రులు కట్టిన జరిమానాల పాత రసీదులను షేర్ చేస్తున్నారు. కష్టపడి చదువుకుంటే జీవితం మెరుగుపడుతుందని చాలా మంది అనుకున్నారు. కానీ ఇప్పుడు వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయని సీఎన్ఎన్ తెలిపింది. ఆస్తుల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మంచి ఉద్యోగాలు బలమైన కుటుంబ పరిచయాలు ఉన్నవారికి మాత్రమే లభిస్తున్నాయి. చైనా ఒక బిడ్డ పాలసీని రద్దు చేసి ఇప్పుడు ముగ్గురు పిల్లల వరకు కనడానికి అనుమతించినప్పటికీ, జనన రేటు పడిపోతూనే ఉంది. గత మూడు సంవత్సరాలుగా చైనా జనాభా తగ్గుతూ వస్తోంది. పీటర్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ ప్రకారం 2023లో చైనాలో 9 మిలియన్ల జననాలు, 11.1 మిలియన్ల మరణాలు నమోదయ్యాయి.

జనాభా తగ్గుదల తిరిగి మార్చలేని స్థాయికి చేరుకుంటోందని ఇనిస్టిట్యూట్ పేర్కొంది. చైనాలో ఒక బిడ్డను పెంచడానికి సగటున 5,38,000 యువాన్లు (రూ. 65 లక్షలు) ఖర్చవుతుంది. ఇది దేశ సగటు ఆదాయానికి ఆరు రెట్లు ఎక్కువ. షాంఘై, బీజింగ్ వంటి నగరాల్లో ఈ ఖర్చు కోటిని దాటిపోతుంది. ఇలాంటి అధిక ఖర్చుల కారణంగా చాలా మంది జంటలు పిల్లలను కనడానికి ఆసక్తి చూపడం లేదు.



### తొలగించిన 65 లక్షల

# ఓట్ల వివరాలు వెల్లడించాలి

### ఎన్నికల సంఘానికి సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ 'సర్' ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఒకాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారంలోగా రిప్లై నమోదు చేయాలని, ఎడిఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏవిషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. తొలగించిన 65 లక్షల ఓటర్లు మరణించారా లేక శాశ్వతంగా ఇళ్లు మారారాఅన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఎడిఆర్ తన అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలుఇచ్చింది. డిలీట్‌చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈకేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.



### రష్యా అధినేత పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక రాయబారి

# స్టీవ్ విట్కాఫ్ సమావేశం

### వెల్లడించిన క్రెమ్లిన్

**మాస్కో, ఆగస్టు 6:** ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే పెద్ద ఎత్తున సుంకాలతో శిక్షిస్తానని హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేడు మాస్కో వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ సైతం ఎదురు దాడులు కొనసాగిస్తుండటంతో ఇటీవల కాలంలో యుద్ధం తీవ్రత మరింత ముదిరింది. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు విఫలమయ్యాయి. తాను అధికారంలోకివస్తే యుద్ధానికి తెరదించుతానని పేర్కొన్న డొనాల్డ్ ట్రంప్ ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధంముగింపుపై తొలుత 50 రోజుల్లోపు ఓ ఒప్పందానికి రావాలని రష్యాను హెచ్చరించిన ఆయన ఇటీవల ఆ గడువును మరింత తగ్గించారు. మరోవైపు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4:30 గంటలకు ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఆ దేశంపై ఆంక్షలువిధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్‌పైనా సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.



# పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్!

**రాంచి,ఆగస్టు 6:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి బుధవారం ఝార్ఖండ్ లోని చాయ్‌బాసా ఎంపీఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ హాజరు అనంతరం న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చాయ్‌బాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో అప్పటి బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం, రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 26న హాజరు కావాల్సి ఉండగా, ఇతర కార్యక్రమాల కారణంగా తేదీని మార్చాలని రాహుల్ తరఫు న్యాయవాది ఝార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో ఆగస్టు 6న హాజరుకావాలని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ ఈరోజు విచారణకు హాజరయ్యారు.

## తండ్రీకొడుకుల ఘర్షణ ఆపేందుకువెళ్లిన ఎస్ఐ దారుణ హత్య

**తిరుప్పూరు, ఆగస్టు 6:** తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో దారుణం జరిగింది. తండ్రీ కుమారుల మధ్య గొడవను ఆపేందుకు వెళ్లిన సబ్ ఇన్‌స్పెక్టర్‌ను దారుణంగా నరికి చంపారు. ఉడుమల్‌పేట సమీపంలోని కుడిమంగళం గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రి గస్తీలోఉన్న ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగవేల్‌కు అత్యవసర కాల్ ఒకటి వచ్చింది. దీంతో వెంటనే ఆయన ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక అన్నాడిఎంకే ఎమ్మెల్యేకు చెందిన ఒక ప్రైవేట్ ఎస్టేట్‌లో పనిచేసే మూర్తి, ఆయన ఇద్దరు కుమారులు తంగపాండియన్, మణికందన్ మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగుతోంది. కొడుకులిద్దరూ కలిసి తండ్రిపై దాడి చేయడంతో షణ్ముగవేల్ జోక్యం చేసుకుని, గాయపడిన మూర్తిని ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్‌ను పిలిపించారు. ఈ క్రమంలో పెద్ద కొడుకు తంగపాండియన్‌తో షణ్ముగవేల్ మాట్లాడుతుండగా, చిన్న కొడుకు మణికందన్ కొడవలితో ఆయనపై దాడి చేశాడు. ఆ తర్వాత తండ్రి, పెద్ద కొడుకు కూడా ఆ దాడిలో పాల్గొన్నారు. పోలీస్ అధికారిని వెంబడించి నరికి చంపారు. షణ్ముగవేల్ డ్రైవర్ తప్పించుకుని అధికారులకు సమాచారం అందించాడు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.

## భారత్‌లాంటి బలమైన మిత్రుడి బంధం తెంచుకోవద్దు

### ట్రంప్‌కు రిపబ్లికన్‌నేత నిక్కీ హేలీ హితవు



**వాషింగ్టన్, ఆగస్టు 6:** భారత్ లాంటి బలమైన మిత్రుడితో బంధాన్ని తెంచుకోవద్దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిక్కీ హేలీ హితవు పలికారు. భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ సౌత్ కరోలినారాష్ట్రానికి గవర్నర్‌గా సేవలందించారు. రిపబ్లికన్ నేత అయిన హేలీ గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ కోసం ప్రయత్నించారు. అయితే, చివరకు బరిలో నుంచి తప్పుకొని ట్రంప్‌కు మద్దతిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ యుద్ధానికి పరోక్షంగా సాయపడుతోందంటూ భారత్‌పై ట్రంప్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. చమురు కొనుగోళ్లు ఆపకుంటే భారీ మొత్తంలో టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నిక్కీ హేలీ స్పందిస్తూ.. భారత్ లాంటి బలమైన మిత్రుడితో విభేదాలు వద్దని ట్రంప్‌కు హితవు పలికారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలలో భారత్‌కంటే చైనానే ముందు ఉంటుందని గుర్తుచేశారు. అలాంటి చైనాపై విధించిన టారిఫ్‌లకు 90 రోజుల విరామం ప్రకటించిన ట్రంప్ భారత్‌పై మాత్రం టారిఫ్‌ల మీద టారిఫ్‌లు విధిస్తాననడం సరికాదని హేలీ అభిప్రాయపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు కానీ, చైనా చేయొచ్చా అంటూ హేలీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# కర్తవ్యభవన్ ప్రారంభించిన ప్రధానిమోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** సెంట్రల్ విస్టాలో భాగంగా కొత్తపార్లమెంటు భవనంలోని కేంద్ర ఉమ్మడి సచివాలయ ప్రాజెక్టులోని భాగం అయిన కర్తవ్యభవన్‌ను ప్రధానిమోడీ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకింద మొత్తం 10 కార్యాలయ భవనాలు నిర్మించనున్నట్లు కేంద్ర గృహనిర్మాణ పట్టణ ప్రజాపనులశాఖ తెలిపింది. సిసిఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్యభవన్‌లోకి కేంద్ర హోంశాఖ, విదేశీ వ్యవహారాలు,పెట్రోలియంశాఖ, ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్ కార్యాలయాలు తరలించనున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సిసిఎస్-2, సిసిఎస్-3 భవనాలు వచ్చేనెలకి పూర్తికానున్నాయి. సిసిఎస్-10వ భవనం వచ్చే ఏడాది ఏప్రిల్ చివరినాటికి, ఆరు, ఏడుభవనాలు వచ్చే ఏడాది అక్టోబరునాటికి పూర్తవుతాయని సంబంధిత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టాప్రాజెక్టులో సిద్ధమైన మొట్టమొదటిభవనం కర్తవ్యభవన్. 1950-1970మధ్య నిర్మించిన శాస్త్రిభవన్; కృషిభవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్‌భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ సిసిఎస్ ప్రాజెక్టుకింద నిర్మిస్తున్న కొత్తభవనాల్లోకి వచ్చేస్తాయి. నిర్మాణం పూర్తయ్యేవరకూ నాలుగుభవనాలనుంచి పనిచేస్తున్న కార్యాలయాలు రెండేళ్లపాటు కస్తూర్బాగాంధీ మార్గ్, మింట్‌రోడ్, నేతాజీ ప్యాలెస్‌లోని నాలుగు కొత్తభవనాల్లోకి వెళతాయని మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ తెలిపారు. కొత్తభవనాల్లో నేషనల్ మ్యూజియం, నేషనల్ ఆర్కైవ్స్, జవహర్ నెహ్రూభవన్, డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియంలున్నాయి. సెంట్రల్ విస్టా పునర్నిర్మాణప్రణాళిక కింద కేంద్రం ఇప్పటికే కొత్తపార్లమెంటుభవనం, ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్‌నునిర్మించింది. విజయ్‌చౌక్‌నుంచి ఇండియా గేట్‌వరకూ విస్తరించి ఉన్న కర్తవ్య మార్గాన్ని తిరిగి అభివృద్ధిచేసింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌తోపాటు ప్రభుత్వం ఒక ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్‌ను కూడా నిర్మిస్తోంది. దీనితో ప్రధానమంత్రి కొత్తకార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, ఇండియా హౌస్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌లున్నాయి. ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ రెండోదశలో ప్రధాన మంత్రి కొత్తనివాసాన్ని సైతం నిర్మించనున్నారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకోసం పాక్, చైనా కిరాయి సైనికులు: జెలెన్‌స్కీ



**క్యీవ్, ఆగస్టు 6:** ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున చైనా, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు చెందిన కిరాయి సైనికులు పోరాడుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా పక్షాన పోరాడుతున్న ఈ విదేశీ కిరాయి మూకలకు తగిన విధంగా బదులిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

జెలెన్‌స్కీ కీలకమైన వోవ్‌చాన్స్క్ యుద్ధ క్షేత్రంలో పర్యటించి, అక్కడి సైనికులతో సమావేశమయ్యారు. ఈ పర్యటన అనంతరం జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలో దేశాన్ని రక్షిస్తున్న మన సైనికులను కలిశాను. యుద్ధ క్షేత్రంలోని పరిస్థితులు, రక్షణ వ్యూహాలపై కమాండర్లతో చర్చించాను. ఈ సందర్భంగా, రష్యా పక్షాన చైనా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాలకు చెందిన కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు మా సైనికులు నివేదించారు. దీనిపై మేము తప్పకుండా స్పందిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపి, వారికి ప్రభుత్వ అవార్డులను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ యుద్ధ భూమిలో పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఆగస్టు 5న ఒక్కరోజే రష్యా, ఉక్రెయిన్ దళాల మధ్య 143 సార్లు భీకర ఘర్షణలు జరిగినట్లు ఉక్రెయిన్ సాయుధదళాల జనరల్ తెలిపారు. ముఖ్యంగా పోక్రోవ్స్క్ సెక్టార్‌లో అత్యంత తీవ్రమైన దాడులు జరిగినట్లు ఆగస్టు 6న ఉదయం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత 24 గంటల్లో రష్యాదళాలు రెండు క్షిపణిదాడులు,107 వైమానిక దాడులు చేశాయని, ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, జనావాసాలపై 147 గైడెడ్ బాంబులను ప్రయోగించాయని ఆ నివేదిక వివరించింది. రష్యా దాడులకు ప్రతిగా, తమ వైమానిక, క్షిపణి దళాలు రష్యాకు చెందిన 14 లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో శత్రువుల కమాండ్ పోస్టులు, సైనిక స్థావరాలు, ఆయుధాగారాలు ఉన్నట్లు స్పష్టం చేసింది.

# మొహాలి ఆక్సిజన్ సిలిండర్ ప్లాంట్‌లో భారీ పేలుడు

### ఇద్దరు కార్మికులు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు

**మొహాలి, ఆగస్టు 6:** మొహాలి పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఉదయం ఆక్సిజన్ సిలిండర్ ఫిల్లింగ్‌కేంద్రాలో భారీ పేలుడు సంభవించింది ఇద్దరు కార్మికులు చనిపోగా మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఉద్యోగులు సిలిండర్ ఫిల్లింగ్, లోడింగ్‌లో మునిగి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సిలిండర్లు వైద్య రంగంలో ఆక్సిజన్ సిలిండర్లుగా వినియోగిస్తారు. ఒక సిలిండర్ హఠాత్తుగా పేలిపోవడంతోనే ఈదుర్ఘటన జరిగింది. దీనితో భారీ ఎత్తున మంటలు చెలరేగి ఇతర సిలిండర్లను తాకడంతో ఫ్యాక్టరీలో భారీపేలుడు సంభవించింది. సమీపంలోని కట్టడాలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. అత్యవసర స్పందన దళాలు అగ్నిమాపక యూనిట్లు పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది హుటాహుటిన స్పాట్‌కువెళ్లారు. గాయాలపాలయిన వారిని వెంటనే ఫేజ్6లోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. సిటీఎస్పీ సిరివెన్నెల మాట్లాడుతూ ప్రాథమిక దర్యాప్తులో పేలుడుకు గల కారణాలు నిర్ధారిస్తామన్నారు. బహుశా గ్యాస్ లీకేజి కారణంగా ఈప్రమాదం జరిగిఉంటుందని చెప్పారు. ఆప్రాంతంలోని కంబాలి గ్రామ సరిహద్దులవరకూ కూడా సిలిండర్ శకలాలు గాలిలోకి ఎగిరి పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బాధితుల శరీరాలుకూడా ముక్కలుగా తెగిపడ్డాయి.

మృతదేహం విడి భాగాలు పేలుడుస్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్నాయి. సమీపం లోని పారిశ్రామిక యూనిట్లలోకూడా ఈ పేలుడుధాటికి స్వల్ప నష్టం జరిగిందని చెపుతున్నారు. ప్రమాదంతో ఈప్రాంతం మొత్తం ఎలాంటి కార్యకలాపాలు లేకుండా నిలిపివేసారు. ఫోరెన్సిక్ బృందాలు, ఫైర్‌సేఫ్టీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులు సంఘటన ప్రాంతంలో క్లూలకోసం కృషిచేస్తున్నారు. ఈప్రాంతంలో పేలుడు సంభవించే ప్రమాదకర సామగ్రి ఏదీ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేసారు.

# డోజ్ మాజీ ఉద్యోగిపై ఇద్దరు యువకుల దాడి!

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ కోరిస్టీన్‌పై జరిగిన దాడి కలకల రేపింది. ఈ ఘటనకు సంబంధించి 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురను పోలీసులు అరెస్ట్ చేశారు. కోరిస్టీన్ అలియాస్ బిగ్ బాల్స్ డోజ్‌లో గుర్తింపు పొందారు. నగరంలోని లోగాన్ సర్కిల్ పరిసరాల్లో కోరిస్టీన్, ఆయన సహచరిపై దాడిజరిగింది. కొందరు టీనేజర్లు వారి కారును దొంగిలించడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో కోరిస్టీన్ తన సహచరిని కారులోకి నెట్టి వారిని ఎదుర్కొన్నారు. దీంతో వారు ఆయనపై దాడికి పాల్పడ్డారు. సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు జోక్యం చేసుకోవడంతో దుండగులు పారిపోయారు. మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ మేరీల్యాండ్‌కు చెందిన ఇద్దరు 15 యేళ్ల టీనేజర్లను కార్‌జాకింగ్ ఆరోపణలపై అరెస్టు చేసింది. దీనిపై ట్రంప్ మాట్లాడుతూ డిసి దీనిని త్వరగా సరిదిద్దుకోకపోతే నగరాలను ఫెడరల్ నియంత్రణలోకి తీసుకోవాల్సి వస్తుందని పోస్ట్ చేశారు.

వాషింగ్టన్‌లో నేరాలు నియంత్రణలో లేవని ట్రంప్ ఆవేదన వ్యక్తంచేశారు. వాషింగ్టన్ డిసికి రాష్ట్ర హోదా లేకపోవ దంతో ఫెడరల్ పర్యవేక్షణ కొరవడుతోంది. ఫలితంగా నేరాలు పెచ్చుమీరుతున్నాయని చెబుతున్నారు. గతేడాది కూడా 14 ఏళ్ల కుర్రాడు కార్‌జాకింగ్‌లో ఒక లిఫ్ట్ డ్రైవర్‌ను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ దాడిపై దర్యాప్తు కొనసాగుతోందని, మరికొంతమంది నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## కాలిఫోర్నియాలో వేగంగా వ్యాపిస్తున్న భారీ కార్చిచ్చు!



**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో ఈ నెల 1న అంటుకున్న భారీ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. 'గిఫోర్డ్'గా పేర్కొన్న ఈ కార్చిచ్చు ప్రస్తుతం 65 వేల ఎకరాలకు పైగా విస్తరించింది. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. లాస్‌ఏంజెలెస్, వెంచురా, కార్న్ వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసితులతో పాటు పొరుగున ఉన్న లాస్‌వేగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో పలు సూచనలు చేశారు. ప్రభావం ఎక్కువగా ఉండే శాంటామారియా వంటి ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నారు. మరోవైపు మంటలను అదుపు చేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటికి 3 శాతం మాత్రమే అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## తమిళనాడు మత్స్యకారులను విడిపించండి: స్టాలిన్



**చెన్నై, ఆగస్టు 6:** శ్రీలంక నౌకాదళం అరెస్టుచేసిన తమిళనాడు మత్స్యకారులను విడిపించేందుకు దౌత్యపరంగా కృషిచేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్‌కు లేఖరాసారు. శ్రీలంక నావికా దళం 13 మంది తమిళనాడు మత్స్యకారులను తమ జలాల్లోకి ప్రవేశించారని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శ్రీలంక అధికారులు మొత్తం 173 ఫిషింగ్ పడవలతోపాటు 80 మంది మత్స్యకారులను అరెస్టుచేసారు. ఈ అరెస్టులవల్ల వారి కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని చెపుతున్నారు. అంతేకాకుండా కుటుంబాల్లో ఆందోళన కూడాప ఎరిగిందని తక్షణమే దౌత్యపరమైన చర్చలు, సంప్రదింపులతో వారి పడవలు, మత్స్యకారులందరినీ విడుదలచేయించాలని కోరారు. అంతకుముందు గతనెలలో కూడా స్టాలిన్ జైశంకర్‌కు ఇదే సమస్యపై మూడు లేఖలు రాసారు.

## సింహాంతో చెలగాటమాడితే అంతే!

**భావ్‌నగర్, ఆగస్టు 6:** ఆహారం తింటున్న సింహానికి అత్యంత సమీపంగా వెళ్లి వీడియో తీసుకునేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకున్న యువకుడి సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వివరాల్లోకి వెళితే గుజరాత్‌లోని భావనగర్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అడవిలో ఒక సింహం తాను వేటాడిన జంతువును తింటోంది. ఆ సమయంలో ఓ యువకుడు తన ఫోన్ చేతిలో పట్టుకుని నెమ్మదిగా దాని దగ్గరికి వెళ్లాడు. ఆ మృగరాజుతో ఓ క్లోజప్ వీడియో తీయాలన్నది అతని ఉద్దేశం. మొదట తన ఆహారంలో నిమగ్నమైన సింహం, కాసేపటికి తన దగ్గరికి వస్తున్న వ్యక్తిని గమనించింది. వెంటనే తీవ్ర ఆగ్రహానికిలోనైన సింహం, పెద్దగా గర్జిస్తూ ఆ యువకుడి వైపు దూసుకొచ్చింది. దీంతో భయపడిపోయిన ఆ యువకుడు, నెమ్మదిగా వెనక్కి అడుగులు వేస్తూ అక్కడి నుంచి తప్పుకున్నాడు. అదృష్టవశాత్తూ సింహం తన ఆహారం వద్దకు తిరిగి వెళ్లిపోవడంతో అతను సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఉన్నవారు భయంతో కేకలు వేయడం వీడియోలో వినిపించింది.

## పక్షి ఢీకొట్టడంతో విమానం క్యాబిన్ మొత్తం పొగలు

**ప్యారిస్, ఆగస్టు 6:** పారిస్ వెళ్తున్న ఒక విమానం ముక్కు భాగాన్ని పక్షిఢీకొనడంతో క్యాబిన్ మొత్తం పొగతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అనంతరం విమానం బయలుదేరిన 20 నిమిషాలకే వెనక్కి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆర్‌టిడాట్‌కామ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. అందులో ఒక ప్రయాణికుడు ఆక్సిజన్ మాస్క్ పట్టుకుని భయపడుతుండటం కనిపిస్తుంది. ఐబేరియా విమానం ఐబి579 మాడ్రిడ్‌లోని అడోల్ఫో సువారెజ్ మాడ్రిడ్‌బారాజాస్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. గాల్లోకి ఎగిరిన 20 నిమిషాలకే ఒక పెద్ద పక్షి విమానం ముక్కు భాగాన్ని బలంగా ఢీకొంది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానంలో ఉన్న ప్రయాణికుడు జియాన్‌కార్లో సాండోవల్ ఈ భయానక దృశ్యాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మొదట అది సాధారణ గాలి దుమారం అనుకున్నాం, కానీ తర్వాత భయానక శబ్దాలు వినిపించడం మొదలైంది. ఏదో జరిగిందని మాకు అర్థమైందని ఆయన పేర్కొన్నారు.

7-8Pg6exHMNWJQE.qxd:7-8Pg6exHMNWJQE.qxd 1/1/02 8:50 AM Page 1



# ఎంపి లాడ్స్ నిధులను ఏడాదికి 5 నుంచి 10 కోట్లకు పెంచండి

## - ఎంపి లాడ్స్ పనులకు పూర్తిగా జిఎస్‌టి మినహాయింపు ఇవ్వండి
## - లోక్ సభలో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త బ్యూరో** ఎంపి లాడ్స్ నిధులను ప్రతి ఏటా ఒక్కొక్క ఎంపికి కేటాయించే రూ.5 కోట్లను కేంద్ర ప్రభుత్వం 10 కోట్లకు పెంచాలని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ బుధవారం లోక్ సభలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై జిఎస్‌టి మినహాయింపును కూడా ఇవ్వాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో నిబంధన 377 కింద ఎంపి లాడ్స్ పథకంలో తక్షణ మార్పులు చేపట్టాలని బుధవారం పార్లమెంట్ సమావేశాల్లో విజ్ఞప్తి చేశారు. 2011 నుంచి ప్రతి ఎంపికి ఎంపి లాడ్స్ కింద ఏడాదికి 5 కోట్లు నిధులను కేటాయిస్తున్నారన్నారు. పెరిగిన ద్రవ్యోల్బనం, నిర్మాణ వ్యయాల పెరుగుదల, ప్రజా అవసరాలు పెరుగుదలతో నిధులు తక్కువ వస్తున్నాయని అనంతపురం లోక్ సభ వంటి గ్రామీణ నియోజకవర్గాల్లో తాగునీటి కొరత, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పథకాలు చేపట్టేందుకు ప్రస్తుతం ప్రాథమిక అవసరాలకే ఎంపి లాడ్స్ నిధులు సరిపోవడం లేదని, అందులో భాగంగా రూ.5 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల మాదిరే ఎంపి లాడ్స్ పనులకు జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



ఇలాంటి చర్యల ద్వారా వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాల్లో గ్రామీణ అభివృద్ధి చర్యలకు గ్రామీణాభివృద్ధి చర్యలను విస్తృతంగా చేపట్టేందుకు కేంద్రం ఆదుకున్నట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఇతర మంత్రిత్వ శాఖలను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

ఈ విషయం లోక్ సభలో చర్చనీయాంశంగా మారింది.



కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్

# యూత్ సమ్మిట్‌ల ద్వారా యువత నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకోవాలి : మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో జరుగనున్న ..కోనసీమ యూత్ సమ్మిట్.. పోస్టర్ ను బుధవారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ., యువత లో దాగి ఉన్న టాలెంట్ ను, స్కిల్స్ ను రాష్ట్ర భవిష్యత్ అవసరాల కోసం వినియోగించుకునేందుకు కోన సీమ యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. యువత తమ ఆలోచనలు వ్యక్తపరచడానికి యూత్ సమ్మిట్ సరి అయిన వేదికగా ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధి అజండాగా భవిష్యత్ ప్రణాళికలు చర్చించడంతో పాటు, యువత లోని నాయకత్వ లక్షణాలు, పరిస్థితులకు తగినట్లు వేగంగా నిర్ణయాలు తీసుకునే ఆలోచన విధానాలను యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాల ద్వారా యువత అలవర్చు కోవాలని ఆయన సూచించారు. యువతకు ఎంతో ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమ నిర్వహణ కు నడుబిగించిన మంత్రి సుభాష్ ను ఈ సందర్బంగా ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. కేబినెట్ సమావేశానికి ముందు జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులైన నిమ్మల రామానాయుడు, ఆనం రాం నారాయణ రెడ్డి, కొలుసు పార్థసారథి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, అనగాని సత్య ప్రసాద్, రాం ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# బాలాజీనగర్‌వాసులకు చిరుతల భయం !



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అనాదికాలం నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా సేవలందించిన కుటుంబాలు, ఉద్యోగులు ,వ్యాపారులు, స్థానికులు ఇలా సుమారు ఐదువేల వరకు కుటుంబాలు నివాసముంటున్న తిరుమల బాలాజీనగర్ వాసులకు చిరుతల భయం వెంటాడుతోంది. ఇంకా ఏనుగులు, విషసర్పాలు, ఎలుగుబంట్లు,జింకలు కూడా ఈ పరిసరాల్లో ఆహారం కోసం వస్తుంటాయి. ఇలా వచ్చినపుడు ఇతర జంతువులు దాడిచేయడం అరుదుగా జరుగుతుంది. శేషాచలం అటవీప్రాంతం మధ్యలో ఏర్పాటైన బాలాజీనగర్‌లో గత దశాబ్ధకాలంగా చిరుతలు, జింకలతో సావాసం చేయాల్సిన దుస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. పైగా చీకటిపడితే ఎటువైపు నుండి చిరుతలు, పాములు ,ఎలుగుబంట్లు వస్తాయని భయాందోళన చెందుతున్నారు. రెండురోజుల క్రిందట ఏకంగా బాలాజీనగర్ సమీపంలోని గంగమ్మ ఆలయంవద్దకు చిరుతపులి రావడం, ఆ పరిసరాల్లో సంచరించడం సిసికెమెరాల్లో రికార్డయ్యింది. అంతేగాక పిల్లిని వేటాడేందుకు ప్రయత్నించి చివరకు అడవిబాట పట్టింది. బాలాజీనగర్ వాసుల భద్రతకు అటవీసరిహద్దుచుట్టూ కంచే వేస్తామని టిటిడి అధికారులు, తిరుపతి ఎమ్మెల్యే హామీ కూడా కలగానే మిగిలిపోయింది. బాలాజీనగర్‌లో అధికులు పలు రకాల వ్యాపారాలు చేసుకుని, టిటిడిలో విధులు ముగించుకుని అర్ధరాత్రి వేళ కూడా ఇళ్ళకు చేరుకుంటారు. ఈ సమయంలో చిరుతపులులు దాడిచేస్తే పరిస్థితి ఏంటనే భయం ఉంది. కొన్ని వీధుల్లో వీధిదీపాలు కూడా సరిగా వెలగడంలేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ ప్రాంతవాసులు కోళ్ళు,కుక్కలను పెంచుకోవడం నిషేధించారు. అయినా ఇళ్ళల్లో వదలిపెట్టిన చెత్తాచెదారం, ఆహారపదార్థాలు కూడా చిరుతలు రావడానికి కారణమని అటవీఅధికారుల వాదన. అటవీప్రాంతానికి సమీపంలోనే ఉన్న బాలాజీనగర్‌వాసులకు రక్షణగా కంచే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# కృష్ణమ్మ హారతుల్లో పాల్గొన్న ఇఓ దంపతులు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త** పవిత్ర కృష్ణవేణి నదీమతల్లికి సమర్పించే హారతుల కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్ దంపతులు బుధవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన దుర్గమ్మవారి ఆలయ బస్సులో ప్రయాణించి భక్తులతో సౌకర్యాలపై ముచ్చటించారు.

-శాశ్వత అన్నదాన పథకానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని మరియు బంగారు తాపడం పనులకు రు.1,01,116ల విరాళాన్ని బీమవరంకు చెందిన ఎం రాఘవమ్మ, కుటుంబీకులు బుధవారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన మానేపల్లి వేంకట పద్మావతి, వేంకటలక్ష్మి రాజా పేరిట ప్రతిరోజు ఇద్దరికి అన్నదానం జరపడానికి రు.1లక్ష విరాళాన్ని బుధవారం ఆలయాధికారులకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# స్వయం సహాయక సంఘాలకు లోకోస్ యాప్

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయం సహాయక సంఘాలకు చెందిన పూర్తి లావాదేవీలు, సమావేశాలు తదితర వివరాలు అన్నీ ఒకేచోట ఉంచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. అవకతవకలను అరికట్టేందుకు, మహిళలకు పూర్తిస్థాయిలో సమాచారం అందించేందుకు 2023లో దీనిని పోర్టల్ రూపంలో తీసుకొచ్చింది. అయితే రాష్ట్రంలో ఇది పూర్తి స్దాయిలో అమలులోకి రాలేదు.. కూటమి అధికారంలోకి రావడంతో దీంతో క్షేత్రస్థాయి నుంచి దీని నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా, క్లస్టర్, మండల, గ్రామస్థాయిలో శిక్షణ మొదలు పెట్టారు. వీవోల నుంచి అధికారుల వరకు అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పొదుపు సంఘాలకు మంజూరవుతున్న రుణాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం. ఎన్‌ఆర్‌ఎల్ఎం(జాతీయ గ్రామీణ లైవ్లీహుడ్ మిషన్) పథకం కింద నిధులు ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో దీనికి అనుబంధంగా ఎస్ ఎన్‌ఆర్‌ఎల్ఎం అమలవుతోంది. దీనిని సెర్ప్ శాఖ పర్యవేక్షిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ విభాగాలు చూస్తున్నాయి. ఈ సందర్భంగా దేశం మొత్తం వివరాలు ఒకేచోట ఉండేలా ప్రణాళికలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.సిబ్బందికి శిక్షణ పూర్తయ్యాక అన్ని వివరాలు ఈ యాప్‌లో కనిపించనున్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్ లలో ప్లేస్టోర్ ద్వారా దీనిని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడినుంచైనా వివరాలు చూడొచ్చు. సంఘాలతో పాటు జీవనోపాధుల ఫొటోలు, ఇతర వివరాలన్నీ ఇందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, దీంతో ఆర్థికస్థితిగతులు తెలుస్తాయని డీఆర్డీఏ అధికారులు తెలిపారు,

# చట్టసభల్లో ఒబిసి రిజర్వేషన్లిచ్చే వరకు పోరాడతాం

## ఎంపిలు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్

**అమరావతి, ఆగస్టు 6, ప్రభాతవార్త :** చట్టసభల్లో స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం ఓబిసి రిజర్వేషన్లు సాధించడమే తమ అంతిమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంపై అన్ని వైపుల నుండి ఒత్తిడి తెచ్చి సాధిస్తామని రాజ్యసభ సభ్యులు , బిసి జాతీయ నేతలు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులు అన్నారు.



విజయవాడలోని ఏపి కాన్ఫరెన్స్ భవన్లో బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఓబిసి జాతీయ సెమినార్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఓబిసి హక్కుల సాధనకు దేశవ్యాప్తంగా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మహోన్నత కార్యక్రమం ముందుకు తెచ్చారన్నారు. ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖకోసం కేంద్రంలో కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజాన్ సింగ్, రాష్ట్ర నేతలు ఉన్నవ సుబ్బారావు, చాటపర్తి పోసి బా గిద్ద నాయుడు పరుశురాం, సుధాకర్ సింగ్ ఉన్నారు.

# యుద్ధప్రాతిపదికన పద్మావతి కళాశాల విద్యార్థినుల సమస్యలు పరిష్కారం

## - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుపతి,ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి:** విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న తిరుమల తిరుపతిదేవస్థానం పరిధిలోని పద్మావతి మహిళ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. విద్యార్థినులకు హాస్టల్స్‌లో, గదుల్లో ప్రాథమిక అవసరాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అక్కడికక్కడే జెఇఒ వీరబ్రహ్మాంను ఆదేశించారు. విద్యార్థినులకు సౌకర్యంగా హాస్టల్స్ సామర్థ్యాన్ని పెంపొందించాలని, వసతి సౌకర్యం పెంచాలని, వైద్యసౌకర్యాలు కల్పించాలని ఆదేశాలిచ్చారు. వేడినీటికోసం సోలార్ వాటర్ హీటర్స్,ఇ-లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటుచేయాలని సూచించారు. పద్మావతి మహిళ జూనియర్ కళాశాల విద్యార్థినులు పలు సమస్యలను తనవరకు తీసుకువచ్చారని, ఆ సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి బుధవారం ఉదయం టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు పద్మావతి మహిళ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విద్యార్థినులతో పలకరించి వారినుండి సౌకర్యాలు కల్పనపై ఆరాతీశారు. టిటిడి విద్యాసంస్థల్లో విద్యార్థినులు చక్కగా చదువుకునే అవకాశం ఉందని, నాణ్యమైన విద్యాబోధన, హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. హాస్టల్స్‌లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం తదితర అంశాలపై ఆయన టిటిడి డిఇఒ వెంకటసునీల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి,ఎస్ఇ మనోహరంతో చర్చించారు. అధికారులు అభివృద్ధికి సంబంధించి నివేదిక తయారుచేసి కార్యాచరణ సిద్దంచేయాలని ఛైర్మన్ నాయుడు సూచించారు. విద్యార్థినులు చదువుకునేందుకు చక్కటి వాతావరణం, సౌకర్యాలు ఉండటం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా కళాశాలలో ఉత్తీర్ణతశాతం బావుందన్నారు.



# బెల్టు షాపు కోసం టిడిపి నేతల మధ్య ఘర్షణ

## - మారణాయుధాలతో పరస్పరం దాడికి యత్నం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 6 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి మండలం ఎల్లచింత గ్రామంలో బుధవారం బెల్ట్ షాప్ నిర్వహణపై తెలుగుదేశం నేతల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామస్తుల కథనం మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన వడ్డే తిమ్మప్ప గత సంవత్సర కాలంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన మరో టిడిపి నేత వీరారెడ్డి మరో బెల్ట్ షాపుని తెరవడంతో ఘర్షణకు కారణమైంది. ఈ నేపథ్యంలో ఇద్దరు టిడిపి నేతల మధ్య బెల్ట్ షాపు నిర్వహణపై మారణాయుధాలు కొడవళ్ళు,ఇనుప రాడ్లు తీసుకొని ఘర్షణకు దిగారు. బెల్ట్ షాపు కోసం గ్రామంలో టిడిపిలో రెండు వర్గాలు ఏర్పడినట్లు అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# సీమ మీదుగా సికింద్రాబాద్-మైసూర్ మధ్య బై వీక్లీ రైళ్లు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 6,ప్రభాతవార్త** రాయలసీమ మీదుగా సికింద్రాబాద్-మైసూర్-సికింద్రాబాద్‌ల మధ్య బై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులు నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్ నుంచి మైసూర్ వెళ్లేనెంబర్ 07033ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 8నుంచి 29వరకు ప్రతి సోమ,శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి రాత్రి 10.10గంటలకు బయలుదేరి మంగళ,శనివారాల్లో సాయంత్రం 4గంటలకు మైసూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మైసూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 07034ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 5.20గంటలకు మైసూరులో బయలుదేరి బుధ,ఆదివారాల్లో ఉదయం 11గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు మార్గమధ్యలో బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్,తాండూరు ,సేడం,యాద్గీర్,క్రిష్టా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని,గుంతకల్లు, అనంతపురం,ధర్మవరం, హిందూపురం, యలహంక,బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు సిటీ,కెన్‌గేరి,మాండ్య స్టేషన్లలో నిలుస్తాయి.

# కనిమొళిని కలిసిన మంత్రి సీతక్క, మేయర్ సుధారాణి

## ఇరు రాష్ట్రాల్లో అమలవుతున్న



## పథకాల అమలు పురోగతిపై చర్చ

**వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త :** డి ఎం కే కు చెందిన లోక్ సభ సభ్యురాలు కనిమొళిని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, గ్రేటర్ వరం గల్ మేయర్ గుండు సుధారాణి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ఇరు వురు నేతలు పంచుకున్నారు. అనం తరం కనిమొళి సీతక్కను తమిళ నాడు రావాలని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపట్ల సీతక్క ఏంపికి కృతజ్ఞ తలు తెలియజేశారు.

# విశాఖ రైల్వే జోన్ పిసిఇఇగా ఎపి శర్మ

## - ఆదేశాలు జారీ చేసిన రైల్వే బోర్డు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 6,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ విద్యుత్ విభాగం ప్రిన్సిపల్ సిఇఇగా ఏపి శర్మను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే బుధవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం నైరుతి రైల్వేజోన్‌లో పిసిఇఇగా(ప్లానింగ్)గా పనిచేస్తున్న శర్మ 1987వ బ్యాచ్‌కు చెందిన భారతీయ రైల్వే డైరెక్ట్ ఐఆర్ఎస్ అధికారి, రైల్వేలోని వివిధ డివిజన్‌లు, జోన్‌లలో ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చ జరగాలి

## కెసిఆర్ ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పాలి
## నత్తనడకన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు
## సిపిఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో/జడ్చర్ల,ఆగస్టు 6 ప్రభాత వార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ పిసి గోష్ కమిషన్ రిపోర్ట్‌పై బయట చర్చలు చేయడం కాదు అసెంబ్లీలో చర్చలు జరగాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సిపిఐ జిల్లా మహాసభల్లో చాడ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ. కాళేశ్వరంపై గోష్ కమిషన్ రిపోర్ట్ పై మంత్రి వర్గం సమావేశమై చర్చించి ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై తీర్మానం చర్చల్లో అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ తప్పనిసరిగా పాల్గొని వాస్తవాలను ప్రజలకు తెలపాలని అన్న మంత్రివర్గం ఆమోదం లేకుండా కాళేశ్వరం నిర్మాణం జరిగిందని కాళేశ్వరం కాదు కూలేశ్వరం అయిందా అని, కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్ అని బయట రకరకాల చర్చలు జరుగుతున్నాయని బయట చర్చలు కాదు, అసెంబ్లీలో చర్చలు చేస్తే ప్రజలు ఎవరు ఏంటి అనేది గుర్తిస్తారని అన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్ పై కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేస్తుంది ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వంకూడా ఈ అంశంపై నాన్చకుండా త్వరగా ఆమోదం తెలపాలన్నారు. సినీ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తు న్నామని మొండిగా వ్యవహరిస్తున్న నిర్మాతల మండలిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని ఆయన డిమాండ్‌చేశారు. సినీ కార్మికుల సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగృతా దివస్

## సైబర్ నేరాల కట్టడికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ వెల్లడి



బంజారాహిల్స్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో సైబర్ జాగృతా దివస్ కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి పాల్గొన్న పోలీసు అధికారులు.

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్ నేరాలను నివారించేందుకు, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగృతా దివస్ పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో గల పాఠశాలలు, కాలేజిలలో 577 సైబర్ అవగాహన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలలో వేలాది మంది విద్యార్థులతో పాటు విద్యావేత్తలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగిన నిపుణులు పాల్గొన్ని సైబర్ నేరాలను ఎలా నివారించాలనే దానిపై చర్చాగోష్టి నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో పాటు ప్రతీ పోలీసు యూనిట్ తమ పరిధిలోని విద్యా సంస్థలతో కలిపి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఐటెంటిటి థెఫ్ట్, లోన్ మోసాలు, ప్రకటనల మోసాలు, ఆన్‌లైన్ భద్రతా మోసాలకు సంబంధించి వాటిపై నిపుణులు విపులంగా వివరించారు. దీంతో పాటు విద్యార్థులకు సైబర్ సేఫ్టీ క్విజ్‌లు, సైబర్ క్రైం అంశాలపై చిన్నపాటి నాటకాలు, రెండు నిమిషాల అవగాహన రీల్స్, పోస్టల్ మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించి వీటిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ తరహా కార్యక్రమాల వల్ల రేపటి పౌరులైన విద్యార్థుల్లో సైబర్ నేరాలపై మరింత అవగాహన కలుగుతుందని, దీంతో పాటు నేరాల నివారణకు ఎలా వ్యవహరించాలనే దానిపై వారికి మంచి ఆలోచన వస్తుందని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాల్లో జిల్లా పోలీసు అధికారుల, ఎస్ హెచ్‌ఓలు గెస్ట్ స్పీకర్లుగా వ్యవహరించడంతో పాటు జడ్జిలుగా వుండి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గెలిచిన పోస్టర్లు, నినాదాలు, ముఖ్యమైన సైబర్ భద్రతా సందేశాలు విద్యాసంస్థల సైబర్ ఫ్రీ వాల్ లో ప్రదర్శించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కాగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సైబర్ జాగృతా దివస్‌ను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో షేర్ చేయనున్నారు. కాగా రాష్ట్రంలో ఒకేరోజు సైబర్ నేరాల నివారణకు సంబంధించి 577 కార్యక్రమాలు జరగడం ఇదే తొలిసారిగా టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు దోహదం చేస్తుందని ఆమె తెలిపారు.

# నటుడు విజయ్ దేవరకొండను నాలుగు గంటలు ప్రశ్నించిన ఇడి

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌కు సంబంధించి దక్షిణాది సినీతారలను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారించడం కొనసాగుతూనే వుంది. గత నెల 30వ తేదీన ప్రకాష్ రాజ్‌ను ఐదు గంటల పాటు విచారించిన హైదరాబాద్ ఈడీ విభాగం అధికారులు బుధవారం విజయ్ దేవరకొండను నాలుగున్నర గంట లపాటు విచారించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ తన బ్యాంకుల లావాదేవీలను, తాను ఏ యాప్‌తో ఒప్పందం కుదుర్చు కున్నానో? దాని వివరాలు, ఆ సంస్థ నుంచి తీసుకున్న నగదు వివరాలను ఈడీ అధికారులకు అందజేశారు. కాగా విచారణ అనంతరం విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లో తన పేరు రావడంతో విచారణకు హాజరైనట్లు తెలిపారు. అయితే భారత్‌లో బెట్టింగ్ యాప్ ఒక్కటే లేదని గేమింగ్ యాప్ కూడా వుందని ఆయన తెలిపారు. తాను బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేయ లేదని, ఎ23అనే గేమింగ్ యాప్ కోసం పనిచేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండుయాప్‌లకు ఒకదానితో మరొకదానికి సంబంధంలేదని ఆయన తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో గేమింగ్ యాప్స్‌కు చట్టబద్ధత వుందని, ఈ యాప్స్ నుంచి జీఎస్‌టితో పాటు ఆయా రాష్ట్రాలు స్థానిక పన్నులను కూడా వసూలు చేస్తున్నారని, వీటికి ఆయా రాష్ట్రాలు రిజిస్ట్రేషన్ లైసెన్స్ ఇస్తున్నా యని విజయ్ దేవరకొండ తెలిపారు. కాగా ఇదే కేసులో రానాతో పాటు మంచు లక్ష్మీలను కూడా ఈడీ అధికారులు విచారించనున్నారు.

# నేడు గోవాలో జాతీయ ఓబిసి మహాసభ

## హాజరుకానున్న గోవా,మహారాష్ట్ర సిఎంలు: జాజుల వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త:** గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం పదవ జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా గోవా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మహారాష్ట్ర పిసిసి అధ్యక్షులు నాన్న పటేలే,మాజీమంత్రి,ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తోపాటు దేశంలోని అఖిల పక్ష పార్టీల నాయకులు, దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక ఉద్యమకారులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ నుండి వెయ్యి మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

# గొలుసు చోరీ కేసులో నేరగాడి అరెస్టు

## నిందితుడిపై 26 క్రిమినల్ కేసులున్నట్లు వెల్లడించిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో విఐపి జోన్‌లో కాంగ్రెస్ ఎంపి ఆర్.సుధ గత సోమవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని రెప్పపాటులో ఉడాయించిన నేరగాడిని పోలీసులు అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఎంపి మెడలో గొలుసును స్నాచింగ్‌కు పాల్పడ్డ నేరగాడిని సోహన్ రావత్ (24)గా గుర్తించారు. నిందితుడు దక్షిణ, తూర్పు ఢిల్లీలోని ఒక్లాకు చెందిన వాడుగా తేలింది. ఢిల్లీలోని చెక్ రిపబ్లిక్ కార్యాలయం సమీ పంలో గల చాణక్యపూరి వద్ద ఫుల్‌ఫేస్ హెల్మెట్ ధరించి స్కూటర్‌పై వచ్చిన రావత్ స్నాచింగ్‌కు పాల్పడగా

ఈ సందర్భంగా ఎంపి సుధ మెడకు గాయం అయ్యింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి రంగంలో దిగిన ఢిల్లీ పోలీసులు, సౌత్ ఢిల్లీ పోలీసులు నేరగాడిని పట్టుకునేందుకు సంయుక్తంగా ఆపరేషన్ చేబట్టారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
26
గురువారం 7, ఆగస్టు 2025




# పెన్షనర్ల సమస్యలపై కేంద్ర మంత్రితో ఎంపీ శ్రీభరత్ భేటీ

## విశాఖలో మార్షల్ ఆర్ట్స్ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 6, ప్రభాతవార్త

ఈపీఎస్-95 పెన్షనర్ల సమస్యలపై కేంద్ర మంత్రి మాన్సుఖ్ మాండవ్యాతో ఎంపీ శ్రీభరత్ ఢిల్లీలో భేటీ అయ్యారు. పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను తెలియజేయడానికి కేంద్రానికి ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ కేంద్ర మంత్రి మనసుఖ్ మాండవ్యాని కలిశారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారుల సమస్యలను ఆయనకు నివేదించారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగాల నుంచి పదవీ విరమణ చేసిన వేల మంది ఉద్యోగులు తక్కువ పెన్షన్‌తో జీవితాన్ని కొనసాగిస్తున్నారని 8వ పేజీలో

# రాష్ట్రానికే ఆదర్శంగా ల్యాండ్ పూలింగ్


## రామవరం, జీఎస్ అగ్రహారం యాజమాన్య హక్కుల పట్టాల పంపిణీలో గంటా




# సిపిఎం నాయకులు లోకనాథం అరెస్ట్.. అడ్డుకున్న మత్స్యకారులు..!




# జీవీఎంసీలో 10 మంది స్థాయి సంఘం సభ్యుల ఎన్నిక



వాడి వేడిగా జరిగిన ఎలక్షన్
-వైసీపీని వీడిన ఐదుగురు కార్పొరేటర్లు గైర్హాజర్
-ముందే ప్రకటించిన విధంగా జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఓటింగ్ దూరం -బెహరా భాస్కర్ కుటుంబం నుండి ఇద్దరు, సిపిఎం నుండి ఒకరు, జనసేన నుండి ఒకరు, మాజీ మంత్రి కుమార్తె ముత్తంశెట్టి ప్రియాంక ఓటింగ్‌లో పాల్గొలేదు -రౌతు శ్రీనివాస్ (టీడీపీ)పై వైసీపీ సాడి పద్మారెడ్డి గెలుపు

8లో

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 6, ప్రభాతవార్త

దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు పరిధిలో 1కోటి 10లక్షల జీవీఎంసీ నిధులతో ఎంవీడీఎం స్కూలు వద్ద పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. 39వార్డ్ పరిధిలో ఏరియాలో 15.83లక్షల నిధులతో ఎం.వి.డి. ఎం.స్కూల్ మరమ్మతులు, 39వార్డ్ పరిధిలో పెర్రీ రోడ్డు ఏరియా నందు 17.45లక్షల నిధులతో ఫెర్రీ రోడ్డు, అంతర్గత రోడ్లు, అదే వార్డ్ పరిధిలో గానుగల వీధిలో 9.97లక్షల నిధులతో సి.సి. రోడ్లు నిర్మాణం, అదే వార్డ్ పరిధిలో పొట్టి శ్రీరాములు వ్యాయామశాలను అభివృద్ధి చేయుటకు19.38లక్షల నిధులు, 39వార్డ్ పరిధిలో వుడ్ యార్డ్ స్ట్రీట్, రాజావారి వీధి, రాణి పార్క్, చిలకపేట, ద్రోణం రాజు వీధులలో తారు రోడ్ల నిర్మాణం కొరకు 38.40లక్షల నిధులకు సంబంధించి శంఖుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మేజర్ రోడ్లు అతి తక్కువ కాలంలోనే పూర్తి చేసామని అన్నారు. కలెక్టర్ ఆఫీస్ నుంచి ఏవీన్ కాలేజీ వరకు రోడ్డు పూర్తి చేశామని, మోడల్ నియోజకవర్గంగా దక్షిణ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. కూటమిపాలన సంక్షేమ పాలన, ప్రజా పాలన, నిరంతర అభివృద్ధితో కూడిన 8వ పేజీలో

# కోర్టుకు హాజరైన వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్




# సృష్టి కేసులో తవ్వే కొద్ది బయటకొస్తున్న అక్రమాలు

## పిల్లల్ని అమ్మే ముఠాలతో లింకులు -పేదరికంలో ఉన్న భార్యాభర్తలే డా.నమ్రత టార్గెట్ -ప్రముఖ గైనకాలజిస్ట్ లెటర్ హెడ్లు వాడిన నమ్రత

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలన సృష్టించి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో నువ్వే కొద్ది అక్రమాలు బయటికి వస్తూనే ఉన్నాయి. సృష్టి ఫెర్టిలిటీ డాక్టర్ నమ్రత కస్టడీకి సంబంధించి పోలీసులు సంచలన విషయాలు బయటపెట్టారు.సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. సరోగసి పేరిట మోసాలకు పాల్పడుతున్న ఈ కేసులో ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారంతో డాక్టర్ నమ్రత కస్టడీ విచారణ ముగిసింది. డాక్టర్ నమ్రత చెప్పిన వివరాలను పోలీసులు రికార్డు చేశారు. ఐదు రోజుల పాటు విచారించిన పోలీసులు.. ఆమె నుంచి విషయాలను రాబట్టారు. డా.నమ్రత పేదరికంలో మగ్గుతున్న భార్యాభర్తలకు డబ్బులిచ్చి బిడ్డల్ని కొంటున్నట్లుగా పోలీసులు గుర్తించారు. కొన్న బిడ్డలను సరోగసి ద్వారా పుట్టారంటూ.. ఫెర్టిలిటీ సెంటరు వచ్చే దంపతులకు అప్పగించేది. సృష్టి కేసులో అరెస్ట్ అయిన వారిలో ల్యాబ్ టెక్నిషియన్, డాక్టర్లు, ఏఎన్ఎమ్, ఏజెంట్స్ ఉన్నారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు.. ఇలా దంపతులకు డాక్టర్ నమ్రత సరోగసి ఎర వేసింది. గ్రామీణ 8వ పేజీలో



# మా ప్రాణాలు తీసుకోండి.. కంపెనీలు వద్దు

## నిరసనలు, నినాదాలతో హోరెత్తిన ప్రజాభిప్రాయ సేకరణ.. కంపెనీల వివరాలను తెలియజేసిన అధికారులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

ఏపీఐఐసీ భూసేకరణలో భాగంగా బల్క్ డ్రగ్స్ పార్కు ఆధారంగా అవసరమైన భూసేకరణకు సంబంధించి బుధవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణ తోపులాటలు, నినాదాలు, నిరసనల మధ్య సాగింది. ముందుగా విపక్ష నేతలను ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్ పి పోతిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైకాపా రాష్ట్ర నేత వీసం రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే. లోకనాథం, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శ వర్గ సభ్యులు సభ్యులు ఎం. అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్‌లను వారు ఎక్కడెక్కడ ఉన్నారో నిర్బంధించడమే కాకుండా అరెస్ట్ చేసి పాయకరావు పేట పోలీస్ స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలించారు . ప్రతిష్టాత్మంగా ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు భూసేకరణ చేస్తున్న గ్రామాలకు సంబంధించిన ప్రజలు, కుటుంబాల సైతం సభ వేదికకు చేరుకున్న ప్రయత్నం చేశారు. సీఐలు కుమార్ స్వామి, రామకృష్ణ, అప్పన్నలు కలిసి సభ వేదిక వస్తున్నవారికి తనిఖీలు నిర్వహించి లోపలికి పంపించారు. ఆర్డిఓ వివి రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పీవీ ముకుందరావు పీవీ సుదర్శన్ రావు, ఏపీఐఐసీ జడ్ ఎం నరసింహారావు, తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తిలు కలిసి బల్క్ డ్రగ్స్ పార్క్ కోసం చేస్తున్న భూసేకరణ కంపెనీకి సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు చదివి వినిపించారు. కాలుష్య నియంత్రణని మండలి అధికారులు బల్క్ డ్రగ్స్ పార్క్ వల్ల ఎటువంటి కాలుష్యం ఉండదని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని, ప్రత్యక్షంగా 15000 మందికి, పరోక్షంగా మరో 25 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్రజలంతా సహకరించాలని కోరారు. ఆ సందర్భంలో గుర్రాజుపేట గ్రామానికి చెందిన ఉమాదేవి తీవ్ర అభ్యంతరం తెలుపుతూ బల్క్ డ్రగ్స్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నామని, భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ముక్తకంఠంతో చెప్పారు. ఆ సమయంలో అధికారులు మీ అభిప్రాయాలు తెలుసుకోవడానికి.. తెలుసుకున్న అభిప్రాయాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిదీ మినిట్స్ లో రాసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆర్డిఓ వీవి 8వ పేజీలో




# తగ్గేదేలే..! కాయ్ రాణి కాయ్

మగవాళ్లకు ధీటుగా మహిళలు ఎందులోనూ తగ్గేదేలే అంటున్నారు. మేమెందులో తక్కువ అన్నట్లుగా పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళా మణులు.. ఇప్పుడు పేకాట ఆడుతూ టాస్క్ ఫోర్స్ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. పేకాట ఆడుతున్న ఏడుగురు ఆడవాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశాఖ నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లలితానగర్‌లో ఈ షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.

# కోర్టుకు హాజరైన వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్

విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 6, ప్రభాతవార్త

వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయంలో అక్రమ కేసు నమోదు చేసిన నేపథ్యంలో వీఎంఆర్డీయే చైర్మన్ ఎం.వి .ప్రణవ్ గోపాల్ బుధవారం విశాఖ జిల్లా కోర్ట్ కు వ్యక్తిగతంగా హాజరయ్యారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో ఋషికొండ ప్యాలెస్ నిర్మాణంపై నాడు టీడీపీ ఛలో రుషికొండ అనే కార్యక్రమం పేరిట పిలుపు ఇవ్వటంతో పోలీసులు నాటి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి, దాదాపుగా అందరినీ గృహ నిర్బంధం చేశారు. కొంత మందిని పార్టీ కార్యాలయం నుంచి బయటకు రాకుండా చేశారు. ఐతే టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ఎంవి ప్రణవ్ గోపాల్ పోలీసులు నిలువరించినా రుషికొండ చేరుకొని నిరసన తెలిపారు. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా కోర్ట్‌కు చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేశ్‌లు హాజరు కాగా, టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు శోభన్ బాబు, సారధి తదితరులు వాదనలు వినిపించారు. ఈ నెల 13న తుది తీర్పు ఇవ్వనున్నట్లు సమాచారం.

# పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

7వ తరువాయి ..

పాలనని అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో దాదాపుగా అన్ని రోడ్లు పూర్తి చేశామని, దాదాపు 90% రోడ్ల నిర్మాణం పూర్తయిందని మిగిలిన 10 శాతం రోడ్లను రెండు, మూడు నెలలులో పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పాలనలో రోడ్లు, డ్రైన్‌లు అభివృద్ధి జరగలేదని, అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలో నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని వార్డుల్లో జీవీఎంసీ కమిషనర్ తో పాటు సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి కూటమి శ్రేణులు కొల్లి సింహాచలం, తాతారావు, దానిష్, రాజు వివిధ హోదాల్లో ఉన్న టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు, జీవీఎంసీ ఈఈ, ఏఈ షమీమ్, వార్డు కూటమి పార్టీల ఇంచార్జి వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీలో 10 మంది..

విశాఖపట్నం ఆగస్టు 6 ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఎదురులేదు అనుకొనే కూటమికి కొంతమేర కంగుతినే పరిస్థితి ఏర్పడింది. జీవీఎంసీ కార్పొరేటర్లలో 5 మంది గైడ్ హాజరు కాగా, మరి కొంతమంది కార్పొరేటర్లు గుడ్డు చప్పుడు కాకుండా క్రాస్ ఓటింగ్ చేశారు. దీంతో కూటమి ఒక సీటును ఓడిపోగా వైసిపి ఒకటి విజయం సాధించింది. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఆనందోత్సవాలు వెలువత్తాయి. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలలో 10 మంది సభ్యులు ఎన్నికైనట్లు బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. తదుపరి మధ్యాహ్నం భోజన విరామం తర్వాత ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను జీవీఎంసీ కమిషనర్ వెల్లడించారు. ఈ స్థాయి సంఘం ఎన్నికల్లో 20 మంది సభ్యులు పోటీలో పాల్గొనగా ,92 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు . ఈ పోటీలలో 10 మంది స్థాయి సంఘం సభ్యులుగా ఎన్నికైనట్లు కమిషనర్ తెలిపారు. నీలిమ కొణతాల 58 ఓట్లు, గంకల కవిత 57 ఓట్లు, దాడి వెంకట రామేశ్వరరావు 57 ఓట్లు, మొల్లి హేమలత 57 ఓట్లు, సేనాపతి వసంత 54 ఓట్లు, గేదెల (బంటుబిల్లి) లావణ్య 53 ఓట్లు, మాదంశెట్టి చినతల్లి 52 ఓట్లు, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు 52 ఓట్లు , మొల్లి ముత్యాలు 51 ఓట్లు, సాడి పద్మావతి (పద్మా రెడ్డి)లకు 50 ఓట్లు పోలైనట్లు కమిషనర్ తెలిపారు . ఎన్నికలు ఫలితాలను వెల్లడించి ఎన్నికల్లో గెలుపొందిన వారికి కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు ఎన్నికల్లో గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వైసీపీని వీడిన కార్పొరేటర్లు గైడ్హాజర్...

వైసిపి వీడిన కార్పొరేటర్లు గైడ్ హాజరు కావడం కొసమెరుపుగా మారింది. వైసిపి నుండి బెహరా భాస్కరరావు కుటుంబం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు స్వర్ణలత, బెహరా జ్యోత్స్న తోపాటు మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ కుమార్తె ప్రియాంక కూడా గైరాజరయ్యారు. జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ముందే ప్రకటించిన విధంగా ఎన్నికలకు దూరంగా ఉన్నారు. సిపిఎం పార్టీ గంగారావు కూడా ఓటింగ్ లో పాల్గొనలేదు. దీంతో 92 మంది హాజరయ్యారు.

# పెన్షనర్ల సమస్యలపై కేంద్ర మంత్రితో ఎంపీ శ్రీభరత్ భేటీ

7వ తరువాయి ..

ఆయన పేర్కొన్నారు. పెన్షన్ మొత్తం పెంపు, చెల్లింపుల వేగవంతం అంశాలను మంత్రికి వివరించి, పెన్షనర్ల గౌరవమైన జీవితం కోసం కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ నిర్ణయంపై కేంద్రం త్వరలో కీలక ప్రకటన చేస్తుందన్న హామీ ఇచ్చారు. అదనంగా, రాబోయే ఖేలో ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నేపథ్యంలో, విశాఖపట్నంలో మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు కోసం అధికారికంగా ప్రతిపాదనను సమర్పించినట్లు శ్రీభరత్ తెలిపారు. ఈ సెంటర్ ద్వారా యువ అథ్లెట్లకు అత్యాధునిక శిక్షణా సదుపాయాలు లభించనున్నాయి. ఈ మార్గంలో విశాఖను క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు.

# రాష్ట్రానికే ఆదర్శంగా ల్యాండ్ పూలింగ్

విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్టు 6, ప్రభాతవార్త

రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా రామవరం, జీవన్ అగ్రహారం గ్రామాల ల్యాండ్ పూలింగ్ చేశామని, భూమి స్వాధీనంలో ఉన్న రైతులు ఆనందించేలా యాజమాన్య హక్కు పట్టాలు అందిస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం రామవరం, జీవన్ అగ్రహారంలో లబ్ధిదారులకు ఎల్.పి.ఓ.సి.లను అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వ ఇళ్ల పట్టాల అవసరాలకు మండలంలో 2 వేల నుంచి 3 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటున్నారు. భూమి అనేది భావోద్వేగంతో ముడిపడిన అంశమని, ఎజిఆర్ హౌసింగ్ కోసం రామవరం, జీవన్ అగ్రహారంలో పెద్దఎత్తున భూమి ఇచ్చి ల్యాండ్ పూలింగ్ కోసం మొత్తం 230 ఎకరాల భూమిలివ్వడమనేది ప్రశంసనీయమన్నారు. వి.ఎం.ఆర్.డి.ఎ. లే అవుట్ వల్ల చుట్టు పక్కల భూముల ధరలు బాగా పెరుగుతాయని తెలిపారు. వైసీపీ హయాంలో తంగుడుబిల్లిలో 700 ఎకరాల్లో తాగునీరు.. రోడ్లు.. కరెంట్.. హాస్పిటల్.. డ్రైనేజ్.. వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండా, సెంటు భూముల్లో పిచ్చుక గూళ్ల లాంటి ఇళ్లు నిర్మించారని విమర్శించారు. విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ వంటి అనేక ఐటీ పరిశ్రమలు రానున్నాయని, రాబోయే కాలంలో 200 ఎకరాల్లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందని వివరించారు. ఒక వైపు బీచ్, మరో వైపు నేషనల్ హైవే ఉన్నందున భీమిలి పరిసరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఎంవీపీ కాలనీ, సాగర్ నగర్ వంటి రెసిడెన్షియల్ శాటిలైట్ టౌన్ షిప్ లు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గం పరిధిలోని 7 ఇనాం గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న వారికి కూడా పరిహారం ఇచ్చేలా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ కె.సంగీత్ మాథుర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల నాగ సందీప్, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, కూటమి నాయకులు సుభాష్ చంద్రబోస్, కె. రామస్వామి నాయుడు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గంట్రెడ్డి సోమినాయుడు, పాండ్రంగి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, బలిరెడ్డి మల్లికార్జునరావు, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన పాలవలస ఎంపీటీసీ శ్యామల

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల, ఉప సర్పంచ్ చందక ఎల్లారావు, వార్డు సభ్యురాలు నిమ్మల లక్ష్మీ, రౌతు వెంకట్రావు, కంచుబోయిన తమ్మినాయుడు, రౌతు పెద వెంకట్రావు, పేడా శంకర్రావు, మామిడి ఉదయ్ శంకర్, రౌతు రమణ, మదపాడ శ్రీను, ఈగల అప్పలనాయుడు, ముద్దాడ సన్యాసిరావు, కరకాన సత్తిబాబు, అలమండ రమణ తదితరులు టీడీపీ జెండా కప్పుకున్నారు.

# సృష్టి కేసులో తవ్వే కొద్ది బయటకొస్తున్న అక్రమాలు

7వ తరువాయి ..

ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి.. డెలివరీకి ఉన్న వారి ఆర్థిక స్థోమతలు చూసి ఎర వేసినట్లు దర్యాప్తులో తేలింది. చైల్డ్ ట్రాఫికింగ్ అంశాలపై గోపాలపురం పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోంది.

## పిల్లల్ని అమ్మే గ్యాంగులతో లింకులు

పిల్లలను ఆమ్మే పలు గ్యాంగులతో డాక్టర్ నమ్రతకు లింకులు ఉన్నట్లు పోలీసులు విచారణలో తేల్చారు. మహారాష్ట్ర,అహ్మదాబాద్, ఏపీకి చెందిన పలు పిల్లలను దొంగిలించే గ్యాంగులతో నమ్రతకు సంబంధాలు ఉన్నాయి. 3-5 లక్షలు ఇచ్చి గ్యాంగుల నుంచి పిల్లల్ని కొనుగోలు చేసేదని తేలింది.ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగసి వైపు మళ్లించి..భారీగా అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైంది. తాజాగా ఐదుగురు బాధితులను సరోగసి పేరుతో మోసం చేసి.. వారి నుంచి పెద్ద మొత్తంలో డాక్టర్ నమ్రత డబ్బు వసూలు చేశారని స్పష్టం అయింది. సరోగసి పేరుతో బాధితుల నుంచి ఇటీవల 44 లక్షలు, 18 లక్షలు, 25 లక్షలు, 50 లక్షలు వసూల్ చేసినట్లు తెలుస్తోంది.

## ప్రముఖ గైనకాలజిస్ట్ లెటర్ హెడ్లు వాడిన నమ్రత

సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ లెటర్హెడ్లను వాడి నమ్రత పలువురికి ఇంజక్షన్లు, మందులు ఇచ్చినట్లు వెల్లడైంది. తన పేరుతో ఉన్న లెటర్ హెడ్ చూసి గైనకాలజిస్ట్ ఆశ్చర్యానికి గురయ్యారు. నమ్రతపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.

# మా ప్రాణాలు తీసుకోండి.. కంపెనీలు వద్దు

7వ తరువాయి ..

రమణతోపాటు డిప్యూటీ కలెక్టర్ అనిత చెప్పారు. ఆందోళనకారులు ఫ్లెక్సీలు పట్టుకొని లోపలి ప్రవేశించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ కోనసీమ లాంటి ఈ ప్రాంతాన్ని పొల్యూషన్ తో నింపేందుకు ప్రయత్నించడం సరైనది కాదని, పరిశ్రమల పేరు మీద ఉద్యోగాలు అంటారు ఇవ్వకుండా సమయం వచ్చేటప్పుడు చేతులెత్తేస్తారని, ఇంకా సమస్యలు కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. దీన్నివ్యతిరేకిస్తున్నామని జోగులతో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీరం నరసింహమూర్తి, నాయకులు గొర్ల బాబురావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం శంకర్ తోపాటు మత్స్యకార నాయకులు రాజు, మహాదేవ, రాంబిల్లి ప్రాంతం నుండి వచ్చిన పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ పరిశ్రమల వలన పూర్తిగా నష్టపోతామని, ప్రాణాలైనా ఇస్తాం గానీ పరిశ్రమ నెలకొల్పుడానికి వీలులేదని, ప్రజాభిప్రాయ శాఖను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిశ్రమకు బీజం వేసిందని రైతులకు సరైన ధర లేకపోవడం గుర్తించి 2014లో కార్యరూపం దాల్చి 18 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని చెప్పడంతో కొంతసేపు సభలో గందరగోళం నెలకొంది. ఒక నొక పరిస్థితిలో అధికార పార్టీకి చెందిన నాయకులు పిక్కి కోదండరావ్, శివాజీ లపై రాజయ్యపేట గ్రామానికి చెందిన కొంతమంది దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం యువత పూర్తిగా నష్టపోతున్నారని, ప్రజలు అభిప్రాయం మేరకు వారికి నష్టం కలిగించకుండా వచ్చే కంపెనీలో ఏదైతే నిబంధనలు ఉన్నాయో ఆ నిబంధనల మేరకు 75 శాతం ఉద్యోగాలు వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తాదని, ప్రజల అభిప్రాయాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో శాంతించారు. కంపెనీ వద్దు భూములు ఇచ్చేది లేదంటూ నినాదాలు చేశారు. రాజయ్యపేట, పెద్ద తీనార్ల, గుడివాడ ,ఉపమాక్క, సిహెచ్ఎల్ పురం, ఎం. నర్సాపురం గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ కూలీలు ఆందోళన దిగి కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గం లో ఇంత పెద్ద మొత్తంలో పోలీసులు మోహరించి ప్రజల అభిప్రాయాలు కూడా చెప్పుకునే అవకాశం లేకుండా చేయడం దారుణమని, ఇదేనా ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన గౌరవం.. ఇదేనా అంటూ పలువురు మత్స్యకారులు ,ఆ ప్రాంతపు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ఎటువంటి సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్, నక్కపల్లి, అడ్డరోడ్డు, పాయకరావుపేట, ఎలమంచిలి సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితులను చక్కబడేటట్లు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో అధికారులు మాట్లాడుతుండగా మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ తోపాటు సీరం నరసింహమూర్తి, గొర్ల బాబురావు, మత్స్యకారులు ఏర్పాటు చేసిన బారికేడ్లు ఎక్కి నిరసన తెలపాలని ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొని ప్రయత్నం చేసేటప్పుడు కొంతసేపు తోపులాట చోటు చేసుకుంది. అరుపులు, కేకలు, తోపులాట్లు మధ్య జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఆర్డీవో వివి రమణ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ లో ఎవరెవరు మాట్లాడారు ప్రతిదీ రికార్డు చేసామని, చేసిన రికార్డును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణకు ఆ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు తో పాటు కూటమి నాయకులు లాలం కాసినాయుడు, కురం దాసు నూకరాజు, గోసల చిన్నతాతరావు, మెరుగు నాగేశ్వరరావు, వెలగ శ్రీనివాసరావు లతోపాటు వ్యవసాయం కూలీలు, రైతులు హాజరయ్యారు.

# సిపిఎం నాయకులు లోకనాథం అరెస్ట్..

(నక్కపల్లి, ప్రభాతవార్త)

ఏపీఐఐసీ బల్క్ డ్రగ్స్ పార్క్ కోసం నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నది ప్రయత్నించిన సిపిఎం జాతీయ నాయకులు కె.లోకనాథంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజలకు నష్టం కలిగించే ఇటువంటి బల్క్ డ్రగ్స్ పార్కులు నెలకొల్పడానికి వీలు లేదు అంటూ ప్రాణాలు పోయినా అడ్డుకుంటామని పెద్ద ఎత్తున లోకనాథం సభలో నినాదాలు చేయగా గమనించిన పోలీసులు అరెస్ట్ అరెస్ట్ చేసి ప్రత్యేక వ్యాన్‌లో తరలించారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరు చెప్పి అత్యంత పాశవికంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ ప్రజాభిప్రాయసేకరణను వెంటనే రద్దు చేయాలి డిమాండ్ చేశారు. లోకనాథ్ అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న మత్స్యకారులు ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన మహిళలు పెద్ద ఎత్తున అడ్డుకున్న ప్రయత్నం చేశారు. ఒకానొక సందర్భంలో వాహనానికి అడ్డుగా నిల్చున్నారు. పోలీసులు పక్కకు తప్పించి లోకనాథంను స్టేషన్ కు తీసుకువెళ్లారు. మండల కార్యాలయం ఆవరణలో తలపెట్టిన బల్క్ డ్రగ్ ప్రజాభిప్రాయసేకరణకు సిపిఎం నాయకులు, గ్రామస్తులను వెళ్ళనివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మండిపడ్డారు . సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను ముందు రోజు నుంచి గృహనిర్బంధంలో ఉంచడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కోటేశ్వరరావు, అప్పలరాజులను పోలీసులు కారుల్లో ఎక్కించి ఎక్కడెక్కడో తిప్పడం అదే కాకుండా విచక్షణ రీతిగా జాతీయ కమిటీ సభ్యులు ఈ లోకనాథ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును దారుణం అని దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వెళ్ళిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంను పోలీసులు అత్యంత పాశవింకంగా ఈడ్చుకుంటు తీసుకెళ్ళి వ్యానులో పడేసి అరెస్టు చేయడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజలు, ప్రజా సంఘాలు, పార్టీ అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం, ప్రజాభిప్రాయసేకరణ వేదిక వద్దకు ప్రజలను రాకుండా అడ్డుకోవడం హేయమైన చర్య. దీనిని ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాతంత్రవాదులు ఖండించాలని సిపిఎం తెలియజేస్తుంది అన్నారు. నక్కపల్లి మండలం, పెదతీనార్ల, సిహెచ్ఎల్ పురం, ఉపమాక, రాజయ్యపేట, నర్సాపురం, ఎస్.రాయవరం మండలం గుడివాడలో 1270.80 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు అభివృద్ధికి ఈ రోజు నిర్వహించే పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణపై సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలను కాదని ప్రజా ప్రయోజనం పేరుతో ప్రయివేటు వ్యక్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేందుకు బలవంతపు భూ సేకరణ ప్రభుత్వం చేపట్టిందన్నారు.ప్రజల ఆరోగ్యాలు, బతుకులపై ప్రభావం చూపే బల్క్ డ్రగ్ పార్కు ఆలోచనను విరమించుకొని ప్రతిపాదిత బల్క్ డ్రగ్ పార్కు పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. బల్క్ డ్రగ్ పార్కు పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణకు సంబంధించిన ఇఐఎ నివేదికలో ప్రజలను నమ్మించి మోసగించడానికి అబద్ధాలు పొందుపర్చారు. బల్క్ డ్రగ్ పార్కులో వచ్చే ఫార్మా పరిశ్రమల్లో రసాయన ప్రక్రియలలో వచ్చే వాయువులను సేకరించి ఉమ్మడి పొగ గొట్టం ద్వారా బయటకు వదలనున్నట్లు ఇఐఎ నివేదికలో పేర్కొన్నారు. వాస్తవానికి వెలువడుతున్న ద్రావకాలను చల్లబర్చి ధృవీకరించి సేకరిస్తారు గానీ గొట్టం ద్వారా పంపరు. కానీ ఇఐఎ నివేదిలో గొట్టం ద్వారా బయటకు వదలనున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చారు. ఇలా అనేక వాస్తవ విరుద్ధ అంశాలను నివేదికలో పొందుపర్చారు. ప్రజల అభివృద్ధి కోసమైతే తప్పుడు సమాచారం ఇఐఎ నివేదికలో ఇవ్వాల్సిన అవసరంలేదని భావిస్తున్నాం అన్నారు. విశ్వసనీయతలేని, మోసపూరిత అంశాలు అనేకం ఇఐఎ నివేదికలో వున్నాయి. కనీస చట్టబద్ధ ప్రమాణాలు, నియమాలు పాటించకుండా అసత్యాలతో రూపొందించిన ఇఐఎ నివేదిను, ప్రజాభిప్రాయసేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయసేకరణలో నిర్వాసితులు, స్థానిక ప్రజలు తమ అభ్యంతరాలు చెప్పంకుండా తూతుమంత్రంగా నిర్వహించిన ఈ ప్రజాభిప్రాయసేకరణను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది.

# తగ్గేదేలే..!

## మహిళల్లో పెరుగుతున్న పేకాట సంస్కృతి -గ్రూపులుగా మారి పేకాడుతున్న వైనం -ఫోర్త్ టౌన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి -పోలీసుల అదుపులో ఏడుగురు మహిళలు -రూ.22 వేలు నగదు స్వాధీనం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ నగరంలో పేకాట రాయుళ్లే కాదు... పేకాట రాణులు కూడా తయారయ్యారు. జట్లు జట్లుగా ఏర్పడి చతుర్ముఖ పారాయణంతో కాలక్షేపం చేస్తున్నారు.తగ్గేదేలే అంటూ పేకాట క్వీన్స్ సిట్టింగ్ వేశారు. ఫోర్త్ టౌన్ పరిధిలోని లలితానగర్ లోనీ ఓ ఇంటిని అడ్డాగా చేసుకునీ ఎంచక్కా పేకాట ఆడుతున్నారు.. పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్సు సిఐలు భాస్కరరావు, అప్పలనాయుడు ల ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్ఐ భరత్ కుమార్ రాజు తన బృందంతో కలిసి రంగంలోకి దిగి బుధవారం రాత్రి పేకాట స్థావరం పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.. వారి వద్ద నుండి రూ.22 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.. తదుపరి విచారణ నిమిత్తం వారిని నాలుగవ పట్టణ పోలీసులకు అప్పగించారు..

# ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన చెక్కు అందజేత




మాధవధార , ఆగస్టు 06, ప్రభాతవార్త

జీవీఎంసీ 50 వార్డు సత్యా నగర్‌లో నివాస ఉంటున్న బొమ్మిడి మల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల మరణించారు. అయితే అతను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద 436 రూపాయలు చెల్లించి ఉన్నారు. ఈ విషయంలో అతని భార్య బమ్మిడి ఉదయ కుమారి ఇటీవల సత్యా నగర్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అర్థిక అక్షరాస్యత కేంద్రం గోపాలపట్నం వారికి తెలియపరిచారు. వెంటనే వారు అతని యొక్క బ్యాంక్ స్టేట్మెంట్ ద్వారా బిర్లా జంక్షన్ ఎస్‌బిఐ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన లో చేరినట్లు గుర్తించి బుధవారం ఆమెకు ఎస్‌బిఐ మేనేజర్ సంతోష్ నాయుడు చేతుల మీదుగారెండు లక్షల రూపాయల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీమాను తన భర్త చేయించడం వల్ల ఈరోజు భీమా అందుకోవడం జరిగిందని వారికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎస్.టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్, కౌన్సిలర్లు ఎ.వేదవతి, జి.కళ్యాణి,బి.వెంకటలక్ష్మి కు కృతజ్ఞతలు తెలిపారు.

# వివాదాల నిలయం విశాఖ కేంద్రకారాగారం..!

## మరో వివాదంలో జైలు అధికారులు -వైరల్ అవుతున్న ఇద్దరు ఖైదీలు రాసిన లేఖ

(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)



విశాఖ సెంట్రల్ జైలు.. ఒకప్పుడు ఈ జైలు పేరు చెబితే ఖైదీలకు నిలయంగా గుర్తుకొచ్చేది. కొన్నేళ్లుగా అది వివాదాల కేంద్ర కారాగారంగా పేరు గడించింది. తరచూ ఏవో ఆరోపణలతో వార్తల్లోకి ఎక్కుతూనే ఉంది. అవినీతి ఆరోపణలే కాదు.. గంజాయి పంపిణీకి కూడా ఇది ఆలవాలంగా మారిపోయింది. సాక్షాత్తూ జైలు సిబ్బంది, అధికారులు కూడా ఈ ఆరోపణల్లో చిక్కుకుంటున్నారు. పనిష్మెంట్లకు గురవుతున్నారు. అయినప్పటికీ వీరిలో ఎలాంటి మార్పు రావడం లేదు సరికదా? సరికొత్త వివాదాల్లో తలదూరుస్తూ ఈ సెంట్రల్ జైలును వార్తల్లో నిలుపుతున్నారు.తాజాగా మరోసారి విశాఖ సెంట్రల్ జైలు వివాదంలో చిక్కుకుంది. ఇద్దరు ఖైదీలు రాసిన లేఖ వైరల్ అవుతోంది. విశాఖ సెంట్రల్ జైల్ అధికారులపై ఖైదీల తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు సుపరింటెండెంట్ మహేశ్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ సాయి ప్రవీణ్ వేధిస్తున్నారని ఓ లేఖలో పేర్కొన్నారు. ఓ కిడ్నాప్ కేసులో నిందితుడైన ఉలవల రాజేశ్, మరో ఖైదీ మీర్జాఖాన్ మీడియాకి లేఖ రాశారు. రౌడీషీటర్ ఉలవల రాజేశ్ లేఖలో సంచలన అంశాలు వెల్లడించాడు. రిమాండ్లో తాను మొబైల్స్ వినియోగించకపోయినా సరే తనపై కుట్ర పన్నారు అంటూ లేఖలో పేర్కొన్నాడు. “సెల్ ఫోన్ సిగ్నల్ వచ్చే బ్లాక్ వద్ద నన్ను బంధించి మొబైల్ వినియోగించినట్లు నాపై తప్పుడు సాక్షాలు సృష్టించారు. జైలు అధికారుల దాష్టీకాలపై 18-3-2025న కోర్టు వాయిదాకు వచ్చినపుడు జైలు అధికారులపై జడ్జికి ఫిర్యాదు చేశాను. జడ్జి దృష్టికి ఈ వ్యవహారాలను తీసుకు వెళు న్నానంటూ కక్ష కట్టి నన్ను వేధిస్తున్నారు” అంటూ లేఖలో పేర్కొన్నాడు. “తోటి ఖైదీల వలె కాకుండా నన్ను లాకప్ నుంచి అస్సలు బయటకు రాకుండా సూపరింటెండెంట్ లోపలే బంధిస్తున్నారు. అందరు ఖైదీల్లాగా ఉదయం నుంచి నన్ను బయటకు పంపడం లేదు. జడ్జికి ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని వేధిస్తున్నారు. లేకుంటే జైల్లో ఇలానే హింస తప్పదని సూపరింటెండెంట్ బెదిరిస్తున్నారు. జైల్లో మాకు చట్టప్రకారం ఇవ్వాల్సిన ఆహారాన్ని కూడా ఇవ్వడం లేదు.జైలు క్యాంటీన్ అనేక అవకతవకలకు పాల్పడుతూ దోపిడీ చేస్తున్నారు.జరుగుతున్న అవకతవకలపై అధికారులను నిలదీస్తే, గంజాయి వాడుతున్నారని తప్పుడు కేసులు పెటడతామంటూ నాగన్న అనే మరో ముద్దాయిని బెదిరిస్తున్నారు. జైల్లో మేము పడుతున్న బాధలను బయటకు తెలియాలనే ఈ లేఖ రాస్తున్నాం” అంటూ రాజేశ్, మీర్జాఖాన్ చెప్పుకొచ్చారు.


# అమెజాన్ డాట్ ఇన్‌లో రక్షాబంధన్ ప్రత్యేక స్టోర్

విశాఖపట్నం, ఆగస్టు 6, ప్రభాతవార్త

తమ ఇ గిఫ్ట్ కార్డ్స్ కోసం కొత్త వ్యక్తిగత ఫీచర్ అమెజాన్ పే డిజిటల్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు అమెజాన్ పే గిఫ్టింగ్ స్టోర్డ్ వేల్యూ డైరెక్టర్ జినేహా గుప్తా మహాత్మ వెల్లడించారు. తమ సొంత వ్యక్తిగత ఫోటోలు లేదా ఆర్ట్ వర్క్‌ను అప్ లోడింగ్ చేయడం ద్వారా గిఫ్ట్ కార్డ్స్‌ను వ్యక్తిగతం చేయడానికి ఈ ఫీచర్ కస్టమర్లకు అనుమతిస్తుందన్నారు. రాఖీ పురస్కరించుకొని అమెజాన్ డాట్ ఇన్ అన్ని పండగ అవసరాల కోసం ఏకైక వేదికగా రక్షా బంధన్ స్టోర్‌ను పరిచయం చేసిందన్నారు. అందంగా తయారు చేయబడిన రాఖీ లు, సంప్రదాయబద్ధమైన మిఠాయిలు, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, ఇంకా ఎన్నో వాటిని ప్రదర్శిస్తున్న స్టోర్ షాపింగ్ ను సులభంగా, ఆనందకరంగా చేయడానికి ఉత్తేజభరితమైన డీల్స్, ఆఫర్లను అందిస్తోందన్నారు. ఇంకా, విలాసవంతమైన అనుభవాన్ని చేర్చే సొగసైన ఎన్వలప్స్, ప్రీమియం బాక్సులు, డిజైనర్ గ్రీటింగ్ కార్డ్స్ సహా కొత్త ప్యాకేజింగ్ రూపాలతో అమెజాన్ తమ వాస్తవమైన బహుమతి ఎంపికలను మెరుగుపరిచింది. ఈ రక్షా బంధన్‌కు, పర్యావరణ చైతన్యం కలిగిన కస్టమర్లు విలక్షణమైన విత్తనాలు కలిగిన పేపర్ బహుమతి కార్డ్ ను ఎంచుకోవచ్చు అని చెప్పారు.

# ప్రయాణీకుల భద్రతే ప్రాధాన్యం : సిపి బాగ్చి

గోపాలపట్నం, ఆగస్ట్ 6, ప్రభాతవార్త



ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఆ మేరకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సంకాబ్రత బాగ్చి అన్నారు. స్థానిక సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన ఆటో, టాక్సీ స్టాండ్లను డివిజనల్ రైల్వే మేనేజర్ లోహిత్ బోర్ హ తో కలిసి బుధవారం ప్రారంభించారు. నిర్ణీత ధరలతో ప్రయాణికులు ధర్నానికి చేరువేయడమే లక్ష్యంగా స్టాండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలకు జిపిఎస్ అనుసంధానం చేసి తద్వారా ప్రయాణికుల భద్రత పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా ఆటో స్టాండ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు పూర్తి భద్రతను కల్పించినట్టుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషన్ ఆఫ్ పోలీస్ డి మేరీ ప్రశాంతి, ఏ డి సి పి కే ప్రవీణ్ కుమార్, ఏసిపి పృథ్వితేజ తదితరులు పాల్గొన్నారు.

# జాకబ్ రాజుకు భారత్ విభూషణ్ అవార్డు

గోపాలపట్నం, ఆగస్టు 6, ప్రభాతవార్త



స్థానిక ప్రశాంత నగరకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ పి జాకబ్ రాజు కు భారత్ విభూషణ్ అవార్డు లభించింది. నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ భారతదేశంలో సాంస్కృతిక మరియు కళా రంగాలలో విశిష్ట ప్రతిభ చూపిన వారి సేవలను గుర్తించి అవార్డు లను ప్రధానం చేసే కార్యక్రమంలో భాగంగా 2025 సంవత్సర ములు గాను ఫైన్ ఆర్ట్స్( చిత్రకళ) విభాగంలో జాకబ్ రాజుకు అవార్డు అందజేశారు. గతంలో జాతీయ అంతర్జాతీయ అవార్డు పురస్కారం అందుకున్న జాకబ్ రాజ్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్‌గా కూడా విధులు నిర్వహించారు

# గంజాయి రవాణా కేసులో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

గోపాలపట్నం, ఆగస్టు 6, ప్రభాతవార్త

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని గోపాలపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. గంజాయి రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు గోపాలపట్నం సబ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు బుధవారం గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన అశోక్, ప్రభాకర్ లవర్ తో ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా సుమారుగా 10 కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరిని అదుపులో తీసుకొని గోపాలపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్వీ ప్రభాకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# తుంగలాం వద్ద ఆర్‌వోబి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పల్లాకు వినతి

గాజువాక,ఆగష్టు6,ప్రభాతవార్త:



తుంగలాం వద్ద ఆర్‌వోబి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావుకు జీవీఎంసీ 69వ వార్డ్ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి వినతి పత్రం అందజేశారు. బుధవారం గాజువాక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా ను కలిసి తుంగలాం గ్రామం వద్ద నిర్మించుతున్నా అర్ వో బి నకు సంబంధించి గత 25 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న 3 కుటుంబాలకు వారికి వెరొక చోట స్థలాలు కేటాయించాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని అలాగే ఆర్‌వోబి పనులు జరిగేలా చూడాలని కోరారు. ప్రజలు పారిశ్రామిక వేత్తలు ఉద్యోగస్తులు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని చొరవ చూపాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు కాకి గొవింద రెడ్డి తెలిపారు.

# సౌత్ ఏసీపీను మర్యాదపూర్వకంగా కలిసిన తిలక్

గాజువాక,ఆగష్టు 6,ప్రభాతవార్త



సౌత్ ఏసీపీ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వై. శ్రీనివాసరావు ను మంగళవారం కార్యాలయంలో సౌత్ ఇండియా వైస్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ ఎంవిఎస్ జి.తిలక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ 1991 బ్యాచ్‌కి చెందిన శ్రీనివాసరావు 2020న డీస్పీగా ఇంటెజెన్స్ గుంటూరు ఎస్‌పిడిఓ పుత్తూరు సిఐడి డీస్పీ రాజమండ్రిలో పనిచేసారని అక్కడ పని చేసిన క్రమశిక్షణ ఫ్రెండ్లీ పోలీసింగ్ ముఖ్యంగా అందరికి అందుబాటులో ఉంటూ సామాన్యులు న్యాయం చేయడంలో ఈయనకు మంచి గుర్తుంపు ఉంది అన్నారు. అనంతరం ఏసీపీ మాటలు ఆడుతూ సౌత్ జోన్‌లో అక్కడైనా శాంతిభద్రతలు సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలనీ,చెడు అలవాట్లుకు బానిసలవుతున్న యువత మంచి మార్గంలో పయనించాలని సూచించారు. తన పరిధిలో అక్కడైనా పేకాట గంజాయి ద్వారా ఇబ్బంది ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# నేడు వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సిపి శంఖబ్రత సమావేశం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



ఈ నెల 26 న వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకుని నగరంలో పందిళ్ళు,మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించదలచిన వారితో నేడు పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సమా వేశం నిర్వహించనున్నారు. పందిళ్ళు,మండపాల ఏర్పాటుకు తీసుకోవలసిన ముందస్తు అనుమతులతో పాటుగా, పండుగ రోజు నుండి నిమజ్జనం వరకు జరిగే పూజలు, వేడుకల సందర్భాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో, ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ ముందస్తు సమావేశాన్ని నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులతో నగర సీపీ ఏర్పాటు చేయడం చేయనున్నారు. కావునా విశాఖ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పందిళ్ళు, మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించదలచిన నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులు గురువారం అనగా నేటి సాయంత్రం 4 గంటలకు నిర్వహించబోవు సదరు సమావేశానికి హాజరు కావలసినదిగా పోలీసుల విజ్ఞప్తి చేశారు.

Main tab page 62_Main tab page 62.qxd 8/6/2025 11:51 PM Page 1



# కరెంటు కోతలతో రైతులకి తప్పని సాగునీటి అవస్థలు..





**పద్మనాభం,ఆగస్టు 6, ప్రభాతవార్త**

ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కోతలు విధించడంతో సాగునీటి అవస్థలు తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.పద్మనాభం మండలంలో మద్దిగ్రామం, కృష్ణాపురం, విలాసఖానపాలెం, పొట్నూరు,గందవరం, అనంతవరం,కోరాడ, పాండ్రంగి తదితర గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు వద్ద ముదురుగా వేసిన వరినారులు ప్రస్తుతం గత వారం రోజుల నుండి రైతులు నాట్లు వేస్తున్నారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు చీటికి మాటకి కరెంటు కోతలు విధించడంతో మోటర్లు పడకేస్తున్నాయి. దీంతో దమ్ములుకి, నార్లుకి నీరులేక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.వ్యవసాయానికి ఇచ్చిన 9 గంటల కరెంటులో మూడు గంటలు కోతలు విధిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కరెంటు కోతలతో సాగు సాగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కోతలు వల్ల రైతులు, వేసవి కాలం కన్నా మండుతున్న ఎండలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు,భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి కరెంటు కోతలు లేకుండా నిరంతరంగా కరెంటు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఒడిశాకు దాసుడు బృందం
# అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

**- భక్తులకు ప్రసాద వితరణ**

**విశాఖపట్నం, ఆగస్టు 6, ప్రభాతవార్త**



ఒడిస్సాకు చెందిన వనమాలిక్ దాస్ (దాసుడు బాబు బృందం) బుధవారం తిరిగి ప్రయాణమైంది. ప్రతి ఏటా మూడు నెలల పాటు సింహగిరిపై ఉండి ఆ సిరిలోలికించే సింహాద్రి నాథుడిని సేవించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతి రోజు వివిధ రకాల ఫల, పుష్ప శీతలాదులు స్వామికి సమర్పించి పూజలు చేస్తారు.అలాగే పలు ఆర్జిత సేవల్లో కూడ తన బృందంతో కలిసి భాగస్వాములు అయ్యారు. ఈ ఏడాది తన కార్యక్రములు అయ్యారు. ఈ ఏడాది తన కార్యకమాలు పూర్తిచేసుకుని బుధవారం తిరిగి ఒడిస్సా కు బయలదేరి వెళ్తున్నారు. ఈ సందర్భంగా సింహాద్రినాథుడు సన్నిధిలో అమ్మవారి సన్నిధిలో దాసుడు బాబు తన బృందంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సింహాయచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు సింహాద్రినాథుడు ను దర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వహించారు. అలాగే ఒడిస్సా దాసుడు బాబుతోనూ పలు అంశాలపై చర్చించి ఆయన ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా దాసుడు బాబు సేవలను గంట్ల శ్రీనుబాబు అభినందించారు.

## 11వ వార్డు పార్వతినగర్‌లో సుపరిపాలన తొలి అడుగు

**ఆరిలోవ, ఆగస్టు 6, ప్రభాతవార్త**



తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు పార్వతినగర్ లో బుధవారం వార్డ్ ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, వార్డ్ అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, యువ నాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనపై ప్రజల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు, అలాగే ప్రజల సమస్యలు యాప్ ద్వారా నమోదు చేసి ఇంటింటికి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఒమ్మి సన్యాసిరావు , ఏడువాక సన్యాసిరావు, వార్డ్ కార్యదర్శి పేపర్ నాయుడు, గాడి సత్యం, జిల్లా నాయకులు ఎం. అప్పారావు, పచ్చిపాల శ్రీను, లింగం సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

## తల్లిపాలు అమృతం... సూపర్ వైజర్ వీరయ్యమ్మ

**రాజవొమ్మంగి, ఆగస్టు 6, ప్రభాతవార్త**




తల్లిపాలు అమృతమని చెరుకుంపాలెం సెక్టార్ సూపర్ వైజర్ జి. వీరయ్యమ్మ అన్నారు. బుధవారం చెరుకుంపాలెం గ్రామంలో సెక్టార్ స్థాయి తల్లిపాలు వారోత్సవాలు సర్ప జరిగాయి. ఈసందర్భంగా వీరయ్యమ్మ మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తల్లి పాలు వెంటనే పట్టించాలన్నారు. తల్లి పాలు పట్టించడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని అన్నారు. తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లి పాలులో రోగ నిరోధక శక్తి ఉంటుందని అన్నారు. రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాదులు రావని వీరయ్యమ్మ వివరించారు. డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు అంటూ తల్లులు, గర్భిణీలు, స్థానికులకు అవగాహనను కల్పించారు. ఐసి డి. ఎస్ వారు స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఏ ఎన్ యం లక్ష్మి మాట్లాడుతూ మన పెరట్లో దొరికే ఆకుకూరల్లో పోషక విలువలు ఉంటాయని అన్నారు. సకాలంలో. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్ వీరయ్యమ్మ, మార్కెట్ కమిటీ మెంబర్ గట్టు మాణిక్యం, ఏ. ఎన్. యం కొరకూటి లక్ష్మి,, అంగన్వాడీ వర్కర్స్,, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**పాడేరు, ఆగస్ట్ 6,ప్రభాతవార్త**



పాడేరు మండలం లగిశపల్లి స్కూల్లో పని చేస్తూ బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు మటం ప్రసాద్ పడాల్, మేడపల్లి గురునాథ్ లకు పాఠశాల ప్రాంగణంలో బుధవారం వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఇద్దరుఉపాధ్యాయులకు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు.ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు కొండబాబు అధ్యక్షతన జరిగిన వేడుకలో ముఖ్య అతిధులుగా ఎంపీటీసీ రామకృష్ణ పాత్రుడు, పాఠశాల చైర్మన్ అయ్యప్ప, వైస్ చైర్మన్ విజయలక్ష్మీ, గ్రామ పెద్దలు రమేష్, రాజు, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసిన జిల్లా ఎస్పీ

**అనకాపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లాకు చెందిన హోంగార్డు జనపాల అప్పలనాయుడు, నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో, అతని భార్య జనపాల సత్యవతి కి అనకాపల్లి మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాలలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా అందించిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,78,430/ నగదు చెక్కును అందజేశారు. ఈ చెక్కును అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో జనపాల సత్యవతికు అధికారికంగా అందించారు. హోంగార్డులు విధి నిర్వహణలో మృతి చెందిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందించే మంచి ఆచారం పాటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో విద్యార్థులను పరిచయం చేసుకున్న హెచ్‌యం సుశీల

**ఎలమంచిలి,ఆగస్టు 06, ప్రభాతవార్త**



పట్టణములోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల ప్లస్ లో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను బుధవారం నిర్వహిం చారు. క్రీడా పోటీలు ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కే సుశీల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించే ఈ క్రీడా పోటీల్లో గెలుపు ఓటముల తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనాలని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు స్వాతంత్ర దినోత్సవం రోజున బహుమతులు ప్రధానం చేయబడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదారి ఆదిమూర్తి, పిడి శిరీష, మూర్తి, పాల్గొన్నారు.

## వెదురుపర్తిలో దేవాదాయ శాఖ భూములను పరిశీలించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి

**కసింకోట, ఆగస్టు 6, ప్రభాతవార్త**



కసింకోటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన వెదురుపర్తిలో గల భూములను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్. సుధారాణి, దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణమూర్తి కలసి బుధవారం పరిశీలించారు. గత నెలలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ భూముల శిస్తు వేలం రైతులకు సమాచారం లేకుండా కసింకోట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శిశు వేలంపాట నిర్వహించగా విషయం తెలుసుకొని అక్కడకు కొంతమంది వచ్చిన రైతులు దేవాదాయ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు తెలియకుండా వేలంపాట వేయటం ఏమని అధికారులను నిలదీశారు. అయితే ప్రస్తుతానికి దేవాదాయ శాఖ భూముల్లో ఎవరైతే శిస్తు చేస్తున్నారో ఆ రైతులు వేలంపాటకు రాకపోవడంతో ఆంతర్యమేమిటి అని కొంతమంది రైతులు నిలదీశారు. గ్రామాల్లో దండోరా వేయించి రైతులకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేగాక పాత రైతులకు మరల దేవస్థానం భూములు కట్ట పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దీంతో చేసేదేమీ లేక దేవాదాయశాఖ అధికారులు శిస్తు వేలంపాటను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వెదురుపర్తిలో గల దేవస్థానం సంబంధించిన భూములను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్. సుధారాణి, కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణమూర్తి పరిశీలించారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ శంకుస్థాపన

**అనకాపల్లి, ఆగస్ట్ 6, ప్రభాతవార్త**



మునగపాక లో పేరుగాంచిన చెరువు కాలువ సంఘ పరిధిలోని శ్రీ సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నాని పంతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మల్ల జయలక్ష్మీ సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు దాడి చంద్రావు, వెలగా అప్పలనాయుడు, వెలగా వెంకట అప్పారావు, కర్రీ రామ్ జోగినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

**- ఏఐటియుసి డిమాండ్**

**పాడేరు, ఆగస్ట్ 6,ప్రభాతవార్త**



ఉమ్మడి విశాఖ జిల్లాలో అల్లూరి, విశాఖ,అనకాపల్లి ప్రభు త్వం సి.హెచ్,సి, జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూర్టీ గార్డ్, ఫేస్ట్ కంట్రోల్ కార్మికులు కు బకాయి పడ్డ మూడు నెలలు జీతాలు ను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం అల్లూరి జిల్లా కన్వీనర్ జల్లి రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్టర్ కార్మికులు పి.ఎఫ్. డబ్బులు కట్టకుండా కార్మికులు శ్రమను దోచుకుంటూ తిన్న గతం లో కానీ నేటి కాంట్రాక్టర్లు కానీ నేటికి న్యాయం చేయకుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. ఈ విషయము పై ఉమ్మడి జిల్లాల ఉన్నత అధికారులు కు వద్ద వెళ్ళి అనేక సార్లు వినతి పత్రాలు అందించనప్పటికీ మరియు ఆందోళనలు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం కార్మికులకు అందటం లేదని వాపోయారు.ఇప్పటి కైన అధికారులు సంబందించిన ఆసుపత్రి లో థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు లిస్ట్ లను బ్యాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులు ను కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు లో శానిటేషన్,సెక్యూరిటీ,పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ కార్మికుల ఆరోగ్యానికి రక్షణ లేదని మరియు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. నేటికి కాంట్రాక్ట్ కార్మికుల్లో కొంత మందికి కనీసం పి.ఎఫ్ డబ్బులు తమ ఖాతాలలో జమ చేయటం లేదని ఆయన మండిపడ్డారు. బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని,కనీస వేతనాన్ని అమలు చేయాలనే అంశాలు తదితర డిమాండ్లు ను పరిష్కారం చేయకుంటే ఆందోళనలు చేపడతామని అన్నారు.వెంటనే సమస్యల పరిష్కార దిశగా కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే ఛలో విజయవాడ కార్యక్రమం కి కూడా సిద్ధమవుతామన్నారు. ఈ సమావేశం లో ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ అమర్ పాల్గొన్నారు.

## 100శాతం రిజర్వేషన్ పై ప్రభుత్వం ప్రకటన చేయాలి: ఆదివాసీ నేతలు

**రాజవొమ్మంగి, ఆగస్టు 6, ప్రభాతవార్త**



ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏజన్సీ ప్రాంతంలో నూరుశాతం రిజర్వేషన్ పై ప్రకటన చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, అన్నారు. బుధవారం రాజవొమ్మంగిలో ఈనెల 9 తేదీన నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ సన్నాహక సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ నేత తాము సూరిబాబు మాట్లాడుతూ 9తేదీన స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహం వద్ద నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి ఆదివాసి జేఏసీ నాయకులు, ఆదివాసి ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు,కర్షకులు తప్పక హాజరు కావాలని పిలుపు నిచ్చారు. గంపా నాగరాజు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఆదివాసి జండా ఆవిష్కరణ,ర్యాలీ, ఆదివాసి సాంస్కృతి, సాంప్రదాయాల నృత్యాలు,పాటలు, కోలాటం ఉంటాయన్నారు. తదుపరి జరిగే బహిరంగ సభ కార్మిక గిరిజనుల హక్కులు చట్టాలు పట్టిస్తా అమలకై భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని కోండ్ల సూరిబాబు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదివాసీలు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోతా రామారావు, వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, గంపా నాగరాజు, కోండ్ల సూరిబాబు, జె రాజు, మిరియాల రమేష్, దాసరి పైడిమల్లు, కానెం శ్రీను, పొట్టబోయిన రమణ, మండల సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సర్పంచులు సవిరాల చంద్రుడు, చీడి శివ పాల్గొన్నారు.

## గంజాయి పాత కేసులో ముద్దాయి అరెస్టు

**రాజవొమ్మంగి, అగస్టు 6, ప్రభాతవార్త**

2017 సం. జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయి విచారణ జరుగుతున్న గంజాయి కేసులో వరంగల్ కు చెందిన మహ్మద్ జానీ అరెస్టు కాబడి కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడం నాన్ బెయిల్ బుల్ వారెంట్ జారీ కావడం జరిగిందని జడ్డంగి ఎస్. ఐ చిన్నబాబు తెలిపారు. బుధవారం మహ్మద్ జానీని అరెస్టు చేసి రాజమండ్రి జిల్లా కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విదిస్తూ తీర్పు ఇవ్వడంతో కేంద్ర కారాగారంకు తరలించినట్లు ఎస్. ఐ వివరించారు.

## పెదబయలు టిడిపి సీనియర్ నాయకుడు లోట్టి చిన్నిపై దాడి

**పాడేరు, ఆగస్ట్ 6,ప్రభాతవార్త**



బుదవారం పెదబయలులో భూ తగాదాలు నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కి చెందిన సీనియర్ నాయకుడు లొట్టి త్రినాధ్(అలియాస్ చిన్ని) పై ఒక వర్గానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడటంతో తలకు తీవ్రంగా గాయాలు తగిలాయి.దీంతో పాడేరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చిన్ని తరలించి అత్యవసర చికిత్సలు నిర్వహించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘర్షణ,దాడులకు సంబంధించి ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసుకున్నారు.ఘర్షణకు అబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మోంట్ యూనం శిఖరారోహణకు కార్తిక్, ఆనంద్ బాబు సిద్ధం: అధికారులు

**పాడేరు, ఆగస్ట్ 6, ప్రభాతవార్త**



పర్వతారోహకులు గిట్టే కార్తిక్ (హైదరాబాద్) మరియు సంపంగిబోయినీ ఆనంద్ బాబు (అద్దుమండ గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా) మోంట్ యూనం శిఖరారోహణ యాత్ర కోసం నేడు హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరారు. ఈ సందర్భంగా హిందూ గ్లోబల్ ఫెడరేషన్, శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్, అడ్మిరల్ టీమ్ కార్తిక్‌కు ఘనంగా అభినందనలు తెలిపాయి. అలాగే ఆనంద్ బాబుకు ప్రాజెక్ట్ ఆఫీసర్ డా. అభిషేక్ గౌడ రూ/ 50 వేలు రూపాయలు స్పాన్సర్ చేసి ప్రోత్సహించారు. వీరి శిఖరారోహణ లక్ష్యం లాహౌల్‌స్పితి ప్రాంతంలో ఉన్న 6111 మీటర్ల ఎత్తు కలిగిన మోంట్ యూనం. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే, మోంట్ కానామో (6111 మీటర్లు) శిఖరాన్ని ప్రత్యామ్నాయంగా ఎంచుకునే యోచనలో ఉన్నారు. ఇది కేవలం పర్వతారోహణ యాత్ర మాత్రమే కాదు, సంస్కృతీ గర్వం, జాతీయ గౌరవం, మరియు యువతకు స్ఫూర్తి నింపే సాహసయాత్రగా నిలవనుంది.

## అల్లూరి జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు

**పాడేరు, ఆగస్ట్ 3,ప్రభాతవార్త**



అల్లూరి సీతారామ రాజు జిల్లాలో జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు బుదవారం నేర నియంత్రణ కు పటిష్ట చర్యల్లో భాగంగా జిల్లాలోని పోలీసులు, విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు అణచివేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమ రవాణాకు, గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు అరికట్టే దిశగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

**రాజవొమ్మంగి, అగస్టు 6, ప్రభాతవార్త**




ఏడు మండలాలు పరిధిలో గల సచివాలయ వ్యవసాయ సహాయకులు, హార్టికల్చర్ సహాయకులకు అడ్డతీగల మండలం వేటమామిడి రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై మూడో రోజు శిక్షణ కార్యక్రమం మూడో రోజు బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డి.పి.ఎం) రామ్మోహనరావు ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్ రిలే సోయం, పసుపుసాగులో అంతర పంటలు, ఆరోగ్యం, పోషణ, మార్కెటింగ్, ఎన్ యం. ఎన్ ఎం. ఎన్. ఎఫ్ పంచాయతీలు, రైతు సేవా కేంద్రం అనుసంధానంతో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని శిక్షణలో వివరించారు. ఈకార్యక్రమంలో ఎ.ఎస్.ఆర్ జిల్లా డి.పి.ఎం రామ్మోహనరావు మండల వ్యవసాయ అధికారులు (ఎం.ఏ.ఓలు), వి.ఎ.ఎ, వి.ఎచ్.ఎ ఎన్.ఎఫ్.ఎలు, ఎం.ఎం.టి.ఎల్, ఎం.టీలు, యూనిట్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు..

## మోటారు పైపులను దొంగలించిన దుండగులు

**కసింకోట, ఆగస్టు 6, ప్రభాతవార్త**

కసింకోట శివారు ప్రాంతం ఈనెల 4న శారదా నది ఒడ్డున గల పంట పొలాలకు నీరు తోడే పైపులను, మండలంలోని ఏఎస్పేట గ్రామం శివారు ప్రాంతంలో రైతులు పొలాలకు నీరు పెట్టుకున్న పైపులను జూలై 31న ఘూత తెలియని దండగలు దొంగలించారు. ఏఎస్పేట రైతులు నీరు తోడే పైపులు దొంగలించడంతో కసింకోట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Main tab page 7_2_Main tab page 7_2.qxd 8/6/2025 11:51 PM Page 1



## గండి నానాజీని అభినందించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**ఎలమంచిలి ,ఆగస్టు 06, ప్రభాతవార్త**



పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఇటీవల రాష్ట్రస్థాయిలో కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రథమ స్థానం పొందిన అచ్చుతాపురం మండలం దొప్పర్ల గ్రామానికి చెందిన గండి నానాజీని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వములో ఎటువంటి అవకతవకలకు చోటు ఇవ్వకుండా రాష్ట్ర స్థాయిలోనిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో మన నియోజకవర్గానికి చెందిన నానాజీ ప్రథమ స్థానంలో నిలవడం అనేది చాలా గర్వకారణం అన్నారు.మరెన్నోఉన్నతశిఖరాలనుఅధిరోహించాలనిఆకాంక్షిస్తున్నాను అన్నారు. రాష్ట్రస్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిననానాజీతల్లిదండ్రులనుఅభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ఎలమంచిలి ఆగస్టు 6, ప్రభాతవార్త**




పట్టణంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నియోజకవర్గం లోని ఐదుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మూడు లక్షల ఐదు వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదవారు వైద్య చికిత్స కోసం అత్యాశ సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అర్జీ పెట్టుకున్న తక్షణమే నిధులను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బోద్ధపు శ్రీనివాసరావు, ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు, గంధం శివ,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం అంటూ విద్యార్థుల ప్రతిజ్ఞ

**అనకాపల్లి, ఆగస్ట్ 6, ప్రభాతవార్త**



మట్టి గణపతిని పూజిస్తాం.. .పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను విడనాడదాం అని నినాదాలతో విద్యార్థులు ప్రతిజ్ఞలు చేసారు. భాష్యం స్కూల్ లో బుధవారం వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మేము మా ఇళ్లల్లోమట్టి గణపతిని పూజిస్తాం, మా వీధి లో కూడా మట్టి గణపతితో చేసిన గణపతినే పూజిస్తాం అని నినాదాలు చేయించారు. అనంతరం వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్. ఆడారి కుమారస్వామి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు సమావేశాలు ఆగస్టు 20 వరకు జరుగుతాయని సుమారు50 నుంచి 70 సదస్సులు పాఠశాలలలో బహిరంగ ప్రదేశాల్లో జనం ఎక్కువగా గుమి గూడిన ప్రాంతాల్లో. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు చైతన్యం కావాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని అన్నారు. లోక కళ్యాణార్థం భక్తులకు విఘ్నాలు తొలగించి. అందరూ కుటుంబాలతో సుఖశాంతులతో ఉండాలని గాలి నీరు కాలుష్యం అవకుండా పర్యావరణ రహిత విగ్రహాలను తయారు చేయాలని అలాంటి విగ్రహాల్ని నిమజ్జనం చేయాలని తద్వారా పర్యావరణాన్ని మనం పరిరక్షించుకునేవారు అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి రమణ, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలందరకు స్వామివారి సౌభాగ్య ప్రసాదం పంపిణీ


**నక్కపల్లి, ప్రభాతవార్త**




మండలంలోని ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వ్యయం చేసి ఉన్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం మరియు హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ మూడవ శుక్రవారం సందర్భంగా సౌభాగ్యం అనే కార్యక్రమాన్ని ఉపమాక దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు బుధవారం ఉదయం తెలియజేశారు. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే పూజ చేయబడిన పసుపు కుంకుమ రక్షా కంకణాలు మహిళలందరూ ఉచితంగా గాజులు ఆలయంలో శుక్రవారం ఉదయం నుండి పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. శుక్రవారం ఉదయం నుండి సౌభాగ్యవతులైన మహిళలందరూ గాజులు, పసుపు, కుంకుమ, రక్ష కంకణాలు అందజేయడం జరుగుతుందని, కావున స్వామి వారి భక్తులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఆయన దేవస్థానం సిబ్బందితో కలిసి ప్రచార పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగవతం గోపాలచార్యులు ఆఫీసి అసిస్టెంట్ మునిగిరీష్, టీటీడీ విజిలెన్స్ కి చెందిన ఎలమంచిలి దీప్తి, సిబ్బంది కొర్లాపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మఠం సూర్య నారాయణ కుటుంబీకులను పరామర్శించిన "కొప్పిశెట్టి"

**నక్కపల్లి ,ప్రభాతవార్త**



మండలం లోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడు గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మఠం సూర్యనారాయణ కుటుంబాన్ని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం సాయంత్రం పరామర్శించారు రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటికి చేరుకునే విషయం తెలిసినదే.! పరామర్శించిన వారిలో నక్కపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, తెలుగుదేశం నాయకులు గింజల శ్రీనివాస్. పిక్కి శ్రీనివాసరావు. పిక్కి రాంబాబు. పిక్కి గంగరాజు. ఎంపీటీసీ పిక్కి సత్తియ్య. పిక్కి చినతాత.పిక్కి కోదండ రావు.పిక్కి కొండలరావు. సిరిపిల్లి అప్పలరాజు. వాసుపల్లి శివాజీ. పిక్కి అప్పలరాజు. పిక్కి నూకరాజు.బొందు దేవుళ్ళు. మైలపిల్లి ప్రసాద్. బొందు దారులు. ముకుర్తి త్రిమూర్తులు. పిక్కి శివాజీ. సిరిపల్లి వాసు ఉన్నారు.

## గోడిచర్లలో శానిటేషన్ పనులను పర్యవేక్షించిన ఎండిఓ" దెందుకూరి"

**నక్కపల్లి, ప్రభాతవార్త**




మండలంలోని గోడిచర్ల సచివాలయం పరిధిలో పలు వార్డుల్లో బుధవారం ఉదయం జరుగుతున్న శానిటేషన్ పనులను ఎండిఓ దెందుకూరు సీతారామరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తడి చెత్త పొడి చెత్త సేకరించే విషయంలో పలు సూచనలు చేశారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై కార్యదర్శులతో మాట్లాడారు. పలు బావుల్లోని ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించారు. గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్త ఉండకుండా చూసుకోవాలని కార్యదర్శి తో పాటు సచివాలయం సిబ్బందికి తెలియచేశారు. ముందుగా గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు సంబంధించిన జాబ్ కార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు ఉన్నారు.

# జనవాణి కార్యక్రమంలో సమస్యలపై వచ్చేవారిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**ఎలమంచిలి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధ వారం నియోజకవర్గస్థాయి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్వయంగా పాల్గొని అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ క్రమంలోనే చంటి పాపతో సమస్యపై వచ్చిన వారితో ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ మీ సమస్య ఏమిటి అంటూ ఈ సమస్యని తీరుస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో తల్లి ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఇలాంటి ఎమ్మెల్యేను ఇప్పటివరకు చూడలేదని ఇంత ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను వింటూ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం చాలా హర్షించదగ్గ విషయంమని ఆమె తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జ్ సుందరపు వెంకట సతీష్ కుమార్, వైస్ ఎంపీపీ శేషు, ప్రభుత్వ అధికారులు జనసేన నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్ధపు శ్రీనివాసరావు, ఊటకూటి రమేష్ నాయుడు, కొట్టారు శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ,గంధం శివ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# గృహనిర్బంధంలో విపక్ష నేతలు.!

**- ఇది ప్రజాస్వామ్యమా.. వీసం, అప్పలరాజు**

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి మండల కేంద్రంగా ఏపీఐఐసీ బుధవారం జరపతలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్క్ కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజా అభిప్రాయ సేకరణ ఎటువంటి ఆందోళనలు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో ముందస్తుగా రాష్ట్ర వైకాపా నేత వీసం రామకృష్ణతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ లను గృహ నిర్బంధం లో ఉంచుతూ, అరెస్టు చేసి పాయకరావుపేట స్టేషన్ కు రామకృష్ణను అప్పలరాజును ఏ స్టేషన్ లో పెట్టకుండా కారులో అనేక ప్రాంతాల్లో తిప్పగా రాజేష్ ను గృహ నిర్బంధంలో ఉంచారు. నక్కపల్లి లో బుధవారం జరుపుతున్న ప్రజాభిప్రాయ సేకరణ కు వెళ్ళకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్ పి పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్.రాయవరం ఎస్.ఐ, పోలీసులు ఎక్కడున్నా వారిని అక్కడే అరెస్ట్ చేస్తూ స్టేషన్లకు జీపులో తరలించారు. సభ్యులు ఎం.అప్పలరాజు ను ఉదయం నుండి గృహ నిర్బంధం చేసి అనంతరం అరెస్టు చేసి ఎక్కడ కు తీసుకు వెళ్తామో చెప్ప కుండా కారులో తిప్పడం బట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా లో ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న యనమల రామకృష్ణుడు బల్క్ డ్రగ్స్ ను కంపెనీని వ్యతిరేకిస్తే అక్కడ రద్దుచేసి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం పచ్చగా ఉన్న ఈ ప్రాంతంలో భూసేకరణ చేసి బల్క్ డ్రగ్స్ ను తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత దుర్మార్గమైన రీతులు వ్యవహరించడం దారుణమని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పక్షాన మాట్లాడే అవకాశం లేకుండా అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. ఈ ప్రాంతపు బాగుకోసం ప్రజల పక్షాన రైతుల పక్షాన నిలబడేటట్లు పోరాటం చేస్తానని ఇటువంటి అక్రమ అరెస్టులు భయపడేది లేదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా పాల్గొని తమ అభిప్రాయాలు చెప్పే అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం, పోలీసులు, రాష్ట్ర హోం మంత్రి నియోజకవర్గం లో నే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన ప్రజలు భయపడరని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తారని తెలిపారు. పోలీసులు నిర్బంధం, ప్రభుత్వం చర్యలపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.నక్కపల్లిలో జరపతలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కుండా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ను, ఎస్.రాయవరం మండలం,పి.ధర్మవరంలో గృహ నిర్బంధం.నక్కపల్లి మండలం,ఎన్.నర్సా పురం గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ తో పాటు వైకాపా నాయకులు తల్ల భార్గవ్, గంట తిరుపతిరావు, గొర్ల గోవిందు మన బాలు తాతారావులు ఉన్నారు.

**అక్రమ అరెస్టులను ఖండించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి**

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ను వ్యతిరేకిస్తున్న సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. ఈ ప్రాంతంలో రసాయనిక పరిశ్రమల వల్ల తీవ్రమైన పర్యావరణ సమస్యలు ఏర్పడడంతో పాటు ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పరిశ్రమల వల్ల కొత్తగా ఉద్యోగాలు రావడం లేదన్నారు. పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వడం లేదన్నారు.

## ఆదివాసీ దినోత్సవంకు పాడేరులో సీఎం పర్యటన

**- హెలిప్యాడ్ స్థలం, వంజంగి స్థల వేదిక ప్రదేశం పరిశీలన**

**- సిఎం పర్యటన ఇంచార్జి పెందుర్తి వెంకటేష్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**

**పాడేరు, ఆగస్ట్ 6, ప్రభాతవార్త**




అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారన్న సమాచారంతో సిఎం ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్, జిల్లా అమిత్ బర్దర్, డీఎస్పి సహబాజ్ అహ్మద్, జిసిసి చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ బుధవారం లగిసపల్లి ప్రదేశంలో హెలిప్యాడ్ పరిశీలన చేసి ఆదివాసీ దినోత్సవం వంజంగి గ్రామంలో జరుగుతున్న స్థల పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన విజయవంతం కావాలని ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివాసీ దినోత్సవం జరపడం ఆదివాసులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని రాష్ట్ర జి సి సి చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాడేరు ఇంచార్జి గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, సర్పంచ్ లు పాంగి పాండురంగ స్వామి, బాకూరు వెంకటరమణ రాజు, శశి భూషణ్, తమర్ల సత్యనారాయణ, లకే పార్వతీ, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, బుజ్జి, మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## దివంగత బిజెపి నేత కురుసా బొజ్జయ్య సేవలు మరువలేనిది

**- బీజేపీ అరకు పార్లమెంట్ ఇంచార్జి పుట్ట గంగయ్య**

**పాడేరు, ఆగస్ట్6,ప్రభాతవార్త**



దివంగత బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కీ శే కురుసా బొజ్జయ్య సేవలు మరువలేనిది అని బీజేపీ అరకు పార్లమెంట్ ఇంచార్జి పుట్ట గంగయ్య అన్నారు. బుధవారం స్వర్గీయ కురుసా బొజ్జయ్య ఆరవ వర్ధంతి సందర్భంగా కొత్త పాడేరు లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొని బొజ్జయ్య విగ్రహానికి పూల మాలలు వేసి పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులతో కలిసి ఘన నివాళులు అర్పించారు, అనంతరం అయన మాట్లాడుతూ అరకు, పాడేరు గిరిజన ప్రాంతంలో బీజేపీ జెండా నీ బీజేపీ సిద్ధాంతాన్ని పరిచయం చేసిన వ్యక్తి కురుసా బొజ్జయ్య అన్నారు, పార్టీ అధికారం లో వున్నా లేకున్నా పార్టీ అభివృద్ధికి ఆయన అహర్నిశలు కృషి చేసారన్నారు, అయన ఆ రోజు నాటిన విత్తనం దిన దినాభి వృద్ధి జరిగి నేడు అనేకమంది నాయకులు, కార్యకర్తలను అందించిందన్నారు, గిరిజన సమస్య ల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి సేవలు అజరామరం అన్నారు, అనంతరం గ్రామం లోని వృద్ధులకు శాలువాలు అందజేశారు,ఈ కార్యక్రమం లో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కురుస ఉమా మహేశ్వర రావు, వైస్సార్సీపీ జిల్లా మహిళ అధ్యక్షులు కురుస పార్వతమ్మ, బీజేపీ సీనియర్ నాయకులు కురుస రాజారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నందోలి ఉమా మహేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మినుముల గోపాల పాత్రుడు,సీనియర్ నాయకులు లకే అబ్బాయి దొర, బూత్ నాయకులు కురుసా లక్ష్మయ్య, పాంగి ఈశ్వరరావు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## శెట్టి అప్పాలుకు వైసిపి యువనేత చెట్టి వినయ్ పరామర్శ

**అరకులోయ, ఆగస్టు 6, ప్రభాతవార్త**



అనారోగ్యం తో వైద్యుల సలహా మేరకు తన స్వగృహంలో విశ్రాంతి లో ఉన్న వైసిపి పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైసిపి పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు ను బుధవారం వైసిపి యువ నాయకుడు చెట్టి వినయ్ పరామర్శించారు. శెట్టి అప్పాలు అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకున్న వినయ్ వైసిపి నాయకులతో కలిసి, బెంజిపురం గ్రామం కు చేరుకుని అప్పాలను పరామర్శించి, అనారోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహా, సూచనల మేరకు ఔషధములు వాడుతూ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా చెట్టి వినయ్ ఆకాంక్షించారు. పరామర్శ కార్యక్రమంలో వైసిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, నాయకులు మండ్యకెడ్డి బాలరాజు, మండల వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైసిపి జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షులు ఎల్ బి కిరణ్ కుమార్, అరుకులోయ టౌన్ షిప్ ఎంపీటీసీ సభ్యుడుదురియా ఆనంద్, చిక్కుడు మల్లేశ్వరరావు, అగతంబిడి గణపతి, రామచంద్ర రావు, బాకా సింహాచలం, జన్ని నరసింహా మూర్తి, జల్లేడి గిన్ని బాబు, శెట్టి సోమేశ్వర రావు, శెట్టి రామారావు లు పాల్గొన్నారు.

**కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది**

## పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**పాడేరు, ఆగస్టు 6, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్, సమగ్ర శిక్షా సొసైటి ద్వారా నిర్వహించబడుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను గెస్ట్ ప్రాతిపదికన 202526 విద్యాసంవత్సరంకు(ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయుటకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అర్హులైన మరియు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. బోధన సిబ్బంది ఖాళీల వివరాలు: పిజిటి (మాథ్స్ 1), పిజిటి (ఫిజిక్స్1), పిజిటి (కెమిస్ట్రీ1), పిజిటి (జూవాలజీ1), పిజిటి (సివిక్స్1) మొత్తం పిజిటి ఖాళీలు5, మరియు సిఆర్టి (తెలుగు2), సిఆర్టి (హిందీ1), సిఆర్టి (ఇంగ్లీషు1), సిఆర్టి (ఫిజిక్స్1), సిఆర్టి (సోషల్1), సిఆర్టి మొత్తం6. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్ట్ 8వతేదీ నుండి 10 వ తేదీ వరకూ వరకు మీ మండల పరిధిలోని కేజిబివి ప్రిన్సిపల్స్కి సమర్పించాలన్నారు. వయోపరిమితి: ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 1842 సంవత్సరాలు, ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఈ డబ్ల్యుఎస్ 5 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగినులకు 3 సంవత్సరాలు, దివ్యంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు కలదని సమగ్ర శిక్ష, అదనపు పథ కఅల్లూరి జిల్లా సమన్వయకర్త డా.వి.ఎ.స్వామినాయుడు బుదవారం తెలియజేసారు. విద్యార్హతలు : పిజిటి : ఎన్సిఇఆర్టీ యొక్క ప్రాంతీయ విద్యా సంస్థ నుండి రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు లేదా యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీని కలిగి ఉండాలి. సిఆర్టి : ఎన్సిఇఆర్టీ యొక్క ప్రాంతీయ విద్యా సంస్థ నుండి నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుతో పాటు ఎన్సిటిఇ ద్వారా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుండి బి =ఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. కేజిబివి వారీగా పిజిటి ఖాళీల వివరాలు: కేజిబివి అనంతగిరి, పిజిటి మ్యాథ్స్, ముంచంగిపుట్టు పిజిటీ ఫిజిక్స్, జిమాడుగుల పిజిటి కెమిస్ట్రీ,గంగవరం పీ జి టీ జువాలజీ,కూనవరం పీ జి టీ సివిక్స్, కేజిబివి వారీగా సిఆర్టి ఖాళీల వివరాలు: కొయ్యూరు సిఆర్టీ తెలుగు,కూనవరం సి ఆర్టీ తెలుగు,వై రామ వరం సిఆర్తీ హిందీ,కొయ్యూరు సిఆర్టి ఇంగ్లీష్,అనంతగిరి సిఆర్టిపీ ఎస్,సి ఆర్టి సోషల్ ఖాళీగా ఉన్నాయన్నారు. గమనిక: దరఖాస్తుదారులు బయోడేటా ఫారంతో పాటు విద్యార్హత సర్టిఫికేట్లు, కులధృవీకరణ పత్రాలు, ఆధార్ జెరాక్స్ కాపీలు జతచేసి, పూర్తిచేసిన దరఖాస్తులను సంబంధిత మండలంలో గల కేజిబివి ప్రిన్సిపల్స్ కి అందజేయాలి లేదా నేరుగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంనకు అందజేయవచ్చునీ అల్లూరి జిల్లాసమగ్ర శిక్షఅదనపు పథక సమన్వయకర్త డా.వి.ఎ.స్వామినాయుడు తెలిపారు

## పాడేరు గిరిజన సంక్షేమ శాఖ కు రెగ్యులర్ డీడీ నియమించాలి

**- బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు పాంగిరాజారావు విజ్ఞప్తి**

**పాడేరు, ఆగస్ట్ 6, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి.సంధ్యారాణికి పాడేరు గిరిజన సంక్షేమ శాఖడిప్యూటీ డైరెక్టర్ రెగ్యులర్ (లేదా )గ్రూప్ 1స్థాయి అధికారిని నియమించాలని అల్లూరి జిల్లా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు,బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు పాంగిరాజారావు విజ్ఞప్తి చేసారు. 2024 2025విద్య సంవత్సరాల కాలంలో అప్పటి డిప్యూటీ డైరెక్టర్ ను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంకు ఉన్నతాధికారులు బదిలీ చేసారు. దీంతో ఉన్నత అధికారులు తాత్కాలికంగా పాడేరు ఏటీడబ్ల్యుఓ ఎల్.రజిని ని ఎఫ్ఏసీ గా నియమించారు. ఆమె ఒక సంవత్సర కాలం పాటు పని చేసారు.ఆమె మన్యం జిల్లా కు బదిలీ పై వెళ్లారు.మరల అదే విధానం కొనసాగిస్తూ కొయ్యూరు ఏటీడబ్ల్యుఓగా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్ ను డీ డీ గా నియమించటం సమంజసం కాదని,నా అభిప్రాయం.గతంలో డీ డీ పోస్ట్ ఖాళీ ఏర్పడినపుడు ఇంచార్జ్ లు గా సబ్ కలెక్టర్ /గ్రూప్ 1అధికారుల్ని నియమించిన సందర్భాలు ఉన్నాయి.జిల్లా లో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తర్వాత అత్యంత ప్రాధాన్యత కల్గిన అధికారి డీడీ,ఏటీడబ్ల్యుఓ అనే అధికారి మండల స్థాయి లో హెడ్ మాస్టర్,వార్డెన్ మరియు డిప్యుటీ వార్డెన్స్ విధుల పర్యవేక్షణ చేస్తూ ఉంటారు.అటువంటి అధికారి తనతో పాటు పని చేస్తున్న ఏటీడబ్ల్యుఓ,హెడ్మాస్టర్స్ ను ఎలా నియంత్రణ చేయగలరనీ రాజారావు ప్రశ్నించారు.కావున పైన పేర్కొన్న విషయాన్ని పునః పరిశీలించి రెగ్యులర్ డీ డీ వీలు కానీ యెడల జిల్లా స్థాయి అధికారిని నియమించేందుకు చర్యలు తీసుకో వాలని అయన కోరారు.ఇదే అంశాన్ని గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్,అల్లూరి జిల్లా కలెక్టర్,పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వినతి పత్రం అందజేయడం జరిగిందనీ బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు పంగి రాజారావు తెలియజేసారు.

## మళ్లీ ఇంచార్జితోనే పాడేరు డీడీ పోస్ట్ భర్తీ

**- పాడేరు ఇంచార్జి డీడీగా క్రాంతి కుమార్ నియామకం**

**పాడేరు, ప్రభాతవార్త**



పాడేరు గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి ఉప సంచాలకులు పి.క్రాంతి కుమార్ నియమిస్తూ పాడేరు ఇంచార్జి ప్రాజెక్టు అధికారి డా.అభిషేక్ గౌడ ఉత్తర్వులు జారీ చేసారు.దీంతో ఇంచార్జి(ఎఫ్ఏసీ) డిడి గా క్రాంతి కుమార్ భాద్యతలు చేపట్టారు.కొయ్యూరు ఏటీడబ్ల్యుఓ గా విధులు నిర్వర్తిస్తున్న క్రాంతి కుమార్ ను ఇంచార్జి డీ డీ గా నియమించారు.క్రాంతికుమార్ జి.మాడుగు లఏటీడబ్ల్యుఓ గా విధులు నిర్వహిస్తూ సాధాణ బదిలీల్లో భాగంగా కొయ్యూరు బదిలీ అయ్యారు.డిడి ఇన్చార్జి క్రాంతి కుమార్ నియమించడంతో భాద్యతలు చేపట్టారు. ఇంచార్జి డీ డీ గా బాధ్యతలు నిర్వహించిన పాడేరు ఏటీడబ్ల్యుఓ రజనీ ని గుమ్మలక్ష్మి పురం ఏటీడబ్ల్యుఓ బదిలీ చేయడంతో జూలై 19న రిలీవ్ ఐ పాడేరు నుంచి బదిలీపై వెళ్లారు.సుమారు 25 రోజులుగా డిడి భాద్యతలు ఎవరికీ అప్పజెప్పి కుండా తాత్సారం చేస్తూ ఎట్టకేలకు డీ డీ పోస్టును ఇంచార్జి తోనే భర్తీ చేసారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years



## చీపురుపల్లి అడ్డాగా నాసిరకం సరఫరా..

### కోట్లాది రూపాయల దోపిడిని నిరూపించడానికి సిద్ధం.. మాజీ విప్ గద్దె బాబురావు..

చీపురుపల్లి ఆగస్టు 6 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో వసతి గృహాలకు సరఫరా అవుతున్న నాసిరకం వస్తువులను చీపురుపల్లి కేంద్రంగా చేసుకొని సరఫరా చేస్తున్నారని మాజీ విప్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి సెంట్రల్ పాయింట్‌గా చేసుకొని సుమారు 500 కోట్ల రూపాయల కుంభకోణం ఈ సరఫరాలో జరుగుతుందని ఆయన అన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు 75 కోట్ల రూపాయల టెండర్లను చీపురుపల్లి వాసులే తాజాగా దక్కించుకున్నారని ఆయన వివరించారు. రెండు రాష్ట్రాలకు టెండర్లు పలికిన సదరు వ్యాపారులు పనికిరాని పప్పు ముక్కిపోయిన కందిపప్పు పెసరపప్పు పసుపు వంటివి రెసిడెన్షియల్ స్కూల్ నవోదయ తదితర వస్తు గృహాలకు అంటగడుతూ అక్రమంగా ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నాసిరకం సరుకులు బండి పెడుతున్న కారణంగా పలు వసత గృహాల్లో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## సంక్షేమం ఎవరిదో.. ప్రజా వేదికలో తేల్చుకుందామా..

### కిమిడి నాగార్జునకు వైసీపీ శ్రేణుల సవాల్..

చీపురుపల్లి ఆగస్టు 6 ప్రభాతవార్త



వైసిపి పాలనలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలే ప్రస్తుతానికి కొనసాగుతున్నాయని, అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నప్పటికీ కూటమి పాలకులు చేసిన అభివృద్ధి ఏమీ లేదని చీపురుపల్లి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్ గా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలకులు నిలిచారని, వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన నుండి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన వరకు ప్రజా సంక్షేమ పథకాల కొరకు ప్రత్యేక కార్యరూపం చేశారని ఈ సందర్భంగా వారు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ సొంత డబ్బా కొట్టుకుంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజా వేదికకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు సవాల్ విసిరారు. డిసిసిబి ఛైర్మన్‌గా పదవిని చేపట్టిన కిమిడి నాగార్జున అవగాహన లేని ఆరోపణ చేయడం మానుకోవాలని హితవు పలికారు. గబిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలు ఇవ్వడం శ్రేయస్కరం : ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

మెరకముడిదాం, ఆగస్టు 6, ప్రభాతవార్త

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. బిడ్డకు పాలివ్వడం తల్లికి లాభమేనని బ్రెస్ట్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారి నుండి బయట పడొచ్చు అని తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన మెరకముడిదాం సచివాలయ ప్రాంగణంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాలు ఆవశ్యకతను తెలుపుతూ గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎం.ఎస్.కె సాధన అంగన్వాడీ కార్యకర్తలు గౌరీ, గాయత్రి, అప్పల రాము, వరలక్ష్మి, ఏఎన్ఎం కే.కోటేశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు సూర్య, లలిత, కుమారి, లబ్దిదారులు కలిసి ర్యాలీ నిర్వహించారు.

## బెంగాల్ టైపు వరి నాట్లతో రైతులకు ఎకరానికి 3 వేలు ఆదా చేయవచ్చు : ఏవో తిరుపతిరావు

పాచిపెంట,ఆగస్టు 6, ప్రభాతవార్త



సాంప్రదాయ వరి నాటడ ము కంటే వరుసలలో కుదురుకి ఒకటే లేదా రెండు మొనలు చివరలు తుంచి నాటుకుంటే ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని అలాగే చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారి కె తిరుపతి రావు అన్నారు. మండలంలో చెరుకుపల్లి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు ఎడ్ల సత్యం, పైల అప్పలనాయుడు వేయిస్తున్న బెంగాల్ వరి నాట్లను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య ఏ ఈ ఓ నాగమణి పాల్గొన్నారు.



## బుసాయివలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

రామభద్రపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త

బుసాయివలస, రామభద్రపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి తెలియజేయడం అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు జమ కాని రైతులు కొత్తగా రైతు సేవ కేంద్రంలో గ్రీవెన్స్ పెట్టుకోవడానికి అవకాశం కూడా కల్పించారు. ఎన్‌పిసిఐ లింకింగ్, భూమికి ఆధార్ లింకింగ్ కాని రైతులందరూ కూడా త్వరగా చేసుకుని గ్రీవెన్స్ పెట్టుకోవాల్సిందిగా తెలిపారు. ముచ్చర్లవలస గ్రామ సర్పంచ్ కనిమెరక శంకర్ రావు అలాగే గ్రామ రైతులు,వ్యవసాయ విస్తరణ అధికారి పి.వెంకటరమణ, బి రాజశేఖర్, జీ వరలక్ష్మి పాల్గొన్నారు.

## జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలి-ఇంచార్జ్ వబ్బిన

శృంగవరపుకోట,జులై6,ప్రభాతవార్త



ఎస్.కోట నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.విశాఖలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఇంచార్జ్ వబ్బిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతం కావాలంటే పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయమును అదేవిధంగా ప్రతీ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి జనసైనికులందరూ ఒక్క తాటిపై నిలిచి కృషి చేయాలని ఇది పవన్ కళ్యాణ్ ఆదేశాలని మంత్రి నాదెండ్ల సూచించారని వబ్బిన తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు సమస్యలను వబ్బిన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## అమ్మయ్య "అన్న క్యాంటీన్" నిర్మాణం మొదలైంది ...!

వార్త ప్రభావం

సాలూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త



సాలూరు నియోజకవర్గ ప్రజలు ఎప్పుడా ఎప్పుడా అని ఎదురు చూస్తున్న అన్న క్యాంటీన్ బాలారిష్టాలు దాటుకుని మొత్తానికి నిర్మాణం మొదలైంది. కొద్దిగా గతంలో వెళ్లిచూస్తే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి సంధ్యారాణి ఎంతో ప్రెస్టేజ్ ఇష్యూగా తీసుకొని పేద ప్రజలకు ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ పట్టణ ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో గత ఏడాది ఆగస్టు 14న భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ 50 శాతం నిర్మాణం పూర్తి చేసుకొని అన్న క్యాంటీన్ భవనం నిర్మాణం ఆగిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం అలాగే మంత్రి సంధ్యారాణి ఎన్నో విమర్శలు ఎదుర్కొంటున్నారు. అన్నాక్యాంటీన్ నిర్మాణ అంచనా వ్యయం 60 లక్షలు అయినప్పటికీ మొదటి విడతగా 8 లక్షల 50 వేలు బిల్లు మంజూరు అవడంతో క్యాంటీన్ నిర్మాణం మళ్లీ మొదలైనట్లుగా సమాచారం. ఏది ఏమైనప్పటికీ క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని ఎదురుచూస్తున్న పేద ప్రజలకు ఇది గుడ్ న్యూస్ గా టౌన్ లో టాక్ నడుస్తుంది.

## ఎనీమియాపై అవగాహన కార్యక్రమం

పార్వతీపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త



మండలంలోని బాలగుడబ గ్రామంలో ఎనీమియా యాక్షన్ కమిటీ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఎనీమియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఎనీమియా కారణం రక్తహీనత అని అన్నారు. రక్తహీనత నిర్మూలన రక్తహీనత సమస్యను పరిష్కరించడానికి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ కమిటీ కృషి చేస్తుందని అన్నారు. రక్తహీనత అనేది శరీరంలో ఎర్ర రక్త కణాలు తగినంతగా లేనప్పుడు లేదా హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నప్పుడు వచ్చే ఒక వ్యాధి అని వివరించారు. గర్భిణీలు, బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాది పొడవునా పంటలు పండించాలి

### జిల్లా వ్యవసాయ అధికారి(డి.ఎ.ఓ) డా.కె.రాబర్ట్ పాల్

గరుగుబిల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త



తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో జిల్లాలోని 15 మండలాలకు చెందిన వీఏఏలు, వీహెచ్ఏలు, ఏఈఓలకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడటం జరిగినది. వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో రైతులు వారి పూర్తి విస్తీర్ణంలో పంటలు పండించు కోవడం వలన ఆర్థికంగా అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన తొమ్మిది సార్వత్రిక సూత్రాలు గూర్చి వివరించడం జరిగినది. నేలల్లో జీవం కోల్పోకుండా విష రహిత పదార్థాలు ఉపయోగించుకుంటూ ప్రకృతిని, భూమాతను కాపాడినవారు అవుతారని రైతులకు మనం అందించే గొప్ప కానుకగా అభివర్ణించవచ్చని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఏఈఓలు, ఎన్ఎఫ్ఏలు, ట్రైనర్లు పాల్గొన్నారు.



## తూప్రాన్ గ్రామానికి గద్దర్ అన్న పేరు పెట్టాలి..

### జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటానా..

చీపురుపల్లి ఆగస్టు 6, ప్రభాతవార్త

ప్రజా గాయకుడు గద్దర్ జన్మించిన తూప్రాన్ గ్రామానికి గద్దర్ అన్న పేరును పెట్టాలని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటల అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం గద్దర్ మరణించి రెండు సంవత్సరాలు జరిగిన సందర్భముగా రావివలసలోని తన స్వగృహంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ పార్టీ నెల్లిమర్ల ఇన్చార్జి ఎరుకొండ వెంకటరావు, ఓరి రమేష్ బహుజన నాయకులు బోనెల కాముడు, పూలమాలను వేసి జోహార్లు తెలుపుతూ నివాళిలు అర్పించారు.

## కల్తీ ఫుడ్ హొటల్స్‌పై ఉక్కుపాదం : శానిటరీ ఇన్స్పెక్టర్

సాలూరు, ఆగస్ట్ 6 ప్రభాతవార్త



సాలూరు పట్టణంలో ఉన్న పరిశుభ్రత పాటించని నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు అమ్మకాలు జరుపుతున్న హొటల్స్‌పై శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ సిబ్బందితో మెరుపు దాడులు చేశారు. కమీషనర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణములో ఉన్న పలు హొటల్స్‌పై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు హొటల్స్ ఇంకా షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు విని యోగిస్తున్నం దుకు 3 వేలు అపరాధ రుసుము విధించామని స్థానిక విలేకరులకు ఇన్స్పెక్టర్ తెలియజేశారు.శానిటేషన్ సిబ్బంది,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గిరిజనుల బ్రతుకులు పాడుచేయకండి.. ఇది మీకు న్యాయం కాదు

### మాజీ ఎమ్ఎల్ఏ సంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, మాజీ డిప్యూటీ సిఎమ్ రాజన్నదొర

రామభద్రపురం, ఆగస్ట్ 6 ప్రభాతవార్త



విజయనగరం జిల్లా రామభద్రపురం కొట్టక్కి పరిధిలో ఉన్న గిరిజన భూములపై కూటమి ప్రభుత్వం కన్నేసిందని ఆర్.ఓ.ఎఫ్. ఆర్ పట్టాల భూములను గిరిజనల నుంచి ఎం.ఎస్.ఎం.ఈ పార్కుల పేరుతో అధికారులు స్వాధీన పరుచుకుంటున్నారని దౌర్జన్యంగా భూములు లాక్కుంటున్నారని గిరిజనులు పోరాటానికి దిగారు. గిరి ప్రజలకు మద్దతుగా సంబంధిత భూములను మాజీ శాసన సభ్యులు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మండల యువజన అధ్యక్షులు పత్తిగుల్లా ఎకనాథ్, ఎంపిపి లక్ష్మణరావు, బలస శ్రీను, మజ్జి రాంబాబు, కారేడు వలస, కాకర్లవలస, మూడు గ్రామాల గిరిజనులు హాజరు అయ్యారు.

## దివ్యాంగుల వనరుల కేంద్రానికి సౌండ్ సిస్టం వితరణ

బాడంగి, ఆగస్ట్ 6 ప్రభాతవార్త



స్థానిక బాడంగి జడ్పీ పాఠశాలలో ఉన్న సెకండరీ దివ్యాంగుల వనరుల కేంద్రానికి బూసాయవలస గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర బోర్వెల్స్ ఓనర్ మచ్చెట్టి శ్రీను,అనూష దంపతులు 20 వేలు విలువగల సౌండ్ సిస్టం,2ఫ్యాన్లు వితరణ చేసారు ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు మాట్లాడుతూ వెంకటేశ్వర బోర్వెల్స్ వారు ప్రతీ ఏడాది దివ్యాంగులకు ఆర్థిక సాయం చేస్తూనే దివ్యాంగుల వనరుల కేంద్రానికి, పాఠశాల అవసరాల నిమిత్తం గతంలో కూడా 25చైర్స్,కలర్ ప్రింటర్ వితరణ చేశారని వీరిలా దాతలు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. దాతలను ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఉపాధ్యాయులు యు.రామారావు, ఎం.శ్రీనివాసరావు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులు సత్ప్రవర్తన నేర్చుకోవాలి : సిఐ

బొబ్బిలి, ఆగస్టు 6, ప్రభాతవార్త

పట్టణ పరిధిలో తాండ్రపాపారాయుడు జూనియర్ కళాశాల విద్యార్థులతో బొబ్బిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ కటకం సతీష్ కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలని విద్యార్థులతో సోదరభావంగా మెలగాలని మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు మన దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా మీరు మీ ప్రవర్తన మార్చుకున్న నాడే సమాజం బాగుపడుతుందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

## నానో యూరియా, డిఏపి వాడండి..

చిట్టాయవలస, ఆగస్టు 6, ప్రభాతవార్త




నానో యూరియా, డిఏపి ద్రవరూప ఎరువులు వాడకం ఎంతో ప్రయోజనకరమని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.నిర్మలా జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని చిట్టాయవలస గ్రామంలో పొలంబడి, పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నానో ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. డిఏపి బస్తా ధరతో పోల్చితే నానో యూరియా డిఏపి ధర తక్కువగా ఉంటుందన్నారు. డిఏపి ఉండే సమపాల నత్రజని, భాస్వరం అందజేస్తాయని తెలిపారు. వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో ఒకరికి రెండేళ్లు జైలు శిక్ష..

గజపతినగరం, ఆగస్టు 6, ప్రభాతవార్త

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి రెండేళ్లు జైలు శిక్ష ,నాలుగు లక్షలు రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు అధికారులు అందించిన వివరాలు ప్రకారం, విజయనగరం నకు చెందిన కింతాడ అప్పారావు తాను చెల్లించాల్సిన మొత్తానికి గాను, రెండు లక్షల రూపాయలు చెక్కు గజపతినగరం మిహిర చిట్స్ సంస్థకు అందజేశారు. ఈ చెక్కు బౌన్స్ కావడంతో మిహిర చిట్స్ సంస్థకు చెందిన మక్కువ శ్రీధర్ కోర్టును ఆశ్రయించారు. అనేక వాదోపవాదాలు అనంతరం మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ కింతాడ అప్పారావుకు జైలుశిక్ష, జరిమానా విధించారు.



## పక్కి వెటర్నరీ డిస్పెన్సరీ ఎమ్మెల్యే పరిశీలన

బొబ్బిలి, ఆగస్టు 6, ప్రభాతవార్త

మండలంలో పక్కి వెటర్నరీ ఆసుపత్రి పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్ వివిఎస్‌కేకే బుధవారం పరిశీలించారు. ఈ ఆసుపత్రి నిర్మాణం చాలా ఏళ్లయింది శిథిలావస్థకు చేరుకుంది దీన్ని నాబార్డ్ నిధులతో నూతనంగా నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ నివేదిస్తానని ఎమ్మెల్యే ఆర్‌విఎస్ కే కే రంగారావు అన్నారు. బుడ చైర్మన్ టెంటు లక్ష్మీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ బిడ్డకు తల్లిపాలు ముఖ్యం-ఎమ్మెల్యే

శృంగవరపుకోట, జూలై6, ప్రభాతవార్త



పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. బుధవారం ఎస్.కోటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన ఆరోగ్య పరంగా బిడ్డ ఎదుగు దలకు ఎంతో అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు,రాష్ట్ర టూరిజం డైరెక్టర్ సుధారాణి,ఐసీడీఎస్ పీఓ,సర్పంచ్ సంతోషికుమారి పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ భూముల సర్వే, టేకు చెట్లు విలువల నివేదిక సమర్పించండి : సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవస్తవ

కొమరాడ, ఆగస్టు 6, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న అగ్రి గోల్డ్ భూములకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవస్తవ అన్నారు. బుధవారం చొల్లపదం, ఉలిపిరి పంచాయతీల పరిధిలో ఉన్న 75 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను, టేకు తోటలను పరిశీలన చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు, సిఐడి అధికారులు, అటవి శాఖ అధికారులతో సంయుక్తంగా అగ్రిగోల్డ్ భూములను టేకు తోటలను పరిశీలన చేశారు. అగ్రిగోల్డ్ భూములు ఉన్న 75 ఎకరాల్లో రికార్డుల్లో తప్పిదాలు ఉన్నాయా సక్రమంగా ఉన్నాయా అనే వివరాలు స్థానిక రెవెన్యూ అధికారులు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక రైతుల జరైతే అగ్రిగోల్డ్ భూములుగా ఆన్లైన్లో నమోదయి ఉన్నాయని తెలిపారు. ఆ రైతులు తమ భూములను తమ పేరు మీదకు మార్చాలని అనేకసార్లు సమస్యలను రెవెన్యూ అధికారులు దృష్టిలో పెట్టినట్లు తాహసిల్దార్ సబ్ కలెక్టర్ దృష్టిలో పెట్టారు. తాసిల్దార్ సిహెచ్ సత్యనారాయణ, మండల సర్వేయర్ వంశీకృష్ణ, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మహేంద్ర, బీట్ అధికారి సత్యనారాయణ, సిఐడి అధికారులు స్థానిక పోలీసులు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## రాజకీయ పార్టీలు తమ ఏజెంట్ల పేర్ల జాబితాను సమర్పించాలి..

నెల్లిమర్ల, ఆగస్టు 6, ప్రభాతవార్త



రాజకీయ పార్టీలు నియోజకవర్గంలోని 248 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి తమ పోలింగ్ ఏజెంట్ల పేర్ల జాబితాలను సత్వరమే తమ కార్యాలయానికి అందజేయాలని నెల్లిమర్ల నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ కే. శ్రీకాంత్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. తహసిల్దార్ శ్రీకాంత్ మాట్లాడారు. ఓటర్ల జాబితాలో చేర్పులు తొలగింపులకు సంబంధించి ఆన్ లైన్ ద్వారా గాని, నేరుగా బి.ఎల్.ఓ.లు దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. అలాగే భవనాలు శిథిలవస్తకు చేరుకున్న కారణంగా పోలింగ్ స్టేషన్ భవనాలు మార్పు అనివార్యమైతే ఆ వివరాలను కూడా తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు గేదెల రాజారావు (తెలుగుదేశం), పతివాడ రాజేష్ (బిజెపి), ఎం. పాపారావు (సిపిఐ), కిల్లంపల్లి రామారావు (సిపిఎం), కనకల పద్మనాభం (కాంగ్రెస్), ఎరుకొండ వెంకటరావు (బిఎస్పి), ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దారు వివిఆర్ జగన్నాధ రావు, సిబ్బంది సత్తిబాబు ,భాస్కరరావు, మహేష్, మధు, పైడినాయుడు, ఈశ్వర రావు, సూరి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్- కారు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

గుర్ల, ఆగస్టు 6, ప్రభాతవార్త

విజయనగరం-పాలకొండ రోడ్డులో గుర్ల స్మశానవాటిక దగ్గరలో బుధవారం మహీంద్రా తార కారు ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు ఇచ్చిన వివరాలు మేరకు చీపురుపల్లి నుండి విజయనగరం వైపు 20మంది ప్రయా ణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు విజయ నగరం నుండి గరివిడి వైపు వెళ్తున్న మహీంద్రా తార కారు అదుపు తప్పి ఢీకొన్నాయి. కారు వేగంగా బస్సుకు ఎదురుగా రావడంతో గమనించిన ఆర్టీసీ డ్రైవర్ కారును తపించే ప్రయత్నంలో బస్సును రోడ్డు ప్రక్కకు నడపడంతో ఒక్కసారిగా మట్టి కుంగి బస్ బోల్తాపడింది. ప్రమాద సమయంలో బస్‌లో 20 మంది ప్రయాణికులు ఉండగా వారిలో జె.శాంతమ్మ, పెంతమ్మ, నాగరాజు, రాము, సూర్య, శ్రీదేవి, బంగారమ్మలకు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు నడుపుతున్న గుర్ల మండలంలో గల గరిడ గ్రామం సర్పంచ్ తిరుమరెడ్డి సూరిబాబుకు బలమైన గాయాలు కావడంతో అతన్ని, ప్రమాదానికి గురైన ప్రయాణికులను108 వాహనంలో విజయనగరం మహారాజ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ రావు తెలిపారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం, ఆగస్టు 6, ప్రభాతవార్త

గజపతినగరం, జిన్నాము సబ్ స్టేషన్ పరిధిలో గల 33 కెవి ఫీడర్లు మరమ్మత్తు పనులు చేపడుతున్న కారణంగా 8వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు గజపతినగరం, పురిటిపెంట, ఎం. వెంకటాపురం, సీతారాంపురం, శ్రీరంగరాజపురం, కాలం రాజుపేట, డోలపాలెం, ఎన్టీఆర్ పురం, మధుపడ, మరుపల్లి, తమ్మారాయుడిపేట, ఎం.గుమ్మడం, గుడివాడ, భూదేవిపేట, బంగారమ్మపేట, పాతబగ్గం, కొత్తబగ్గం, సాలిపేట, చిట్టయ్య వలస, పట్రువాడ, దావాలపేట, బూడిపేట, కొనిస, గంగచొల్లపెంట, లింగాలవలస, జిన్నాం, ముచ్చర్ల, వేమలి, లోగిస, కెంగువ, రామన్నపేట, రంగుపురం, ఎం. కొత్తవలస, మల్లు నాయుడుపేట, కొండపేట, తుమ్మకాపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.రఘు బుధవారం తెలిపారు. ఈ అంతరాయాన్ని ఈ గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## తల్లిపాలతోనే శిశువుకు మెరుగైన ఆరోగ్యం

నెల్లిమర్ల, ఆగస్టు 6, ప్రభాతవార్త



తల్లిపాలతోనే శిశువుకు మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.పి శిరీష అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సిడిపిఓ జి.ప్రసన్న ఆదేశాల మేరకు మండలంలోని కొండవెలగాడ సెక్టార్లో సూపర్వైజర్ బొద్దల శారద ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. డా.శిరీష బాలింతలను, గర్భిణీలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రసవం అయిన గంటలోపే తల్లి ముర్రె పాలు శిశువుకు పట్టాలని, తల్లిపాలు శిశువుకు దివ్య ఔషధం లాంటివని అన్నారు. మహిళా గర్భం దాల్చిన తర్వాత 9 నెలలపాటు పౌష్టికాహారం తీసుకోవాలని బంగారు బిడ్డలకు జన్మనివ్వాలని ఆమె సూచించారు. సూపర్వైజర్ శారదతో పాటు సర్పంచ్ గదల బంగారమ్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ బోధకులు, పలువురు బాలింతలు గర్భిణీలు పాల్గొన్నారు.

## ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి..



కురుపాం, ఆగస్ట్ 6, ప్రభాతవార్త

ఆన్లైన్‌లో అధికంగా మోసాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండలని నీలకంఠాపురం ఎస్ఐ నీల కంటారావు అన్నారు. బుధవారం మండలంలోని ధర్మలక్ష్మిపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత, సమాజంలో జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, ఫోక్స్ ఆక్ట్ గురించి వివరించి అవగాహన కల్పించారు.

## చీపురుపల్లి ఏఎంసి డైరెక్టర్లుగా గొట్టిముక్కల, కుమరాపు

గరివిడి, ఆగస్టు 6, ప్రభాతవార్త



చీపురుపల్లి ఏఎంసి డైరెక్టర్లుగా గరివిడి మండల సీనియర్ టిడిపి నాయకులు గొట్టి ముక్కల సత్తిరాజు, కుమరాపు రమణలు నియా మకం అయ్యారు. గతంలో ఏఎంసి డైరెక్టర్‌గా వ్యవహరించిన సత్తిరాజు రెండవ సారి డైరెక్టర్‌గా నియామకం అయ్యారు. కాగా గెద్దపువలస గ్రామంలో సీనియర్ టిడిపి నాయకునిగా కొనసాగుతున్న రమణ పార్టీ బలోపేతం ధ్యేయంగా పనిచేస్తున్న నేపథ్యంలో ఆయనకు అధిష్టానం డైరెక్టర్‌గా నియమించింది. సత్తిరాజు, రమణ లకు పలువురు దేశీయులు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి.. భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ




నెల్లిమర్ల, ఆగస్టు 6, ప్రభాతవార్త

సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళ సంరక్షణ కార్యదర్శులు విధుల్లో అంకిత భావం ప్రదర్శించి ప్రశంసలు అందుకోవాలని భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ సూచించారు. నెల్లిమర్ల మండలం, నగర పంచాయతీలో పనిచేసే ఇటీవల బదిలీపై వెళ్లిన 24 మందికి నెల్లిమర్ల పోలీసులు ఆధ్వర్యంలో బుధవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వీడ్కోలు సత్కారం జరిగింది. నెల్లిమర్ల ఎస్ఐ బి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిఐ రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బదిలీ అయినా మహిళా సంరక్షణ కార్యదర్శులకు దుస్సాలువులతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు మహిళా కార్యదర్శి కష్టపడి పని చేయాలని అన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించడంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు బాధ్యత కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల, పూసపాటిరేగ ఎస్.ఐలు గణేష్, దుర్గాప్రసాద్, ఏ.ఎస్.ఐలు ఏ.సత్యనారాయణ (సతీష్), రమణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లిమర్ల పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి.. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్

నెల్లిమర్ల, ఆగస్టు 6, ప్రభాతవార్త



మండల కేంద్రం, నగర పంచాయతీ కేంద్రం నెల్లిమర్లలోని అర్హులైన వందలాది మంది పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ పతివాడ రాజేష్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన నెల్లిమర్ల తహసీల్దార్ కే శ్రీకాంత్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. నెల్లిమర్లలో సొంత ఇల్లు గాని, సొంత స్థలాలు గాని లేని పేదలు వందల మంది ఉన్నారని ఆయన వివరించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అందరికీ ఇల్లు పథకంలో భాగంగా అధికారులు సర్వే నిర్వహించి 1430 మంది పేదలను గుర్తించారని రాజేష్ వివరించారు. వారికోసం పంపిణీకి చంపావుతున్నది ఒడ్డున కొండ ప్రాంతంలో స్థలాన్ని గుర్తించి, లక్షలాది రూపాయలతో చదును చేశారని రాజేష్ అన్నారు. అయితే ఇప్పటికీ ఆ స్థలాలు లబ్ధిదారులకు అప్పగించ లేదని ఫలితంగా పేదలు అద్దె ఇళ్లలోనే మగ్గుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మంచి జరుగుతుందని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీలో పేదలకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దోమ కామేశ్వరి, నడిపేన నారాయణమూర్తి, రాజేష్, దోమ నాగర్జున, తదితరులు పాల్గొన్నారు.

07-08pg10exHMNWJQE.qxd:07-08pg10exHMNWJQE.qxd 1/1/02 8:14 AM Page 1



## జాతీయ హాకీ ఛాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు
# యుపి, పంజాబ్, జార్ఖండ్, ఎంపి



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా 15వ సబ్ జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ హాకీ జట్టు దాద్రా నాగర్ హావేలి డామన్ డయ్యూ హాకీపై 4-1 తేడాతో విజయం సాధించింది. అలీ షారుఖ్ (6, 23) రెండు గోల్స్‌తో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించగా, రాజ్‌భర్ ప్రహ్లాద్ (42) మరియు మొహమ్మద్ అతిఫ్ రేనీ (58) కూడా గోల్స్ సాధించారు. కెప్టెన్ ధీరజ్ పాల్ (39) దాద్రా దయ్యూ తరపున ఒక గోల్ చేశాడు. అత్యధిక స్కోరుతో కూడిన పోటీలో, హాకీ పంజాబ్ 4-3 తేడాతో ఒడిశా హాకీ అసోసియేషన్‌ను ఓడించి సెమీఫైనల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఒడిశా కెప్టెన్ మన్దీప్ కెర్కెట్టా (10, 27, 41) తన జట్టును ప్రారంభంలోనే ఆధిక్యంలోకి నెట్టి హ్యాట్రిక్ సాధించాడు. కెప్టెన్ అర్ష్‌దీప్ సింగ్ (14) పంజాబ్ తరపున స్కోరును ముందుగానే సమం చేయడంతో వరీందర్ సింగ్ (39), అనురాగ్ సింగ్ (42), సుఖ్‌దేవ్ సింగ్ (58) విజయాన్ని సాధించారు. జార్ఖండ్ జట్టు చండీగఢ్‌ను 13-0 తేడాతో ఓడించింది. హెమ్రోమ్ టింటస్ (18, 30, 44, 45, 60) ఐదు గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచాడు, దీనికి సబియన్ కిరో హ్యాట్రిక్ (1, 22, 37), హస్నా పాత్రస్ బ్రేస్ (5, 9) మద్దతు ఇచ్చాడు. గంగా టోప్నో (49), ఆశిష్ తని పూర్తి (53), మరియు అనిష్ డంగ్‌డుంగ్ (57) కూడా గోల్స్ సాధించారు. దీంతో ఛత్తీస్‌గఢ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పంజాబ్, హార్యానా హాకీ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి.

## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ మహిళా బాక్సర్లకు 9 పతకాలు




**న్యూఢిల్లీ:** అండర్ 19, ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత మహిళల బాక్సింగ్ బృందం పది వెయిట్ విభాగాలలో తొమ్మిదింటిలో పతకాలను ఖాయం చేసుకుంది. వీరిలో యక్షి క (51 కిలోలు), నిషా (54 కిలోలు), ముస్కాన్ (57 కిలోలు), విని (60 కిలోలు), నిషా (65 కిలోలు), ఆకాంక్ష ఫలస్వాల్ (70 కిలోలు), ఆర్తి కుమారి (75 కిలోలు) థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన బౌట్లలో ఘన విజయాలతో సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకున్నారు. మరోవైపు, కృతికా వాసన్ (80 కిలోలు) మరియు ప్రాచి టోకాస్ (80+ కిలోలు) క్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో బై పొందారు. అయితే, సుమన్ కుమారి (48 కిలోలు) ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మప్తునా ముసుర్మోనోవా చేతిలో 2-3 తేడాతో చాలా దగ్గరగా తన క్వార్టర్ ఫైనల్ పోరులో ఓడిపోయింది. కానీ, యక్షి క తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో మరో ఉజ్బెక్ ప్రత్యర్థి అలీవా ముక్తాసర్‌పై 3-2 తేడాతో మంచివిజయంతో భారత్ తరపున విజయాల పరంపరను ప్రారంభించింది. తరువాత, నిషా (54 కిలోలు) మరియు విని తమ కిర్గిజ్స్తాన్ ప్రత్యర్థులపై రెండు ఆధిపత్యంసాధించారు. దీంతోముస్కాన్ ఉజ్బెక్ బాక్సర్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఏకగ్రీవవిజయం సాధించి ఉదయం సెషన్‌ను ముగించింది.

## హాండ్రెడ్ లీగ్‌లో
# ఇన్విన్సిబుల్ ఘన విజయం
### 6 వికెట్ల తేడాతో లండన్ ఓటమి
### వార్నర్, కేన్ విలియమ్సన్ దారుణ ప్రదర్శన

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ వేదికగా ప్రారంభమైన హాండ్రెడ్ లీగ్ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ఇన్విన్సిబుల్ ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఓవల్ ఇన్విన్సిబుల్స్, లండన్ స్పిరిట్ మధ్య పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇన్విన్సిబుల్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్, ఇన్విన్సిబుల్స్ బౌలర్లు రషీద్ ఖాన్ (20-15-11-3), సామ్ కర్రన్ (19-10-18-3), జోర్డన్ క్లార్క్ (10-6-8-2) చెలరేగడంతో 94 బంతుల్లో 80 పరుగులకే కుప్పకూలింది. బెహ్రెన్‌డార్ఫ్, నాథన్ సౌటర్ తలో ఒక వికెట్ తీశారు. ఇక లండన్ ఇన్సింగ్స్‌లో ఆస్టన్ టర్నర్ (21), ర్యాన్ హిగ్గిన్స్ (12), మ్యాడ్సన్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. అంతర్జాతీయ స్టార్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) దారుణంగా విఫలమయ్యారు.

అనంతరం 81 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇన్విన్సిబుల్స్ ఆడుతూ పాడుతూ విజయతీరాలకు చేరింది. విల్ జాక్స్ 24, సామ్ కర్రన్ 14 పరుగులు చేసి ఇన్విన్సిబుల్స్‌ను గెలిపించారు. ఈ జట్టు కేవలం 69 బంతుల్లోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. సామ్ బిల్లింగ్స్ 6, డొనొవన్ ఫెరెయిరా 9 పరుగులతో అజేయంగా నిలిచారు.

లండన్ బౌలర్లలో డాసన్ 2 వికెట్లు, వార్రల్, టర్నల్ తలో వికెట్ తీశారు.



# విండీస్ సిరీస్‌కు స్టార్స్ ఔట్
## బుమ్రా టు నాయర్ డౌట్
## టీమిండియాలో ఛేజింగ్స్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ముగిసింది. ఇప్పుడు డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో టీమ్‌ఇండియా ఆడే తదుపరి సిరీస్‌పై పడింది. ఈ సైకిల్‌లో భారత్ తదుపరి స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ టెస్టు మ్యాచ్ అక్టోబర్ 2 నుండి 14 వరకు జరగనుంది. వెస్టిండీస్‌తో తలపడే శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో టీమిండియాలో కీలక మార్పులు చేసే దిశగా భారత్ క్రికెట్ బోర్డు సెలక్టర్లు కసరత్తు చేస్తున్నారు. దీంతో ఇంగ్లాండ్‌లో రాణించిన జట్టులో ఉన్న ఆటగాళ్లలో కొందరికి వెస్టిండీస్ టెస్టులో చోటు దక్కకపోవచ్చు. ఎనిమిదేళ్ల తరువాత భారత జట్టులో చోటు దక్కించుకున్న కరుణ్ నాయర్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాలుగు మ్యాచ్‌లు ఆడి 21.83 సగటుతో 205 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉంది. కీలకమైన మూడో స్థానంలో పలు మ్యాచ్‌లో ఆడినప్పటికి కూడా అక్కడ కూడా రాణించలేకపోయాడు. ఇంగ్లాండ్ పర్యటనకు అనూహ్యంగా శార్దూల్ ఠాకూర్ ఎంపిక అయ్యాడు. ఈ స్టార్ ఆల్‌రౌండర్ రెండు మ్యాచ్‌లు ఆడి కేవలం రెండు వికెట్లు మాత్రమే తీశాడు. నాలుగో టెస్టులో 41 పరుగులు చేయడమే ఈ సిరీస్‌లో అతడు బ్యాటింగ్‌లో ఇచ్చిన ఏకైక సహకారం. కండిషన్స్ దృష్ట్యా కూడా విండీస్ టెస్టులో అతడికి చోటు దక్కకపోవచ్చు. ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్ గాయాల కారణంగా అనూహ్యంగా సిరీస్ మధ్యలో అన్షుల్ కాంబోజ్‌ను ఎంపిక చేశారు. ఈ పేసర్ నాలుగో టెస్టు మ్యాచ్‌లో అరంగ్రేటం చేసినప్పటికి పెద్దగా ఆకట్టుకోలేదు. ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ ఉండడంతో విండీస్‌తో సిరీస్‌లో ఇతడికి చోటు దక్కకపోవచ్చు. ఇక వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లాండ్ మ్యాచ్‌లో కేవలం 3 బుమ్రా ఆడాడు. దీని తరువాత పలు కీలక సిరీస్‌లు ఉండడంతో బుమ్రాకు స్వదేశంలో జరిగే విండీస్‌తో సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చు. కాగా రిషబ్ పంత్ గాయపడడంతో అతడి బ్యాకప్‌గా ఇంగ్లాండ్ పర్యటన మధ్యలో జగదీశన్ వచ్చాడు. ఇతడికి విండీస్ సిరీస్‌లో చోటు దక్కడం అనుమానమే. జిమ్ సెషన్‌లో గాయపడడంతో ఇంగ్లాండ్ పర్యటన మధ్యలోనే నితీశ్ కుమార్ వచ్చేశాడు. అతడు కోలుకునేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. నాలుగో టెస్టులో రివర్స్ స్వీప్ షాట్ ఆడుతూ గాయపడిన రిషబ్ పంత్‌కు ఈ సిరీస్‌లో విశ్రాంతి ఇవ్వొచ్చు.




## ఐసిసి ర్యాంకింగ్స్‌లో
# బుమ్రా నంబర్ 1
### టాప్ 5కు జైస్వాల్.. 12 స్థానాలు ఎగబాకిన సిరాజ్



**న్యూఢిల్లీ:** ఐసీసీ ర్యాంకింగ్‌లో టెస్ట్ బౌలర్ల జాబితాలో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న రబాడ కంటే బుమ్రా ఖాతాలో 38 రేటింగ్ పాట్లు ఎక్కువగా ఉన్నాయి. పాట్ కమిన్స్ 3, మాట్ హెన్రీ 4, జోష్ హేజిల్‌వుడ్ 5వ స్థానంలో ఉన్నారు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ టాప్ 5లో చోటు దక్కించుకున్నాడు. టీమిండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ 12 స్థానాలు ఎకబాకాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బుధవారం ర్యాంకింగ్‌లను విడుదల చేసింది.ఐదవ టెస్ట్‌లో సెంచరీ సాధించిన ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో 3 స్థానాలు ఎగబాకాడు. అతను టాప్ 5లో చేరాడు. అతను ఇంతకు ముందు 8వ స్థానంలో ఉన్నాడు. మరియు ఇప్పుడు 792 రేటింగ్‌తో ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. నంబర్ 1 టెస్ట్ బ్యాట్స్‌మన్ కిరీటం జో రూట్ వద్దే ఉంది, అతను 5వ టెస్ట్‌లో సెంచరీ కూడా సాధించాడు. కాగా ఇంగ్లాండ్‌తో జరిగిన 5వ టెస్ట్‌లో సిరాజ్ మొత్తం 9 వికెట్లు తీశాడు. సిరీస్ లో బెస్ట్ బౌలింగ్ తో 23 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచిన సిరాజ్ 674 రేటింగ్‌తో టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్‌లో 15వ స్థానంలో ఉన్నాడు. ఇంతకు ముందు 27వ స్థానంలో ఉన్నాడు. అలాగే బౌలింగ్ ర్యాంకింగ్‌లో రవీంద్ర జడేజా 3 స్థానాలు కోల్పోయి 14 నుంచి 17వ స్థానానికి పడిపోయాడు.

# రెపోరేట్లు యధాతథం
### ట్రంప్ సుంకాల వార్నింగ్..అంతర్జాతీయ ధోరణులే కీలకం!



**ముంబయి, ఆగస్టు 6:** వడ్డీరేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన రిజర్వుబ్యాంకు ఈసారి మాత్రం అప్రమత్తంగా వ్యవహరించింది. ట్రంప్ ట్యారిఫ్ హెచ్చరికలు, అంతర్జాతీయ పరిణామాల రకమంలో వడ్డీరేట్లను యధాతథంగా 5.5శాతం వద్దనే ఉంచింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ద్రవ్యపరపతి విధాన సమీక్ష వివరాలను తెలిపారు. ద్రవ్యోల్బణం అంచనాలకు మించి తగ్గినప్పటికీ అమెరికా ట్యారిఫ్‌లపై అనిశ్చితులు ఇంకా తొలగ లేదని ఆర్బీఐ గవర్నర్ అన్నారు. అందువల్లనే రెపోరేటును యధా తథంగా 5.5శాతంవద్దనే ఉంచాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిందన్నారు. ఇక స్థిరమైన విధాన వైఖరిని కమిటీ మరికొంతకాలం కొనసాగిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్‌పాయింట్లమేర తగ్గించిన ఆర్‌బిఐ జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లుకోత పెట్టింది. దీనితో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రెపోరేటు ఒకశాతంవరకూ దిగివచ్చింది. రుతు పవనాలు సమృద్ధిగా కొనసాగుతున్నందున ఆర్థి కవ్యవస్థలో కొంత ఉత్తేజం ఉందని, సాధారణం కంటే సగటు వర్షపాతం ఎక్కువ నమోదయిందని, ద్రవ్యోల్బణం మరింత దిగివస్తుందని, ఆర్థికవ్యవస్థకు మరింత ఊతం ఇస్తుందని ఎంపిసి భావించింది.ప్రస్తుత ద్రవ్యోల్బణం స్థిరంగా 4శాతం వద్దనే ఉంది. 2025-26 ఆర్థికసంవత్స రానికిగాను ద్రవ్యోల్బణం 3.1శాతంవరకూ దిగిరావచ్చని అంచనా. కరెంటుఖాతాలోటు స్థిరమైన స్థాయిలోనే ఉండే అవకాశం ఉంది. వ్యవస్థలో ద్రవ్యలభ్యత మిగులుస్థాయిలోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధిరేటు 6.5శాతంగా ఉంటుందని, భౌగోళిక ఆర్థిక రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి కొంతమేర ఆటంకంగా మారే ప్రమాదం ఉన్నా భారత ఆర్థికవ్యవస్థ స్థిరంగా ముందుకువెళుతున్నదని ధరల స్థిరీకరణ కొనసాగుతోందన్నారు. బ్యాంకు లాకర్లలో ఉంచిన వస్తువులు,ఖాతాలకు సంబంధించి క్లెయిమ్ పరిష్కారాన్ని ఆర్బీఐ ప్రామాణీకరించనున్నట్లు ప్రకటించింది.


## ఇకపై మ్యూల్ ఖాతాల సెటిల్‌మెంట్లు ఈజీ..

**ముంబయి, ఆగస్టు 6:** మరణించిన వ్యక్తులకు చెందిన బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించి క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను ఆర్‌బిఐ ప్రామాణీకరిస్తోంది. మరణించిన వ్యక్తుల ఖాతాలు లాకర్ల పరంగా నామినీల క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ప్రక్రియను సులభతరంచేయనుంది. మరణించిన వారి బ్యాం కు ఖాతాల్లోని నగదు, లాకర్లలోని ముఖ్యమైన వస్తువులను తమ వారికి సులువుగాచేరవేయడం లక్ష్యంగా ఈవిధానం మారుస్తున్నట్లుగవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆర్‌బిఐఎంపిసి నిర్ణయాలను వెల్లడించిన ఆయన మాట్లాడుటూ బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టం 1949 ప్రకారం మరణించిన వ్యక్తుల ఖాతాల్లోని నగదు, లాకర్లు,సేఫ్‌కస్టడీలోని వస్తువులు నామినీకి చెందుతాయి. నామినీ లేదా చట్టబద్ధ వారసులుచేసే క్లెయిమ్‌లను పరిష్కరించడమే దీని ఉద్దేశ్యమని ప్రస్తుతం వివిధ బ్యాంకులు వేరువేరు పద్ధతులు అవలంబిస్తున్నాయని, ఒక్కోబ్యాంకు ఒక్కో డాక్యుమెంట్ అడు గుతున్నాయన్నారు. కానినీ లేని ఖాతాల పరంగా ఒక్కోబ్యాంకు ఒక్కోపద్ధతిపాటిస్తున్నాయి. ఇకపై అన్ని బ్యాంకుల్లోను ఒకే డాక్యుమెంటేషన్‌ప్రక్రియ ఉండటంతో పాటు ఇది సులువుగా ఉండేలా ముసాయిదా సర్క్యులర్ త్వరలో జారీచేయనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. దీనిపై ప్రజలనుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం జారీచేసే ట్రెజరీ బిల్స్ సిప్ పద్ధతిలో పెట్టుబడులు పెట్టే వెసులుబాటును రిటైల్ డైరెక్ట్ వేదిక ద్వారా రిటైల్ ఇన్వెస్టర్లకు కల్పించనున్నట్లు తెలిపారు.

## ట్రంప్ సుంకాల ప్రభావం తక్కువే



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం మేర సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తామని, 24 గంటల్లో మరిన్ని సుంకాలు తప్పవని ట్రంప్‌చేసిన హెచ్చరికలు, వాటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం చాలా పరిమితంగానే ఉంటుందని ప్రముఖ పరిశ్రమల సమాఖ్య పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల దేశ జీడీపీపై కేవలం 0.19 శాతం మేరకే ప్రభావం ఉంటుందని బుధవారం విడుదల చేసిన ఒక నివేదికలో అంచనా వేసింది. ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్న ఈ సుంకాల వల్ల అమెరికాకు భారత్ నుంచి వెళ్లే సుమారు 8.1 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఇది భారతదేశ మొత్తం అంతర్జాతీయ వాణిజ్య ఎగుమతుల్లో 1.87 శాతానికి సమానమని పీహెచ్‌డీసీసీఐ తెలిపింది. తమ విశ్లేషణ ప్రకారం, స్థూల ఆర్థిక స్థాయిలో ఈ ప్రభావం నిర్వహించదగినదేనని పేర్కొంది. అమెరికా విధించనున్న ఈ టారిఫ్‌ల వల్ల ప్రధానంగా ఇంజనీరింగ్ వస్తువులు (1.8 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రానిక్ వస్తువులు (1.4 బిలియన్ డాలర్లు), ఫార్మాస్యూటికల్స్ (986 మిలియన్ డాలర్లు), రత్నాలు, ఆభరణాలు (932 మిలియన్ డాలర్లు), రెడీమేడ్ దుస్తులు (500 మిలియన్ డాలర్లు) వంటి రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదిక వివరించింది. ఈ సుంకాల ప్రభావాన్ని అధిగమించేందుకు పీహెచ్‌డీసీసీఐ నాలుగు సూత్రాల వ్యూహాన్ని ప్రతిపాదించింది. అమెరికాలోని ప్రముఖ రిటైలర్లతో చర్చించి, మెరుగైన ధరలకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఐరోపా సమాఖ్య (ఈయూ), కెనడా, లాటిన్ అమెరికా వంటి కొత్త మార్కెట్లపై దృష్టి సారించడం వంటివి ఈ వ్యూహంలో భాగమని తెలిపింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.